సోమవారం
29•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 34
• పేజీలు: 16 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




# జైపాల్‌రెడ్డి కన్నుమూత



## దివికేగిన రాజకీయ దిగ్గజం

సూదిని జైపాల్‌రెడ్డి

### అనారోగ్యంతో హైదరాబాద్ దవాఖానలో తుదిశ్వాస

**దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని ■ ఘనంగా నివాళి అర్పించిన సీఎం కేసీఆర్**

**నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**

దేశం ఒక పరిణతి కలిగిన నాయకుడ్ని కోల్పోయింది. ఒక విజ్ఞాన ఖని కనుమరుగైపోయింది. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన రాజనీతిజ్ఞుడు, రాజకీయాలకు అతీతంగా అందరి స్నేహాన్ని చూరగొన్న అజాత శత్రువు, బహుభాషా కోవిదుడు, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కీర్తి గడించిన నేత, కేంద్ర మాజీ మంత్రి, రాజ్యాంగ నిపుణుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని జైపాల్‌రెడ్డి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని దవాఖానలో కన్నుమూశారు. జైపాల్‌రెడ్డి మృతి పట్ల యావద్దేశం శోకతప్తమైంది. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్‌లోని జైపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొన్నారు. సోమవారం అధికార లాంఛనాలతో జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు జరుగనున్నాయి.

- పలుశాఖలకు కేంద్రమంత్రిగా సేవలు
- ప్రసారభారతి బిల్లులో కీలక పాత్ర
- ఎమర్జెన్సీని ఎదిరించి.. ఇందిరాగాంధీపైనే పోటీచేసిన ధీశాలి
- ఎఫ్‌ఎం రేడియో చానళ్ల విస్తృతికి కృషి

వివరాలు 8వ పేజీలో



ఆదివారం హైదరాబాద్‌లో జైపాల్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ కే కేశవరావు, టీఆర్‌ఎస్ నేత గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.



## మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ పరిస్థితి విషమం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 9 గంటలకు ఆయనను అపోలో దవాఖానకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నదని అపోలో వైద్యులు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి సోకడంతో ముఖేశ్‌గౌడ్ కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అపోలో హాస్పిటల్‌కు వెళ్లి ముఖేశ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న మాట

మిగతా 8వ పేజీలో

### గోదావరిఖనిలో కాళేశ్వరం జలజాతర



3

గోదావరికి సారె అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌తోపాటు ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బాల్కసుమన్

# పునరుజ్జీవన గంగ

### గోదావరి 110 కిలోమీటర్ల మేర జలకళ

**నేడు సుందిల్ల పంపుహౌస్ నుంచి ఎల్లంపల్లికి జలాల ఎత్తిపోత**

**కాళేశ్వరం లింక్-1 జలాల తరలింపు నేటితో విజయవంతం**

**వచ్చేనెల 5 నుంచి లింక్-2 ప్రారంభానికి సన్నాహాలు**

**కన్నెపల్లిలో మూడు, అన్నారంలో నాలుగు మోటర్లతో ఎత్తిపోత**

**రేపు నందిమేడారంలో ఐదో మోటరు వెట్‌రన్**

ఎగువ నుంచి చుక్కనీరు రాకపోయినా గోదావరిలో జలకళ ఉట్టిపడుతున్నది. ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 110 కిలోమీటర్ల పొడవున నదీమార్గం ప్రాణహిత జలాలతో కళకళలాడుతున్నది. కడలివైపు పరుగులు పెట్టే గోదావరి జలాలు కాళేశ్వర మంత్రంతో తెలంగాణ గడ్డపైనే తొణికిసలాడుతున్నాయి. భారీ మోటర్లతో నిరంతరాయంగా ఎత్తిపోత కొనసాగుతున్నది. సోమవారం సుందిల్ల పంపుహౌస్‌లో ఒక మోటరు ద్వారా చేపట్టనున్న ఎత్తిపోతలతో ప్రాణహిత జలాలు ఎల్లంపల్లికి చేరుకోనున్నాయి. దీంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మూడు బరాజ్‌లు, మూడు పంపుహౌస్‌లతో కూడిన అత్యంత కీలకమైన లింక్-1 పరిపూర్ణం కానున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండో లింక్‌పైనా దృష్టిసారించింది. వచ్చే నెల ఐదోతేదీన ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు దిశగా గోదావరిజలాల ప్రయాణం ప్రారంభమయ్యే అవకాశమున్నది.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ, కాళేశ్వరం/మహదేవ్‌పూర్/మంథని:**

ప్రపంచంలోనే అద్భుత నిర్మాణమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో గోదావరికి పునరుజ్జీవనం వచ్చింది. భౌగోళికంగా ప్రధాన గోదావరికి ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి లేదా మంజీరా నుంచి వరద వస్తుంది. కానీ, దాదాపు దశాబ్దకాలానికి పైగా ఆ పరిస్థితి లేకపోవడంతో ఉత్తరతెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ జలసంకల్పంతో సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్ చేపట్టారు. అందులోభాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. ఇందుకోసం నీటిలభ్యత సమృద్ధిగా ఉన్న ప్రాణహిత జలాలు గోదావరిలో కలిసిన తర్వాత వాటి గమనాన్ని మార్చేలా డిజైన్ తయారుచేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా

మిగతా 3వ పేజీలో



ఆదివారం అంతర్గాం మండలం గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్ హెడ్ రెగ్యులేటరీ గేట్ల వద్ద జలకళ

#### బరాజ్‌లలో నీటి నిల్వలు

మేడిగడ్డ
4.2 టీఎంసీలు

అన్నారం
7.77 టీఎంసీలు

సుందిల్ల
4.67 టీఎంసీలు

## నేడు జూరాలకు కృష్ణమ్మ

- నారాయణపుర నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల
- అవుట్‌ఫ్లో లక్ష క్యూసెక్కులకు చేరే అవకాశం
- నేటి అర్ధరాత్రికి జూరాల జలాశయానికి చేరనున్న జలాలు
- భారీవర్షాలతో ఎగువనుంచి ఉధృతంగా వస్తున్న వరద
- తుంగభద్రకు స్థిరంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

3



ఆదివారం కురిసిన భారీ వర్షానికి జిన్నెలవాగులోకి భారీగా వచ్చిన వరదనీరు

## విస్తారంగా వర్షాలు

- ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా..
- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు
- తెగిన రోడ్లు.. పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

7

### రెండ్రోజుల్లో మరో అల్పపీడనం

- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- మరింత చురుకుగా రుతుపవనాలు
- నేడు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

2

#### చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

#### గుడ్ల ధరలు (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 308.00 | రంగారెడ్డి | 308.00 |
| మెదక్ | 308.00 | కరీంనగర్ | 311.00 |
| వరంగల్ | 311.00 | చిల్లర ధర | 3.70 |

### ధర్మగంట

## తప్పులు చేశాం.. తన్నుకు చావండి!

- చీలికలు పేలికలుగా భూ మార్పిడి
- ఒక సర్వే నంబర్‌కు అనేక బై నంబర్లు
- వాస్తవంగా ఉన్న భూమికంటే రికార్డుల్లో అధికం
- దరఖాస్తులకు స్పందించని అధికారులు
- గతంలో జరిగిన తప్పులకు మేమేం చేయగలమంటున్న తాసిల్దార్
- మహబూబ్‌నగర్ జిల్లా వేములలో రెవెన్యూ అధికారుల అలసత్వం

9

### మరో 14 మంది రెబల్ ఎమ్మెల్యేలపై

## అనర్హత వేటు

- కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ సంచలన నిర్ణయం
- ముఖ్యమంత్రికి పరోక్షంగా లబ్ధి!
- అసెంబ్లీలో నేడే యెడియూరప్ప విశ్వాస పరీక్ష

5



## మేరికోం పసిడి పంచ్

ప్రెసిడెంట్స్ కప్ టోర్నీ ఫైనల్లో ఫ్రాంక్స్‌పై అలవోక విజయం

వివరాలు ఆటలో








ఆదివారం హైదరాబాద్ పాతనగరం లాల్‌దర్వాజలోని సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు, భక్తులు





లాల్‌దర్వాజలోని సింహవాహిని మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, పాడి పరిశ్రమాభివృద్ధి, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ



అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి, బీజేపీ నేత రామచంద్రారెడ్డి



# తడుస్తూ.. తల్లిసేవలో

- లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళికి బోనాలు సమర్పించిన భక్తజనం
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ప్రత్యేక ఆకర్షణగా సినీనటులు విజయశాంతి, సుమన్, టీవీ ఆర్టిస్టులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** భాగ్యనగరం బోనమెత్తింది. జంటనగరాల్లో ఆదివారం బోనాల పండుగ అంబరాన్నంటింది. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్‌లోనే తొలుత నిర్వహించే ఆషాఢ బోనాల వేడుక పాతబస్తీ బోనాల నిర్వహణతో తుది ఘట్టానికి చేరుకుంది. డప్పు దరువుల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు ప్రధానంగా ఆకట్టుకుంది. సోమవారం ఘటాల ఊరేగింపుతో హైదరాబాద్‌లో బోనాల వేడుక ముగియనున్నది. కాగా, ఓల్డ్‌సిటీ లాల్‌దర్వాజలోని సింహవాహిని మహంకాళి అమ్మవారికి ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, పాడి పరిశ్రమాభివృద్ధి, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంతోపాటు మీర్ ఆలం మండి, ఉప్పుగూడ, గౌలిపుర ప్రాంతాల్లోని అమ్మవార్లను దర్శనాలు చేసుకున్న మంత్రులు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను అందించారు. కార్వాన్, సబ్జిమండి ఆలయాల్లో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునుంచే పాతనగరంలోని ప్రధాన ఆలయాలైన లాల్‌దర్వాజలోని సింహవాహిని అమ్మవారి దేవాలయంతోపాటు అక్కన్న మాదన్న, భాగ్యలక్ష్మి, శ్రీ మహాకాళేశ్వర, ఉప్పుగూడ, గౌలిపుర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాలు ప్రత్యేక అలంకరణతో కళకళలాడాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వేలమంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అప్పుడప్పుడు వర్షం వస్తూ పోతూ ఉన్నా.. తడుస్తూనే తల్లిసేవలో తరలించారు. మాజీ ఎంపీ, సినీనటి విజయశాంతి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డితోపాటు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే పొన్నాల లక్ష్మయ్య, ఎంపీ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీసీ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సినీనటులు సుమన్, టీవీ ఆర్టిస్టులు సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆసిఫ్‌నగర్‌లోని జగదాంబ ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. సబ్జిమండిలో నిర్వహించిన అంబారి ఊరేగింపులో గోషామహల్ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ పాల్గొన్నారు.



ఆదివారం చార్మినార్ వద్ద బోనంతో చిన్నారి

న్యాయ వ్యవస్థపై

# నమ్మకం పెంచాలి

కోర్టు భవన ప్రారంభోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొందించేలా కేసులను త్వరగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. సామాన్యుల సమస్యలు పరిష్కరించేందుకు జడ్జీలు, లాయర్లు పరస్పరం సమిష్టిగా కృషిచేయాలని, అందరూ పని సంస్కృతిని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లో సిటీ సివిల్‌కోర్టు భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం సడలిపోకుండా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులదేనని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి కోర్టులకు సామాన్య ప్రజలు ఎక్కువ వస్తుంటారని, సకాలంలో స్పందించి వారికి సాంత్వన కలిగించాలని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో ఉండేవారు నిత్య విద్యార్థిగా మారాలని చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.12 కోట్లతో నిర్మించిన కోర్టు భవనం ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని పేర్కొన్నారు. కోర్టుల్లో మౌలికవసతులు మెరుగుపడు తాయని, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న న్యాయస్థా నాలకు కొత్త సదుపాయాలు కల్పిస్తారని ఆశిస్తు న్నట్టు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, చీఫ్ జడ్జి సుమలత, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్, అడ్వకేట్ జనరల్ డీఎస్ ప్రసాద్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, బీసీఐ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి, బార్‌కౌన్సిల్ మెంబర్లు గండ్ర మోహన్‌రావు, ముఖీదు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం సికింద్రాబాద్‌లో సిటీ సివిల్ కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి, రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

హైదరాబాద్ కమిషనరేట్‌లోనూ

## ఐసీజేఎస్ విధానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్) విధానాన్ని అమల్లోకి తెచ్చినట్టు సమాచారం. దేశంలోనే తొలిసారిగా పైలట్‌ప్రాజెక్టు కింద వరంగల్ జిల్లా సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ప్రారంభించిన ఐసీజేఎస్ విజయవంతం కావడంతో హైదరాబాద్ కమిషనరేట్‌లోనూ దీన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో దశలవారీగా ఈ విధానాన్ని విస్తరించనున్నట్టు పోలీస్‌ఉన్నతాధికారులు తెలిపారు.

**ముహూర్తం**



సూర్యోదయం: 5.58 గంటలకు



సూర్యాస్తమయం: 6.47 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, ద్వాదశి సాయంత్రం 5.11 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: మృగశిర సాయంత్రం 6.23 వరకు, తదుపరి ఆరుద్ర, అమృత ఘడియలు: ఉదయం 9.55 నుంచి 11.31 వరకు, రాహుకాలం: ఉదయం 7.34 నుంచి 9.10 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.57 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.22 నుంచి 4.13 వరకు, వర్జ్యం: లేదు.

# మెట్ట పంటలకు జీవం

- ఊపిరిపోసిన వర్షాలు
- ఇప్పటివరకు 67% పంటల సాగు
- ఊపందుకోనున్న వరిసాగు

**హైదారాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా వారంరోజులుగా నుంచి వర్షాలు పుంజుకున్నాయి. వరుస వర్షాలు మెట్ట పంటలకు జీవం పోశాయి. ప్రస్తుత వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రైతులు పెద్దఎత్తున జొన్న, మొక్కజొన్న, పత్తి, కంది లాంటి మెట్ట పంటలు వేశారు. తొలకరి జల్లుల తర్వాత వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మొలకలు వాడుదశకు చేరాయి. దీంతో ఆందోళన చెందుతున్న రైతులకు గత వారం నుంచి కురుస్తున్న వర్షాలు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. రానున్న రెండునెలల్లో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో వరిసాగుపై రైతులు ఆశాభావంతో ఉన్నారు. ప్రస్తుత వానకాల సీజన్‌లో 58 రోజులు గడిచాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 27,64,744 హెక్టార్లలో 67 శాతం పంటలు సాగయ్యాయి. వరిసాగు సాధారణ విస్తీర్ణం 9,64,548 హెక్టార్లుకాగా.. ఇప్పటివరకు 2,14,386 హెక్టార్లు సాగు అయ్యింది. మిగతా పంటల సాగు దాదాపుగా పూర్తయింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో వరిసాగు కూడా పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. వరిని మినహాయిస్తే ఇప్పటివరకు జొన్న 95 శాతం, కందులు 97 శాతం, పత్తి 96 శాతం, పసుపు 101 శాతం, రాగులు 159 శాతం, కందులు, పెసర్లు, మినుములు మినహా ఇతర పప్పుధాన్యాలు 114 శాతం, పొద్దుతిరుగుడు 266 శాతం, సోయాబీన్ 101 శాతం, ఇతర నూనెగింజలు 131 శాతం, చెరకు 114 శాతం, ఇతర ఆహార పంటలు 126 శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గత వారంరోజుల్లో 4 నుంచి 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, నిర్మల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 7 నుంచి 8 సెం.మీ. వర్షపాతం నమోదవగా.. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 4 నుంచి 5 సెం.మీ. వానలు కురిశాయి. ఈ వర్షాలతో దుక్కులు తడిసి ఉన్నాయి. నార్లు పెరుగడానికి ఈ వానలు దోహదపడ్డాయి.



జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో పత్తిచేనులో కలుపుతీస్తున్న కూలీలు

# రెండ్రోజుల్లో మరో అల్పపీడనం

- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- మరింత చురుకుగా రుతుపవనాలు
- నేడు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రెండ్రోజుల్లో వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉపరితల ఆవర్తనం వల్ల తెలంగాణలో రుతుపవనాలు మరింత చురుకుగా ముందుకు కదులుతున్నాయని చెప్పారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. జార్ఖండ్ దానిని ఆనుకుని ఉన్న పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో రెండ్రోజులుగా కొనసాగుతున్న అల్పపీడనం బలహీనంగా మారిందని అధికారులు తెలిపారు. కాగా, శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లి, జగిత్యాల, ములుగు, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

## గ్రేటర్ హైదరాబాద్‌లో విస్తారంగా వానలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ హైదరాబాద్ తడిసి ముద్దయింది. గాలిలో తేమశాతం అధికంగా ఉండటం, రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో సోమ, మంగళవారాల్లోనూ విస్తారంగా వానలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం నగరంలోని రాజేంద్రనగర్, ఓల్డ్‌సిటీ, మెహిదీపట్నం, సరూర్‌నగర్, నాగోల్, హయత్‌నగర్, ఉప్పల్, శామీర్‌పేట, మహేశ్వరం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, కార్వాన్, మేడ్చల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో 1.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 26.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 83 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు.

# ముంచుకొస్తున్న విద్యుత్ ముప్పు!


- లెటర్ ఆఫ్ క్రెడిట్ నిబంధనతో తల్లడిల్లుతున్న డిస్కంలు
- ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్న కేంద్ర నిబంధనలు
- తెలంగాణ డిస్కంలు ప్రతినెలా రూ.1,100 కోట్లు చెల్లించాలి
- విద్యుత్ కమిటీల లేఖలకు కేంద్రంనుంచి స్పందన శూన్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా విద్యుత్ ముప్పు ముంచుకొస్తున్నది. తాజాగా కేంద్రం విధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్సీ) నిబంధనను అమలుచేస్తుండటంతో డిస్కంలు తల్లడిల్లుతున్నాయి. కేంద్ర విద్యుదుత్పత్తి కేంద్రాల (సీజీఎస్) నుంచి, ఇతర ప్రైవేటు సంస్థల నుంచి తీసుకుంటున్న విద్యుత్‌కు ముందస్తుగా బ్యాంకు గ్యారంటీ తరహాలోనే ఎల్సీ రూపంలో బ్యాంకులో సరిపోను డబ్బు డిపాజిట్ చేయాలి. దీంతో సదరు బ్యాంకు ఎల్సీ జారీచేస్తుంది. నెల తిరిగేకల్లా సీజీఎస్, ప్రైవేటు సంస్థల నుంచి తీసుకున్న విద్యుత్‌కు సంబంధించిన బకాయిలను సదరు బ్యాంకే చెల్లిస్తుంది. మళ్లీ డబ్బును డిస్కం డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇలా కొత్త నిబంధన ప్రకారం డిస్కంలు ఎల్సీలు ఇచ్చేందుకు తల్లడిల్లుతున్నాయి. నిజానికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ అన్ని డిస్కంలు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నాయి. తాజాగా కేంద్రం విధించిన ఎల్సీ సమర్పించాలనే నిబంధనను అన్ని డిస్కంలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై అన్ని రీజినల్ పవర్ కమిటీలు (ఆర్పీసీ) కేంద్రానికి విజ్ఞప్తిచేశాయి. దక్షిణ ప్రాంత విద్యుత్ కమిటీ (ఎస్ఆర్పీసీ) కూడా కేంద్రానికి లేఖ రాసింది. ఎల్సీ సమర్పించేందుకు గడువు ఇవ్వాలని, పైగా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా.. ముందుగా అన్ని డిస్కంలతో సమావేశాలు నిర్వహించాలని కోరింది. ఇదే మాదిరిగా అన్ని ప్రాంతాల విద్యుత్ కమిటీలు కూడా లేఖలు రాసినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా ఈ నిబంధన ఆగస్టు 1 నుంచే అమలులోకి రానున్నది. మన రాష్ట్రంలోని డిస్కంల పరిస్థితి కూడా అలాగే ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో వినియోగిస్తున్న మొత్తం విద్యుత్‌లో దాదాపు సగం కంటే ఎక్కువగా విద్యుత్ సీజీఎస్, ప్రైవేటు, ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్నదే. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన డిస్కంలు ప్రతినెలా దాదాపు రూ.1,100 కోట్ల వరకు డబ్బు చెల్లించి ఎల్సీ తీసుకోవాల్సి ఉంటుంది. అకస్మాత్తుగా ప్రతినెలా అంత పెద్దమొత్తం చెల్లించడమంటే డిస్కంలకు తీవ్ర ఇబ్బందికరమే. ఇదే విషయాన్ని ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. అవసరమైతే పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించటంలేదు. పైగా దేశవ్యాప్తంగా గ్రిడ్ వ్యవహారాలు చూసే సంస్థ కూడా ఈ విషయంపై కేంద్రానికి లేఖ రాసింది. ఆగస్టు ఒకటి నుంచి ఎల్సీ సమర్పించడానికి కేవలం రెండేరోజుల సమయం ఉండటం.. డిస్కంలు పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో ఉండటంతో విద్యుత్ ప్రమాదం పొంచి ఉందనే చెప్పవచ్చు.

## రాష్ట్ర విద్యుత్ సంస్థలను ముంచనున్న కేంద్ర నిర్ణయం

- విద్యుత్ రాయితీలు, ఉచిత విద్యుత్తు సరఫరా కష్టసాధ్యం
- ఏఐపీఈఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శుల ఆందోళన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర, ఇతర ప్రైవేట్ విద్యుదుత్పత్తి కేంద్రాల నుంచి మాత్రమే విద్యుత్ కొనుగోలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ విధానం అమలులోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ జాతీయ (ఏఐపీఈఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు శైలేంద్ర దూబె, రత్నాకర్‌రావు తెలిపారు. విద్యుత్ ఇంజినీర్స్‌భవన్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్సీ) కారణంగా విద్యుదుత్పత్తి సంస్థలు, అన్ని రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు అతిపెద్ద సంక్షోభంలో పడే ప్రమాదం ఉందన్నారు. తద్వారా ప్రత్యక్షంగా నిరంతర విద్యుత్ సరఫరాకు తీవ్ర విఘాతం కలిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. ఈ నిర్ణయంతో ప్రతి డిస్కం కంపెనీ ఒక వారం, పక్షం, నెల ముందే రాష్ట్ర అవసరాలకు సంబంధించి కొనాల్సిన విద్యుత్‌కు కేంద్ర, ప్రైవేటు సంస్థలకు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రవేశపెట్టే ఎల్సీ వల్ల రాష్ట్ర ప్రభుత్వం బలహీనవర్గాలకు, రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్, రాష్ట్ర విద్యుత్ సంస్థల బకాయిల చెల్లింపుల్లో తీవ్రజాప్యమవుతుందన్నారు. కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 31న ఢిల్లీలో విద్యుత్‌రంగానికి చెందిన అన్ని జాతీయ స్థాయి ఇంజినీర్లు, ఉద్యోగ సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆ సమావేశంలో తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీ సదానందం, సంఘం ప్రతినిధులు కే కిరణ్‌కుమార్, శివశంకర్, జనప్రియ, సురేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఇంజినీర్స్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఏఐపీఈఎఫ్ నేతలు

**లోకం పోకడ**



ఇక నువ్వు నిశ్చింతగా ఉండు.. ఇప్పుడెవడు గొలుసులు లాగేస్తారో నేనూ చూస్తా!



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు అన్వేశ్‌రెడ్డి, ప్రభాకర్, యాదాగౌడ్, దేవరాం తదితరులు

## 5 రోజుల్లో పసుపుబోర్డు హామీ ఏమైంది?

- రైతులకు రాసిచ్చిన బాండ్ పేపర్ సంగతేంది?
- హామీని నిలబెట్టుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన
- ఎంపీ అరవింద్‌కు అఖిలపక్ష నాయకుల హెచ్చరిక

**ఆర్మూర్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ ఎంపీగా తనను గెలిపిస్తే 5 రోజుల్లో పసుపు బోర్డును ఏర్పాటుచేస్తానని చెప్పిన ధర్మపురి అరవింద్.. ఆ హామీని ఏమిచేశారని అఖిలపక్ష నాయకులు అన్వేశ్‌రెడ్డి, ప్రభాకర్, దేగాం యాదాగౌడ్, దేవరాం ప్రశ్నించారు. ఆదివారం వారు ఆర్మూర్‌లోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రైతు నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పసుపుబోర్డును ఏర్పాటుచేయకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని కల్లబొల్లి మాటలతో రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చిన అరవింద్.. ఇప్పటికి 55 రోజులు గడిచినా పసుపుబోర్డు గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోనందున అరవింద్ వెంటనే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని, ఈ నెల 26న ఢిల్లీ కృషిభవన్‌లో జరిగిన సమావేశంలో పసుపు బోర్డు గురించి ఏం మాట్లాడారో చెప్పాలని డిమాండ్ చేశారు. కృషిభవన్‌లో సమావేశాన్ని కేవలం కాలయాపన కోసమే నిర్వహించారని, దీనివల్ల రైతులకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. పసుపుబోర్డు ఏర్పాటు విషయాన్ని నిజామాబాద్ రైతులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఏమీ తెలియనట్టు వ్యవహరించారని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. ఎంపీ అరవింద్ అసలు పసుపు బోర్డు విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదేమోనని అనుమానాలను వ్యక్తంచేశారు. పసుపుబోర్డుపై సరైన ప్రకటనచేయని అరవింద్.. ఇక బోధన్ షుగర్‌ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పసుపుబోర్డు విషయంలో అరవింద్ తన హామీని నిలబెట్టుకోకపోతే రైతులతో కలిసి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు సుర్బిర్యాల్ గంగారెడ్డి, కోల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన గుట్టలపై నుంచి వస్తున్న నీటితో ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కనువిందు చేస్తున్నది. తెలంగాణ నయాగరాగా పిలిచే బొగత వద్ద 50 అడుగుల పైనుంచి దుంకుతున్న నీటిపరవళ్లను తిలకించేందుకు ఆదివారం పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. సందర్శకుల రక్షణ కోసం గజ ఈతగాళ్లు, రక్షణ టీం సభ్యులను మోహరించి వరద నీటిలో దిగకుండా చూశారు. -వాజేడు(ములుగు)



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని సీతానగరం గ్రామ శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాద జలపాతం ఆదివారం ఉదయం నుంచి కొండలపై నుంచి జాలువారుతున్నది. దీంతో పర్యాటకుల రాక మొదలైంది. - గూడూరు



భారీ వర్షాలకు పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ శివారులోని గౌరీగుండాల జలపాతం జలకళను సంతరించుకున్నది. ఆదివారం సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. -పెద్దపల్లి కలెక్టరేట్



జలాభిషేకం



ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద సందర్శకుల తాకిడి



కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మూడు మోటర్ల పైపుల నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి విడుదలవుతున్న నీరు



మంథని మండలం సిరిపురంలోని సుందిల్ల బరాజ్‌లో నీటి నిల్వ

## కాంగ్రెస్ నేతలవి మూర్ఖపుమాటలు

- నిన్నటిదాకా నీళ్లే రావన్నరు.. నేడు ఖర్చెక్కువ అంటున్నరు: మంత్రి కొప్పుల
- గోదావరిఖనిలో ఘనంగా 'కాళేశ్వరం జలజాతర'



గోదావరిఖని గోదావరి వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బాల్కసుమన్

**మంథని, నమస్తే తెలంగాణ/ఫెర్టిలైజర్‌సిటీ/యైటింక్లైన్‌కాలనీ:** 'డబ్బు ఖర్చుపెట్టకుండా ఏదైనా జరుగుతుందా.. వంద రూపాయల ప్రయోజనం కలగాలంటే పది రూపాయలయినా ఖర్చుపెట్టొద్దా.. కుండల అన్నం కుండలే ఉంటే పిల్లాడు ఎట్ల పెరుగుతడు.. కాంగ్రెస్ నాయకులు మూర్ఖంగా మాట్లాడుతున్నరు' అని సంక్షేమశాఖమంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరి తీరంలో నిర్వహించిన 'కాళేశ్వరం జలజాతర' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాణహిత జలాలను ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. ఎదురెక్కి నీళ్లువస్తయా..? అని ఎద్దేవా చేసినవారు.. నీరు ఎదురెక్కుతుంటే నేడు వేలకోట్ల ఖర్చుఅంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఎందుకివ్వలేదో బీజేపీ నాయకులు తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు సాగు నీటిని అందించేందుకు రూ. 35 కోట్లతో వరద కాల్వ లింక్ కెనాల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### జనసంద్రమైన జలజాతర

'కాళేశ్వర జలజాతర' జనజాతరగా మారింది. రైతులు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే బాల్కసుమన్‌నదీమాతకు పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాలతో అభిషేకం చేశారు. భారీగా తరలివచ్చినవారితో వారు సామూహిక వనభోజనాలు చేశారు. 10వేల మంది కోసం ప్రత్యేకంగా వంటలు సిద్ధంచేశారు. బతుకమ్మలు, బోనాలు, కోలాటం, గుస్సాడీ, ఒగ్గుడోలు నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆట, పాటలు అలరించాయి.



భోజనాల వద్ద బారులు తీరిన ప్రజలు

# పునరుజ్జీవన గంగ

మొదటిపేజీ తరువాయి...

నదీగమనాన్ని మార్చి.. జలాలను వెనక్కు తరలించుకుపోయే ప్రక్రియకు శ్రీకారంచుట్టారు. ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లతోపాటు కన్నెపల్లి, అన్నారం, సుందిల్ల పంపుహౌస్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. రికార్డు సమయంలో పనులు పూర్తి చేసి గత నెల 21వ తేదీన ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుంచి ఒకవైపు బరాజ్‌ల్లో జలాలను ఒడిసిపట్టడం, అక్కడి నుంచి ఎత్తిపోసుకుంటూ వెనక్కి తరలించే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతున్నది. ప్రస్తుతం మూడు బరాజ్‌లలో కలిపి మొత్తం 17.90 టీఎంసీల నీటిని నిల్వచేశారు. సోమవారం సుందిల్ల పంపుహౌజ్ నుంచి తొలిమోటరు ద్వారా ఎత్తిపోతల ప్రారంభిస్తున్నట్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ప్రక్రియ మొదలుకాగానే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లంపల్లి జలాశయాన్ని ప్రాణహిత జలాలు ముద్దాడనున్నాయి. ఫలితంగా మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 110 కిలోమీటర్ల పొడవున కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లింక్-1 విజయవంతంగా పూర్తయినట్టే.

### వచ్చేనెల ఐదున రెండో ఘట్టం

కాళేశ్వరం ప్రాజెక్టులో మొదటిలింకు జలాల తరలింపు విజయవంతంకావడం, మరోవైపు భారీవర్షాలతో ప్రధాన గోదావరిలోనూ వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రభుత్వం రెండో లింకుపై దృష్టిసారించింది. ఇప్పటికే ఇందులో భాగమైన నందిమేడారం పంపుహౌస్ నాలుగు మోటర్ల వెట్‌రన్ కూడా పూర్తయింది. మంగళవారం ఐదో మోటరు వెట్‌రన్ చేపట్టనున్నారు. ఇందుకుగాను ఎల్లంపల్లి నుంచి జలాల్ని విడుదల చేసి.. పావుగంటపాటు నందిమేడారంలోని ఐదో మోటరు ద్వారా నీటి ఎత్తిపోతను పరీక్షించనున్నారు. ఇక్కడి నుంచి జలాలను తరలించే సొరంగ మార్గం (ప్యాకేజీ-7)లో క్లీనింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. ప్యాకేజీ-8లో భాగంగా రామడుగు పంపుహౌస్‌లోని బాహుబలి మోటర్లు ఐదు సిద్ధంగా ఉన్నాయి.



మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి డెలివరీ చానల్‌లో దూకుతున్న జలాలు

### కన్నెపల్లిలో మూడు మోటర్లతో ఎత్తిపోత

కన్నెపల్లి పంప్‌హౌస్‌లో నుంచి ఆదివారం మూడుమోటర్ల ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగాయి. దీంతో 6 టీఎంసీల నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు చేరింది. ఇప్పటివరకు మొత్తంగా కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని ఆరుమోటర్ల ద్వారా 11.9 టీఎంసీల జలాలు అన్నారం బరాజ్‌కు చేరాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద గోదావరి 5,000 క్యూసెక్కులుగా పారుతున్నదని అధికారులు తెలిపారు. నిన్నటివరకు 8వేల క్యూసెక్కులుగా పారిన గోదావరి 5 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ఎగువ నుంచి వస్తున్న వరదను పరిగణనలోకి తీసుకుంటూ కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లను నడుపుతున్నారు. శనివారం 4.5 టీఎంసీల నీటినిల్వ ఉండగా, ఆదివారం 0.3 టీఎంసీల మేర తగ్గింది. అన్నారం బరాజ్‌కు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఆదివారం 6 టీఎంసీల జలాలు చేరాయి. పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటర్ల ద్వారా 10,400 క్యూసెక్కుల నీటిని సుందిల్ల బరాజ్‌కు తరలించారు. ప్రస్తుతం అన్నారం బరాజ్‌లో 7.77 టీఎంసీల నీరు ఉంది.

### సుందిళ్ల బరాజ్‌లోకి 4.67 టీఎంసీలు..

సుందిళ్ల బరాజ్ నిండుకుండలా మారింది. మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్ల ద్వారా ఎత్తిపోస్తుండడంతో బరాజ్‌కు భారీగా నీరు చేరుతున్నది. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు బరాజ్‌లో నీటిమట్టం 126.95 మీటర్లకు పెరిగింది. 4.67 టీఎంసీల నీరునిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

### కన్నెపల్లిని సందర్శించిన పదివేలమంది

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ఆదివారం పదివేల మందికిపైగా సందర్శించారు. భారీవర్షం పడుతున్నా లెక్కచేయకుండా పంప్‌హౌస్ చూసేందుకు తరలివచ్చారు. పెద్దఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. అదే సమయంలో భారీ వర్షం కురియడంతో కొన్ని వాహనాలు బురదలో కూరుకుపోయి ఇబ్బందిపడ్డారు. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వాహనాలను నిలిపి కాలినడకన వెళ్లి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారు.

### ఎల్లంపల్లికి ఎత్తిపోసేందుకు రంగం సిద్ధం

మేడిగడ్డ బరాజ్ నుంచి అన్నారం బరాజ్, సుందిళ్ల బరాజ్‌ను దాటుకొని అంతర్గాం మండలం గోలివాడలోని సుందిళ్ల పంప్‌హౌస్‌కు చేరుకున్న జలాలను ఎల్లంపల్లి బరాజ్‌కు ఎత్తిపోసేందుకు రంగం సిద్ధమయింది. అన్నారం పంప్‌హౌస్ నుంచి నిత్యం నాలుగు మోటర్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతుండటంతో సుందిళ్ల బరాజ్ నిండుకుండలా మారింది. ఇప్పటికే గోలివాడలోని సుందిళ్ల పంప్‌హౌస్ ఫోర్‌బేలోకి జలాలు చేరాయి. ఇక్కడ ఆరుమోటర్లు ఎత్తిపోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి ఆధ్వర్యంలో తొలి మోటర్‌కు వెట్‌రన్ ప్రక్రియను ప్రారంభించారు. సోమవారం సాయంత్రానికి వెట్‌రన్ ప్రక్రియ పూర్తిచేసి, ఎల్లంపల్లి బరాజ్‌కు నీటిని ఎత్తిపోస్తామని ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు.



తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద నీరు

## గోదావరికి వరద పోటు

- దేవాదుల వద్ద 76.30 మీటర్ల ప్రవాహం
- తుపాకులగూడెం బరాజ్ వద్ద నిలిచిన నిర్మాణపనులు
- భద్రాచలం వద్ద 16.5 అడుగులు దాటిన ప్రవాహం

**ఏటూరునాగారం/ కడెం/ భద్రాచలం/ చర్ల రూరల్:** ఎగువ ప్రాంతాలతోపాటు, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి నదీ ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ వానకాలంలో తొలిసారిగా గోదావరి ఉధృతి అధికంగా పెరిగింది. ములుగు జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకం వద్ద నది పరవళ్లు తొక్కుతున్నది. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి ఆదివారం సాయంత్రం 76.30 మీటర్లకు చేరుకున్నది. తుపాకులగూడెం బరాజ్ ప్రాంతంలో గోదావరి నీటిమట్టం పెరగడంతో బరాజ్ నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. దేవాదుల ఇన్‌టేక్ వెల్ నుంచి ప్రస్తుతం ఒక మోటర్ ద్వారా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీటిమట్టం 19 అడుగులకు చేరుకున్నది. వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు 14.6 అడుగుల నీరు వచ్చింది.

### కడెం జలాశయంలోకి భారీ వరద

నిర్మల్ జిల్లాలో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కడెం జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతున్నది. ఆదివారం 2,682 క్యూసెక్కుల వరద వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. ఆదివారం ఉదయం 6 గంటలకు 14.3 అడుగులు ఉన్న గోదావరి మధ్యాహ్నం 12 గంటలకు 15.3 అడుగులకు, సాయంత్రం 6 గంటలకు 16.5 అడుగులు దాటి ప్రవహిస్తున్నది. దీంతో స్నానఘట్టాలు నీటమునిగాయి. సోమవారం ఉదయం నాటికి 20 అడుగులు దాటే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం మండలంలో గోదావరి ఆనకట్ట వద్ద 9.5 అడుగుల గోదావరి నీటిమట్టం చేరుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తాలిపేరు ప్రాజెక్టులోకి వరద ఆదివారం ఉగ్రరూపం దాల్చింది. దీంతో తాలిపేరు ప్రాజెక్టుకున్న 25 క్రస్ట్‌గేట్లలో 21గేట్లు ఎత్తి 84,000 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి వదులుతున్నారు. గంటగంటకు ప్రాజెక్టులోకి వరద పెరుగుతున్నది. ప్రాజెక్టు డీఈఈ తిరుపతి, ఏఈ వెంకటేశ్వరరావు డ్యామ్‌వద్దే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆదివారం రాత్రి వరద ఉధృతి పెరిగితే మిగిలిన గేట్లనూ ఎత్తివేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.



దేవాదుల ఇన్‌టేక్ వెల్ ఎగువ భాగం నుంచి గోదావరి ప్రవాహం

## నేడు జూరాలకు కృష్ణమ్మ

- నారాయణపుర నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల
- అవుట్‌ఫ్లో లక్ష క్యూసెక్కులకు చేరే అవకాశం
- నేటి అర్ధరాత్రికి జూరాల జలాశయానికి చేరనున్న జలాలు
- భారీవర్షాలతో ఉధృతంగా వరద
- తుంగభద్రకు స్థిరంగా ఇన్‌ఫ్లో

**హైదరాబాద్, గద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ అయిజ:** కృష్ణా బేసిన్ రైతాంగానికి తీపి కబురు. ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న కృష్ణమ్మ సోమవారం అర్ధరాత్రి జూరాలకు చేరుకోనున్నది. ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో బేసిన్‌లో వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతున్నది. భారీస్థాయిలో వరద రానున్నదని బేసిన్‌లోని రాష్ట్రాలకు కేంద్ర జలసంఘం సమాచారం ఇచ్చింది. ఆదివారం ఉదయం 30 వేల క్యూసెక్కులు ఉన్న ఆల్మట్టి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతున్నది. సాయంత్రానికి 50వేల క్యూసెక్కులకు పెరుగగా.. అర్ధరాత్రికి లక్ష క్యూసెక్కులకు చేరుకుంటుందని సమాచారం. దీంతో కర్ణాటక అధికారులు దిగువనఉన్న ప్రాజెక్టు అధికారులను అప్రమత్తం చేశారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో ఆల్మట్టి నుంచి కరంటు ఉత్పత్తి ద్వారా అవుట్‌ఫ్లోను పెంచుతున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే గేట్లను ఎత్తి దిగువన ఉన్న నారాయణపూర్‌కు నీటిని వదిలే అవకాశాలున్నట్టు అధికారులు తెలిపారు. ఆల్మట్టి నుంచి నీటి విడుదల పెరుగడంతో దిగువన నారాయణపుర ప్రాజెక్టు అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రానున్నదనే సమాచారంతో ఆదివారం సాయంత్రం నాలు గు గంటలకు అవుట్‌ఫ్లోను పెంచారు. కరంటు ఉత్పత్తి ద్వారా 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేశారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ప్రకారం అవుట్‌ఫ్లోను కూడా అదేరీతిన పెంచనున్నట్టు కర్ణాటక అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో ఏ సమయంలోనైనా ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు లక్ష క్యూసెక్కులు విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా నారాయణపుర నుంచి దిగువకు వదలిన వరద 36 గంటల్లో జూరాల జలాశయంలోకి రానున్నాయి. అంటే సోమవారం రాత్రికి కృష్ణాజలాలు తెలంగాణలోకి ప్రవేశించనున్నాయి. జూరాల ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 9.68 టీఎంసీలు ఉండగా ప్రస్తు తం 1.98 టీఎంసీలు ఉన్నది. మరోవైపు ఉజ్జయినికి కూడా వరద భారీగానే పెరుగుతున్నది. ఆదివారం ఉదయం 13 వేల క్యూసెక్కులుగాఉన్న వరద సోమవారం ఉదయానికి 80 వేల క్యూసెక్కులకు పెరగనున్నదని కేంద్ర జలసంఘం స్పష్టంచేసింది. తుంగభద్రలో 14 వేల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతున్నది. 1,660 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలాఉండగా.. జూరాలకు వరద పెరిగిన వెంటనే దాని పై ఉన్న అన్ని ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోయడం ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో నారాయణపుర నుంచి అవుట్‌ఫ్లో 50 వేల క్యూసెక్కులు దాటగానే జూరాల నుంచి భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టుల ద్వారా నీటిని లిఫ్టు చేయడం మొదలుపెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



తుంగభద్ర ప్రాజెక్టులో ప్రస్తుత నీటినిల్వ


**TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD**
**DEPARTMENT OF TECHNICAL EDUCATION**
**TSICET-2019**
**ADMISSION NOTIFICATION**
**PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.**

The Qualified Candidates of TSICET-2019 desirous of seeking admission into MBA and MCA Courses are informed that the Admission Counselling process will commence on 06-08-2019. Minority candidates who have not qualified or not appeared in TSICET-2019, but passed and secured required percentage of marks in qualifying examination can also attend for counselling to consider them for admission into minority colleges in leftover vacancies. Further details and counselling schedule, can be seen in the website: **https://tsicet.nic.in on 03-08-2019.**

Date: 27-07-2019 **Sd/- Navin Mittal, IAS**
Place: Hyderabad Convenor, TSICET-2019 & CTE
**DIPR R.O.No. 757 DP/CL/Advt/1/2019-20 Date: 27-07-2019**

# ఉత్సాహంగా టీఆర్ఎస్ ఎన్నారై సభ్యత్వం

- అభినందించిన ఎన్నారై విభాగం సలహాదారు కవిత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుండటంపై ఎన్నారై విభాగం సలహాదారు కవిత అభినందనలు తెలిపారు. పెద్దసంఖ్యలో పార్టీలో చేరేందుకు కృషిచేస్తున్నారని ఎన్నారై విభాగాలను ప్రశంసించారు. ఆదివారం ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల టీఆర్ఎస్ ఎన్నారై విభాగం సలహాదారు కవితను తెలంగాణభవన్‌లో కలిశారు. సభ్యత్వ నమోదు విషయంలో ఎన్నారై శాఖలు చేస్తున్న కృషిని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. న్యూజిలాండ్, కతార్, కువైట్, ఆస్ట్రియా, నార్వే, ఫ్రాన్స్, స్వీడన్, జర్మనీ, బహ్రెయిన్, ఇటలీ, లాత్వియా తదితర దేశాల్లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోలేనివారందరి జాబితాలను తెలంగాణభవన్‌లో ఆన్‌లైన్ చేసి, వారందరికీ సభ్యత్వం ఇస్తున్నట్లు కవితకు చెప్పారు.



టీఆర్ఎస్ ఎన్నారై విభాగం సలహాదారు కవితను కలిసిన ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

# అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భేష్

- కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ సహాయమంత్రి దేబశ్రీచౌదరి
- కేంద్ర ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేయాలి : మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విధానం బాగున్నదని కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధిశాఖ సహాయమంత్రి దేబశ్రీచౌదరి ప్రశంసించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల పంపిణీ, టీచర్స్ హాజరుకు అమలుచేస్తున్న బయోమెట్రిక్ విధానంపై అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యల పరిష్కారం, పెండింగ్ నిధుల విడుదల త్వరగా జరిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మహిళా, శిశు సంక్షేమాభివృద్ధిపై ప్లాజా హోటల్‌లో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డితో కలిసి కేంద్ర సహాయమంత్రి దేబశ్రీ చౌదరి సమీక్షించారు. రాష్ట్రంలోని 35 వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో 70 వేలమంది మహిళలు పనిచేస్తున్నారని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ చొరువతో దేశంలో ఎక్కడా లేని గొప్ప పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని, ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేయించుకుంటే రూ.12 వేలు, రూ.13 వేల చొప్పున నగదు, కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నట్టు చెప్పారు. దేశంలోనే ఇలాంటి గొప్ప పథకం మరెక్కడా అమలు కావడం లేదని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ఆర్థికతోడ్పాటు అందించాలని కేంద్ర సహాయమంత్రికి విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం పెండింగ్ నిధులను త్వరగా ఇచ్చేలా చేయాలని వినతిపత్రం అందజేశారు. సమీక్ష సమావేశంలో శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్ర బోయి, జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని వినతిపత్రం అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి





నిమ్స్ దవాఖానలో 2016 జూలై 11న మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్



నాడు సీఎం కేసీఆర్ నాటిన మొక్క ఇదే..

# నిమ్స్‌కు పచ్చనిహారం

- సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా..
- మూడేండ్ల కిందట నాటిన మొక్కలు.. నేడు వృక్షాలుగా
- వందశాతం సంరక్షించి అవార్డు సైతం కైవసం

**ఖైరతాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి నిమ్స్ దవాఖాన నిదర్శనంగా నిలుస్తున్నది. తెలంగాణకు హరితహారం కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. మూడేండ్ల కిందట నాటిన మొక్కలు నేడు హరితవనాన్ని తలపిస్తున్నాయి. రోగులకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తున్నాయి. అందులో సీఎం కేసీఆర్ చేతులమీదుగా నాటిన కదంబ మొక్క ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2016 జూలై 11న నిమ్స్ దవాఖానలోని రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 475 మొక్కలు నాటారు. ఒక్కో మొక్క ప్రస్తుతం ఎనిమిది అడుగులకు పైగా ఎత్తుకు ఎదిగింది. నాడు సీఎం కేసీఆర్ కదంబ మొక్కనాటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, అప్పటి డిప్యూటీ సీఎం, ప్రస్తుత హోంమంత్రి మహమూద్‌అలీ సిల్వర్ ఓక్, నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మామిడి మొక్క నాటారు. ఆ మొక్కలు నేడు వృక్షాలుగా రూపాంతరం చెందాయి. మొత్తం మొక్కల్లో 90 శాతం ఔషధగుణాలు కలిగినవే కావడం గమనార్హం. మొక్కల సంరక్షణకు ప్రత్యేకమైన నీటి పైపులైన్ వ్యవస్థ ఏర్పాటుచేయగా, ఉదయంనుంచి సాయంత్రం వరకు మాలీ కార్మికులు వాటి బాగోగులు చూసుకుంటున్నారు. ఇక్కడ ఎల్‌ఈడీ లైట్లు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణపై దృష్టిపెడుతున్నారు. వందశాతం మొక్కలు బతికాయి. సీఎం కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో నిమ్స్‌లో నాటిన 475 మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాం నిమ్స్ దవాఖాన అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేశ్ పేర్కొన్నారు. వందశాతం మొక్కలను పరిరక్షించినందుకు 2017-18 సంవత్సరానికి అవార్డు సైతం దక్కిందని గుర్తుచేశారు.

# రాశివనం.. స్ఫూర్తి ఘనం

జిల్లా పర్యటనకొస్తే మొక్క నాటాల్సిందే ▪ కామారెడ్డి జిల్లాలో కలెక్టర్ వినూత్న నిర్ణయం

సీఎం కేసీఆర్ స్ఫూర్తితో పచ్చదనం పెంపు ▪ మొక్కలకు మళ్లుతున్న వృథాజలాలు

జూపల్లి రమేష్
కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

ఒక్క మొక్క వందల మొక్కలు నాటేందుకు స్ఫూర్తిగా నిలిచింది. ఖాళీస్థలం పచ్చని వనంగా మారింది. కామారెడ్డి కళాశాల ఎదుట సీఎం కేసీఆర్ నాటిన మొక్కే స్ఫూర్తిగా.. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఎన్ సత్యనారాయణ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పర్యటనకొచ్చే మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు జిల్లా కేంద్రంలో మొక్కనాటేలా హరితబాధ్యతను అప్పగిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల ముందుభాగంలోని 10 ఎకరాల స్థలాన్ని మొక్కల పెంపకానికి సిద్ధంచేసి, 2017 నుంచి మొక్కలు నాటడం ప్రారంభించారు. దానికి రాశివనం అని నామకరణం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చివెళ్లే వారితో రాశుల ఆధారంగా మొక్కలు నాటించారు. ఎవరైతే మొక్కను నాటారో వారి పేరు, హోదా, మొక్కకు సంబంధించిన శాస్త్రీయ నామాలతో ఫలకాలను సైతం సిద్ధంచేసి పాతించారు. ఇలా వందకుపైగా విభిన్న మొక్కలతో రాశివనం పచ్చగా కళకళలాడుతున్నది. పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తున్నది.



పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణంలో అలరారుతున్న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాశివనం



రాశివనంలో చూపరులను ఆకట్టుకునే సహజసిద్ధమైన అందాలు

## కలెక్టరేట్‌లోనూ ఇదే ప్రయోగం

కామారెడ్డి జిల్లా ప్రస్తుత కలెక్టరేట్ ప్రాంగణంలోనూ ఇదే రకమైన ప్రయోగం కొనసాగుతున్నది. మొక్కల సంరక్షణ బాధ్యతలను జిల్లా శాఖాధిపతులకు అప్పగించారు. తొలుత రాశివనానికి ముందు మొక్కల పెంపకానికి సంబంధించిన వినూత్న ప్రయోగానికి ఇక్కడే శ్రీకారం చుట్టారు. డిగ్రీ కళాశాల భూముల ఆక్రమణకు కొందరు యత్నించగా, వారికి అడ్డుకట్టవేసేందుకు కలెక్టర్.. కాలేజీలో రాశివనాన్ని ఏర్పాటు చేశారు. 1984లో ఇక్కడే డిగ్రీ పూర్తిచేసిన ఆయన కళాశాల రుణం తీర్చుకుంటున్నారు.

## మొక్కలకు మళ్లిన వృథా జలం

రాశివనం వద్ద భూగర్భజలాలు అందుబాటులో లేవు. డిగ్రీ కళాశాల వెనుకభాగంలో ఉన్న ఫిల్టర్ బెడ్ నుంచి రోజూ 2 లక్షల లీటర్ల నీళ్లు వృథా అవుతున్నాయని గుర్తించి.. శాస్త్రీయ పద్ధతిలో ఈ నీళ్లను రీసైక్లింగ్ ద్వారా మొక్కల పెంపకానికి ఉపయోగించుకుంటున్నారు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చుచేసి ఫాంపాండ్‌లను తవ్వించారు. ఇటీవల జిల్లాకొచ్చిన జలశక్తి అభియాన్ బృందం సభ్యులు సైతం ఈ ప్రయోగాన్ని ప్రశంసించారు. రాశివనం ఏర్పాటుకుముందే ఇదే ప్రాంగణంలో డిగ్రీ కళాశాల భవనం ఎదుట 2015 జూలై 6న సీఎం కేసీఆర్ నాటిన కొండమల్లె(ఆకాశమల్లె) మొక్క ఇప్పుడు చెట్టుగా మారింది. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్ రెడ్డి, మాజీమంత్రి జోగు రామన్న.. ఇలా ప్రముఖులెందరో జిల్లాకేంద్రంలో మొక్కలు నాటారు.



**ప్రకృతికి వందనం:** ఎన్ సత్యనారాయణ, కామారెడ్డి జిల్లా కలెక్టర్

మానవ మనుగడ ముందుకు సాగాలంటే ప్రకృతిని ఆరాధించాలి. ఇందుకు హరితహారం రూపంలో మహత్తరమైన ఉద్యమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టారు. కామారెడ్డి కళాశాల ఎదుట సీఎం కేసీఆర్ నాటిన మొక్కనే స్ఫూర్తిగా తీసుకుని ప్రకృతమ్మకు వందనం సమర్పించుకోవాలని భావించాను. డిగ్రీ కళాశాలలోని 10 ఎకరాల ఖాళీ ప్రదేశంలో మొక్కల పెంపకానికి ముందడుగు వేశాను. కళాశాల సిబ్బంది, అధికార యంత్రాంగం, పట్టణవాసులంతా కదిలివచ్చారు. ఇది విజయవంతం కావడం ఆనందాన్ని ఇస్తున్నది.



**మా కళాశాలకు అదనపు ఆకర్షణ**

- శంకర్, రాశివనం బాధ్యుడు, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు

రాశివనం ఇప్పుడు వనాన్ని తలపిస్తున్నది. దీనిపక్కనే నాలుగున్నర ఎకరాల్లో ఫ్రూట్ గార్డెన్‌కు సైతం కలెక్టర్ సహకారంతో అభివృద్ధిలోకి తీసుకురాబోతున్నాం. రాశివనంతో డిగ్రీ కళాశాలకు అదనపు ఆకర్షణ వచ్చింది. కళాశాల ప్రత్యేక కమిటీ రాశివనాన్ని పర్యవేక్షిస్తున్నది.

## నేపాల్‌లో కొనసాగుతున్న వరదలు

- 113కు చేరిన మృతుల సంఖ్య

**కాట్మండు/యంగూన్/బీజింగ్, జూలై 28:** నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మృతుల సంఖ్య 113కు చేరింది. 28 మంది ఆచూకీ ఇంకా తెలియలేదని ఆ దేశ అధికారులు ఆదివారం చెప్పారు. దక్షిణ, మధ్య నేపాల్, కాట్మండు ప్రాంతాల్లో 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడి 113 మంది చనిపోగా, 67 మంది గాయపడ్డారు. ఆర్మీ, పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. వర్షాలతో రోగాలు వ్యాపించే అవకాశముండటంతో నేపాల్ అంతర్జాతీయ సాయం కోరింది. మయన్మార్‌లో వారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఆదివారం ఓ గనిలో చరియలు విరిగిపడి 13 మంది కార్మికులు మృతి చెందారు. ఆచూకీ గల్లంతైన వారి కోసం గాలిస్తున్నట్లు ఆ దేశ అధికారులు చెప్పారు. చైనాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఆదివారం నాటికి 36కు చేరింది. మృతుల్లో ఓ తల్లి ఇద్దరు పిల్లలున్నారని పీపుల్స్ డైలీ పేర్కొన్నది.

## కాబూల్‌లో కారు బాంబు పేలుడు

- ఇద్దరు మృతి, 25 మందికి గాయాలు

**కాబూల్:** ఆఫ్ఘన్ రాజధాని కాబూల్ పేలుళ్లతో దద్దరిల్లింది. ఆదివారం సాయంత్రం రద్దీ వేళ సెంట్రల్ కాబూల్‌లో కారు బాంబు పేలుడు జరిగింది. దీంతోపాటు ఇద్దరు దుండగులు కాల్పులకు తెగబడ్డారని అధికారులు చెప్పారు. ఈ ఘటనలో మహిళతోపాటు ఇద్దరు చనిపోగా, 25 మందికి గాయాలయ్యాయి. ఆఫ్ఘన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ పార్టీ కార్యాలయమే లక్ష్యంగా ఈ దాడి జరిగింది. ఇద్దరు దుండగులు కాల్పులకు పాల్పడినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. సెప్టెంబర్ 28న జరుగనున్న అధ్యక్ష ఎన్నికలకు ఆదివారం ప్రచారం ప్రారంభమైంది. తొలి రోజే ఈ దాడి జరుగుడం గమనార్హం.



ఘటనాస్థలంలో భద్రతా సిబ్బంది

## మేఘాలయ అసెంబ్లీ స్పీకర్ రాయ్ కన్నుమూత



**షిల్లాంగ్, జూలై 28:** మేఘాలయ అసెంబ్లీ స్పీకర్ డాన్‌కుపార్ రాయ్ (64) ఆదివారం కన్నుమూశారు. ఆయన గతంలో మేఘాలయ సీఎంగాను పనిచేశారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు తొలుత షిల్లాంగ్‌లోని ఓ దవాఖానకు తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హర్యానాలోని గుర్గాన్‌కు తీసుకెళ్లగా అక్కడ 10 రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. రాయ్ మరణంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

# ముంబైకి రెడ్ అలర్ట్!

- విడువని వానలు.. మరో 48 గంటల్లో భారీవర్షాలు
- హెచ్చరించిన వాతావరణశాఖ
- రాజస్థాన్‌లో 8 మంది, మధ్యప్రదేశ్‌లో ఒకరు గల్లంతు
- పలు మార్గాల్లో రైళ్లు రద్దు, కొన్ని దారి మళ్లింపు



మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో వరదనీటిలో కూరుకుపోయిన పోలీస్ వాహనం

**ముంబై, జూలై 28:** వాణిజ్య రాజధాని ముంబైని వానలు వీడటం లేదు. ఎడతెరిపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కాగా మరో 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో బృహన్ ముంబై కార్పొరేషన్ అధికారులు అప్రమత్తం అయ్యారు. దక్షిణ ముంబైలోని బైకుల్లాలో ఆదివారం తెల్లవారుఝామున ఖాళీగా ఉన్న నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. నూర్ మహ్మద్ అలీష్కర్ (17) అనే యువకుడు శిథిలాల కింద చిక్కుకోగా అగ్నిమాపక సిబ్బంది అతడ్ని రక్షించి దవాఖానకు తరలించారు. థాణే జిల్లాలోని ముంబ్రాలో ఆదివారం ఓ మృతదేహాన్ని నాలాలో గుర్తించి వెలికితీశారు. మృతుడ్ని అమోల్ టేడేగా(29)గా గుర్తించారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అతడు నాలాలో పడి చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు థాణే జిల్లాలో ఉల్లాస్ నది పొంగిపొర్లుతున్నది. దీంతో ఆదివారం ఉదయం ముర్బాద్-కల్యాణ్ మార్గంలో ఆ నదిపైనున్న వంతెనలో కొంత భాగం వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. వర్షాలకు పలు చోట్ల రోడ్లు దెబ్బతినడంతో ముంబై-అహ్మద్‌నగర్‌ను కలిపే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిపివేశారు. బాద్లాపూర్, టిట్వాలా, కల్యాణ్ ప్రాంతాలను వరదలు ముంచెత్తాయని, 370 ఇండ్లు నీటమునిగాయని తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ బృందాలు పగలు, రాత్రనక పనిచేస్తున్నాయి. థాణే జిల్లా వాంగని వద్ద వరదలో చిక్కుకున్న మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్ రైలులోని 1,050 మంది ప్రయాణికులను ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వే సిబ్బంది కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఈ సహాయ బృందాన్ని ప్రశంసించారు. వారిపట్ల గర్వంగా ఉందంటూ ఆదివారం ట్వీట్ చేశారు.

**బరాజ్‌లకు భారీగా వరద ప్రవాహం**

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రధాన బరాజ్‌ల్లోకి వరద ప్రవాహం భారీగా చేరుతున్నది. నాశిక్‌లోని మేజర్ బరాజ్‌లోని నీటి మట్టాలు గరిష్ఠస్థాయికి చేరాయి. గంగాపూర్ డ్యామ్ 74శాతం మేర నిండినట్లు అధికారులు తెలిపారు. భవాలి బరాజ్ పూర్తిగా నిండగా దిగువకు 1,218 క్యూసెక్కులు, దర్నా డ్యామ్ 87 శాతం నిండగా దిగువకు 16,598 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**రాజస్థాన్‌లో 22కు చేరిన మృతుల సంఖ్య**

దేశంలోని పలు రాష్ట్రాల్లో వానలు జోరుగా కురుస్తున్నాయి. రాజస్థాన్‌లో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం నాటికి మృతుల సంఖ్య 22కు చేరింది. శనివారం నుంచి పలు చోట్ల తొమ్మిది మంది చనిపోయారు. భిల్వారాలో మిద్దెకూలి ఓ వృద్ధురాలు చనిపోగా, డ్రైనేజీల్లో పడి ఎనిమిది మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఐదుగురు బాలురు. భారీ వర్షాలకు కోటా పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. సహాయ బృందం 250 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. శనివారం నాటికి కోటాలో రికార్డు స్థాయిలో 151.8 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోనూ పలు చోట్ల భారీగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం రాత్రి సిహోర్ జిల్లా ఖాజురియాలో పదేండ్ల బాలుడు నాలాలో పడి గల్లంతయ్యాడు. అధికారులు గాలింపు చేపట్టారు. వరద ప్రవాహంలో చిక్కుకున్న 18 మందిని రెస్క్యూ టీం రక్షించింది. భారీ వర్షాలకు వంతెనల వద్ద నీటి ప్రవాహం ప్రమాదకర స్థితికి చేరడంతో పలు రోడ్డు మార్గాల్లో కొన్ని గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.



మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా కోట్రీ కలాన్‌గ్రామంలో నడుంలోతు నీటిలో ప్రజల ఇక్కట్లు

**చెరువులో మునిగి ఏడుగురు చిన్నారులు మృతి**

బీహార్‌లోని శరణ్ జిల్లా డోయిలా గ్రామంలో విషాదం నెలకొన్నది. భారీవర్షాలకు చెరువు నిండటంతో గ్రామానికి చెందిన తొమ్మిది మంది చిన్నారులు ఆదివారం స్నానానికి వెళ్లారు. ప్రమాదవశాత్తూ నీటమునిగి ఏడుగురు మృతి చెందారు. వారంతా 8-10 ఏండ్ల మధ్యవారే. మరో ఇద్దరిని స్థానికులు రక్షించారు. మరోవైపు బీహార్‌లో వరదల కారణంగా దర్భాంగ-సమస్తిపూర్ మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు తూర్పు మధ్య రైల్వే అధికారులుతెలిపారు. జయనగర్-పాట్నా ఇంటర్ సిటీతోపాటు నాలుగు ప్యాసింజర్ రైళ్లను రద్దు కాగా మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్లు చెప్పారు. జమ్ముకశ్మీర్‌లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. రాంబన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండు, మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు రాజస్థాన్ వైపు మళ్లాయని, జూలై 31 నాటికి ఢిల్లీ పరిసర ప్రాంతాల వైపు విస్తరించే అవకాశమున్నదని దీంతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. కాగా జూలై 1 నుంచి 27 వరకు ఢిల్లీలో 193 మీమీ వర్షపాతం నమోదైంది.

### ముంబైలో భారీ వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముంబై డివిజన్ పరిధిలో భారీ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్-ముంబై హుస్సేన్ సాగర్ ఎక్స్‌ప్రెస్, హెచ్‌ఎస్ నాందేడ్- పన్వేల్ ఎక్స్‌ప్రెస్‌లను 28, 29 తేదీల్లో రెండు వైపులా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. నిజామాబాద్- పాందర్‌పూర్ ప్యాసింజర్, రాజ్‌కోట్- కోయంబత్తూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్.. తదితర రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు వెల్లడించింది. ఈ మార్గంలో ప్రయాణించే మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు చెప్పింది.

## నిప్పుతో చెలగాటమొద్దు

- ఆర్టికల్ 35ఏను ముట్టుకోవాలని చూస్తే కాలి బూడిదైపోతారు
- కేంద్రాన్ని హెచ్చరించిన పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో శాశ్వత నివాసం కలిగిన వారికి ప్రత్యేక హక్కులు కల్పిస్తున్న ఆర్టికల్ 35ఏను మార్చాలని లేదా రద్దు చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ రాష్ట్ర మాజీ సీఎం, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పీడీపీని నెలకొల్పి 20 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ఆర్టికల్ 35ఏ జోలికి వెళ్లాలనుకోవడం నిప్పుతో చెలగాటమాడటమే అవుతుంది. ఎవరైనా దీన్ని ముట్టుకోవాలని చూస్తే బూడిదైపోతారు' అని కేంద్రాన్ని హెచ్చరించారు. రాష్ట్రానికి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హోదా, హక్కులను కాపాడటంలో తమ పార్టీ ఎల్లవేళలా ముందుంటుందని చెప్పారు. 'నన్ను జైల్లో పెట్టినా సరే.. రాష్ట్ర హక్కులను కాపాడుకుంటా' అని మెహబూబా అన్నారు. ఆర్టికల్ 35ఏను రక్షించుకోవడానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, అవసరమైతే ప్రాణాలు పోయేవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. 'ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. కానీ మనకు నిజమైన పరీక్ష ఏమిటంటే.. మన హక్కులను కాపాడుకోవడం. ఆర్టికల్ 35ఏను రక్షించుకోవడం. ఈ విషయంలో ఏ పోరాటానికైనా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి' అని కోరారు.




# బుల్లెట్ కంటే అభివృద్ధే బలమైంది

కశ్మీర్‌లో ద్వేషాన్ని వ్యాప్తిచేస్తున్నవారు ఎప్పటికీ విజయం సాధించలేరు

మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** కశ్మీర్‌లో ద్వేషాన్ని వ్యాప్తిచేయడానికి, అభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నవారు ఎప్పటికీ సఫలీకృతం కాలేరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలతో బుల్లెట్లు, బాంబుల కంటే కూడా అభివృద్ధే బలమైనదని నిరూపితమైందని నొక్కి చెప్పారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌లో గతనెల నిర్వహించిన బ్యాక్ టు విలేజ్ కార్యక్రమంలో ప్రతి చోట స్థానికులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారని చెప్పారు. 'అభివృద్ధిలో కశ్మీర్ ప్రజలు సైతం భాగం కావడానికి సిద్ధంగా ఉన్నారనేది ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తే అర్థమవుతున్నది.బుల్లెట్, బాంబుల శక్తికంటే అభివృద్ధే బలమైనదని ఇదే నిరూపిస్తున్నది' అని చెప్పారు. సీనియర్ అధికారులు తొలిసారి కశ్మీర్‌లోని 4,500 పంచాయతీల్లో ఉన్న గ్రామస్థుల తలుపులను తట్టారని, సరిహద్దున కాల్పులు జరిగే గ్రామాల్లోనూ నిర్భయంగా పర్యటించారని పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి ఇప్పటివరకు 3 లక్షలమంది భక్తులు అమర్‌నాథ్ యాత్రను పూర్తిచేసుకున్నారని.. ప్రత్యేక సన్నాహాలతో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రజలను కోరారు.



### బీజేపీ ముఖ్యనేతలతో మోదీ సమావేశం!

**న్యూఢిల్లీ, జూలై 28:** జమ్ముకశ్మీర్ ఎన్నికలు, అక్కడ శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఆ రాష్ట్ర కోర్‌గ్రూప్ సభ్యులతో మంగళవారం సమావేశం కానున్నారు. ఈ మేరకు జమ్ముకశ్మీర్ నాయకులను, బీజేపీ ముఖ్యనాయకులను ఢిల్లీకి రావాలని మోదీ ఆదేశించారు. సమావేశానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి రాంమాధవ్, జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా తదితరులు హాజరుకానున్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రస్తుతం రాష్ట్రపతిపాలన కొనసాగుతున్నది.

## కశ్మీర్‌లో భారీ ఉగ్రదాడికి కుట్ర!

అదనపు బలగాల మోహరింపు.. పరిస్థితిని నిత్యం సమీక్షిస్తున్న అజిత్‌దోవల్

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తత నెలకొన్నది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లో భారీ దాడికి కుట్ర పన్నారని ప్రభుత్వానికి పక్కా సమాచారం అందింది. దీంతో ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. అదనపు బలగాలను మోహరించింది. ప్రధానంగా కశ్మీర్‌లోయలో భారీ ఉగ్రదాడి జరుగొచ్చంటూ ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి సమాచారం అందించాయి. అప్రమత్తమైన ప్రభుత్వం జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్‌ను రంగంలోకి దింపింది. వెంటనే కశ్మీర్‌కు బయలుదేరి వెళ్లిన ఆయన అక్కడ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. భద్రతను సమీక్షించిన అనంతరం అదనపు బలగాలను మోహరించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అమెరికాకు వాస్తవాలు తెలిశాయి

- కశ్మీర్ సమస్యపై పాక్ విదేశాంగమంత్రి ఖురేషి వ్యాఖ్య

**ఇస్లామాబాద్:** కశ్మీర్ అంశంపై అమెరికాకు వాస్తవాలు తెలిసేలా పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేశారని ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి షా మహమ్మద్ ఖురేషి పేర్కొన్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన ఇమ్రాన్‌ఖాన్ తొలి పర్యటన 'పాకిస్థాన్ అంచనాలను మించి సాధించింది' అని ఒక ప్రైవేట్ టీవీ చానెల్‌తో ఖురేషి చెప్పారు. సాధ్యమైనంత త్వరగా కశ్మీర్ అంశానికి పరిష్కారం కనుగొనాలని అమెరికా గుర్తించిందన్నారు.

## కడుపునొప్పని వెళ్తే కండోమ్స్ రాసిచ్చాడు!

- జార్ఖండ్ వైద్యుడి నిర్వాకం..

**రాంచీ:** కడుపునొప్పితో చికిత్స కోసం వెళ్లిన ఓ మహిళకు జార్ఖండ్‌లోని ఓ వైద్యుడు మందుల చీటీలో కండోమ్స్‌ని రాసిచ్చాడు. మహిళ ఫిర్యాదుతో ఉన్నతాధికారులు అతడిపై విచారణ చేపట్టారు. నాలుగో తరగతి ఉద్యోగి అయిన ఓ మహిళ ఈ నెల 23న కడుపునొప్పికి చికిత్స కోసం పశ్చిమ సింహభూమ్ జిల్లాలోని ఘాట్‌శిలా ప్రభుత్వ దవాఖానాకు వెళ్లారు. అక్కడ కాంట్రాక్ట్ వైద్యుడిగా పని చేస్తున్న అష్రఫ్ బాదర్.. ఆమెకు ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు. ఆమె దాన్ని మందుల షాపులో ఇవ్వగా, ఇందులో కండోమ్స్ రాసిచ్చారని దుకాణాదారుడు తెలిపాడు. దీంతో ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జార్ఖండ్ ముక్తిమోర్చా ఎమ్మెల్యే కునాల్ సారంగి ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తారు. కాగా తనపై వచ్చిన ఆరోపణలను బాదర్ ఖండించారు.

## పట్నాయక్‌కు పీపుల్స్‌చాయిస్ అవార్డు

### అమెరికాలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న భారత సైకత శిల్పి


మెడల్‌తో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్

**న్యూయార్క్:** భారత ప్రఖ్యాత సైకత శిల్పి, పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ మరో ప్రతిష్ఠాత్మక అవార్డు గెలుచుకున్నారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న రివర్‌బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సైకత శిల్పుల చాంపియన్‌షిప్-2019లో 'పీపుల్స్ చాయిస్' అవార్డును దక్కించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మొదటి 15 స్థానాల్లో నిలిచిన సైకత శిల్పులకు నిర్వహించిన పోటీలో పట్నాయక్ ప్రథమస్థానంలో నిలిచారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి.. సముద్రాలను రక్షించండి' అనే అంశంపై ఆయన రూపుదిద్దిన సైకత శిల్పం పీపుల్స్‌చాయిస్ అవార్డును సాధించింది. రివర్ బీచ్ భాగస్వామ్య బోర్డు సభ్యుడు అడ్రియాన్ సాకో మాగైర్ నుంచి పట్నాయక్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అమెరికాలో నాకు దక్కిన అతిపెద్ద బహుమతి. గౌరవం ఇది. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అధిగమించడానికి ఈ అవార్డు భారత్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. మానవుల అనాలోచిత చర్యల వల్ల సముద్రాలు, నదులు, కాలువలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయనే అంశాన్ని తెలియజెప్పడానికే నేను ఈ శిల్పాన్ని తీర్చిదిద్దాను. ఈ అవార్డు నాకు చాలా ప్రత్యేకమైనది' అని పేర్కొన్నారు.

## మూడునెలల్లో ఆరువేల సీఎస్సీ అకాడమీలు

### దేశవ్యాప్తంగా ఏర్పాటుకు సీఎస్సీ కసరత్తు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా వచ్చే మూడునెలల్లో ఆరువేల సీఎస్సీ అకాడమీలను ఏర్పాటుచేసేందుకు భారత్‌లో ఈ-గవర్నెన్స్ సేవలను అందించే కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ) ప్రణాళిక సిద్ధంచేస్తున్నది. సింబాసిస్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎస్ఐవోఎస్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ), ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో), ప్రధానమంత్రి గ్రామీణ డిజిల్ సాక్షార అభియాన్ (పీఎంజీడీఐఎస్‌హెచ్ఏ)ల ద్వారా వివిధ కోర్సులను అందించనున్నది. వచ్చే మూడునెలల్లో బ్లాక్‌స్థాయిలో ఆరువేల సీఎస్సీ అకాడమీలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ అకాడమీలు వివిధ కోర్సులను అందిస్తాయి' అని అధికారులు తెలిపారు.





# భళిభళిరా పులి!

### దేశంలో క్రమంగా పెరుగుతున్న పులుల జనాభా

2014లో 2,226 ఉండగా, ఈసారి 2,600 దాటే అవకాశం

దాదాపు 20 శాతం వృద్ధి నమోదు

**దేశంలో పులుల లెక్క ఇదీ**

**2006- 1,411**
**2010- 1726**
**2014- 2226**
**2018- 2600?**

**పులుల సంఖ్య పెరుగడానికి గల కారణాలు**

1. వ్యవస్థీకృతమైన పులుల వేటగాళ్ల ముఠాలను కట్టడి చేయడం
2. ప్రత్యేకంగా పులుల సంరక్షణ దళాలను మోహరించడం
3. టైగర్ రిజర్వుల నుంచి గ్రామాలను తరలించడం

**నాగ్‌పూర్, జూలై 28:** దేశంలో పులుల జనాభా క్రమేణా పెరుగుతున్నది. 2014లో దేశవ్యాప్తంగా 2,226 పులులు ఉండగా, ఈ సారి ఆ సంఖ్య 2600ను మించే అవకాశం ఉన్నదని సమాచారం. 'ప్రపంచ పులుల దినోత్సవం' సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం న్యూఢిల్లీలో పులుల సంఖ్యను ప్రకటించే అవకాశం ఉన్నది. అలాగే 'ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్-2018'ను కూడా ప్రధాని విడుదల చేయనున్నారు. 2006లో ప్రాజెక్ట్ టైగర్‌ను పునర్వ్యవస్థీకరించిన తరువాత అంచనాలను విడుదల చేయడం ఇది నాలుగోసారి. ప్రతి నాలుగేండ్లకొకసారి దేశవ్యాప్తంగా పులుల గణన చేపడుతారు. 2006లో దేశంలో 1,411 పులులు ఉండగా, 2010 నాటికి ఆ సంఖ్య 1,716కి పెరిగింది. 2014తో పోలిస్తే ఈసారి పులుల జనాభా 400 వరకు పెరిగినట్లు సమాచారం. అంటే 18-20 శాతం వృద్ధి నమోదైనట్లు లెక్క. 500 పులులతో కర్ణాటక అగ్రస్థానాన్ని నిలబెట్టుకోనుంది. ఆ తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ నిలిచే అవకాశం ఉన్నది. 2014లో కర్ణాటకలో 406 పులులు ఉన్నాయి. సోమవారం జరిగే కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో పాటు, అన్ని రాష్ట్రాల చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్స్, టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్స్ పాల్గొననున్నారు. అన్ని టైగర్ రిజర్వుల 'మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్ ఎవాల్యుయేషన్' నివేదికలను కూడా సమావేశంలో విడుదల చేయనున్నారు.

**నేడు ప్రపంచ పులుల దినోత్సవం**

**టెక్నాలజీ వినియోగం**

మునుపటిసారి వివిధ కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో పులుల గణన చేపట్టలేదు. ఈ సారి ఈశాన్య రాష్ట్రాల్లో కూడా లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఈసారి కూడా పులులను లెక్కించలేదు. రెండు భాగాలుగా పులుల సంఖ్యను గణించారు. మొదటి విడుతలో ఫీల్డ్‌లో పులులకు సంబంధించిన డేటాను సేకరించారు. పులుల ఉనికి ఉన్న 18 రాష్ట్రాల్లో సుమారు 40 వేల మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. రెండో విడుతలో కెమెరా ట్రాప్‌లను అమర్చి సమాచారాన్ని సేకరించారు. ఈ మొత్తం సమాచారాన్ని డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చేరవేశారు. అక్కడ ఈ డేటాను విశ్లేషించి పులుల సంఖ్యను నిర్ధారించారు. ఈసారి పులుల గణనలో టెక్నాలజీని కూడా విస్తృతంగా వినియోగించారు. 2014లో 9,700 కెమెరాలను వినియోగించగా, ఈసారి 15వేల కెమెరాలను వినియోగించారు. సమాచార సేకరణ, విశ్లేషణకు ఈసారి 'ఎమ్-ఎస్‌టీఆర్ఐపీఈఎస్' అనే ఆండ్రాయిడ్ అప్లికేషన్ కూడా ఉపయోగించారు.

### నాడు లక్ష.. నేడు 3,900

వరల్డ్ వైల్డ్ లైఫ్ గణాంకాల ప్రకారం.. వందేండ్ల కిందట ప్రపంచవ్యాప్తంగా లక్ష పులులు ఉండగా, ప్రస్తుతం 3,900 మాత్రమే మిగిలి ఉన్నాయి. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి 95 శాతం పులులు అంతరించిపోయాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అక్రమ వేట, అడవుల నరికివేత, ఆవాసాల విధ్వంసం, పర్యావరణ మార్పులు, మనిషి-పులుల మధ్య ఘర్షణ తదితర కారణాల వల్ల పులుల సంఖ్య అంతరించిపోతున్నది. ఈ నేపథ్యంలో పులుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన టైగర్ సమ్మిట్‌లో నిర్ణయించిన మేరకు ఏటా జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పులుల జనాభా ఉన్న దేశాలు 2020 నాటికి వాటి సంఖ్యను రెట్టింపు చేయాలని ఈ సమ్మిట్‌లో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



# చంద్రయాన్-2..రెండేండ్లు!

- అంచనాల కంటే తక్కువగా ఖర్చవుతున్న ఇంధనం
- మరో ఏడాది పెరుగనున్న ఆర్బిటార్ జీవితకాలం!

| | | |
|---|---|---|
| ప్రయోగానికి ముందు ఆర్బిటార్‌లో ఉన్న మొత్తం ఇంధనం | 1,697 | కిలోలు |
| చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించే నాటికి మిగిలే ఇంధనం (అంచనా) | 290.2 | కిలోలు |

| ప్రక్రియ | ఇంధనం ఖర్చు (కిలోల్లో) |
|---|---|
| రెండుసార్లు భూకక్ష్య పెంపు | 130 |
| మిగతా భూకక్ష్యల పెంపు | 657.3 |
| చంద్రుడి కక్ష్యల పెంపు | 749.5 |

**బెంగుళూరు, జూలై 28:** చంద్రయాన్-2 ఆర్బిటార్ జీవితకాలం గతంలో అంచనా వేసిన దాని కంటే మరో ఏడాది ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్టు ఇస్రో వర్గాలు అంచనా వేస్తున్నాయి. వాహకనౌకను ప్రయోగించిన సమయంలో.. ఆర్బిటార్ చంద్రుడి చుట్టూ సంవత్సరకాలం పాటు పరిభ్రమించి సేవల్ని అందిస్తుందని ఇస్రో అంచనావేసింది. అయితే, ప్రస్తుతం అంచనాల ప్రకారం.. కనీసం రెండేండ్లపాటు ఆర్బిటార్ సేవలు కొనసాగొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 'పవర్ కన్వర్టర్లలో తలెత్తిన సాంకేతిక సమస్య మూలంగా నిర్దేశిత సమయం కంటే ముందే చంద్రయాన్-1 తన జీవిత కాలాన్ని ముగించింది. అయితే, చంద్రయాన్-2 ప్రయోగంలో ఆ సమస్యను పరిష్కరించాం. కక్ష్య పెంపు చర్యలు అయిన తర్వాత కూడా ఆర్బిటార్‌లో ఇంధనం మిగిలి ఉండే అవకాశమున్నది. దీంతో చంద్రయాన్-2 రెండేండ్లపాటు చంద్రునిపై పరిశోధనలు చేయొచ్చు' అని చంద్రయాన్-2 మిషన్‌లో పనిచేస్తున్న ఐదుగురు సభ్యుల బృందం పేర్కొన్నది. ప్రయోగానికి ముందు ఆర్బిటార్‌లో 1,697 కిలోల ఇంధనం ఉన్నది. జూలై 24, జూలై 26తేదీల్లో రెండుసార్లు నిర్వహించిన భూకక్ష్య పెంపు ప్రక్రియల్లో 130 కిలోల ఇంధనం ఖర్చయింది. శనివారంనాటికి ఆర్బిటార్‌లో ఇంకా 1,500కిలోలకు పైగా ఇంధనం మిగిలి ఉన్నది. 'అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవడానికి మిషన్‌లో అదనపు ఇంధనాన్ని నింపుతాం. అయితే, ప్రస్తుత అంచనాల ప్రకారం.. చంద్రుడిపై ఒక ఏడాదిపాటు సేవలు అందించడానికి ఆర్బిటార్‌కు అవసరమైన దాని కంటే ఇంధనం ఎక్కువగానే ఉన్నది' అని ఓ శాస్త్రవేత్త చెప్పారు. భూకక్ష్య, చంద్రుడికక్ష్య పెంపులన్నీ పూర్తయిన తర్వాత, ఆర్బిటార్‌లో కనీసం 290.2కిలోల ఇంధనం మిగులుతుందని ఇస్రో అంచనా వేస్తున్నది. ఆర్బిటార్ నిర్దేశిత చంద్రుని కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత చిన్నపాటి కక్ష్య పెంపులు మాత్రమే ఉంటాయని, అయితే, భూమిలాగా చంద్రుని గురుత్వాకర్షణ ఏకరీతిగా ఉండకపోవడం వల్ల మరికొన్ని కక్ష్య పెంపులు అవసరపడొచ్చని మరో శాస్త్రవేత్త అన్నారు. ఈ సందర్భంలో కొంత ఇంధనం అవసరం కావొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఆగస్టు 20న చంద్రయాన్-2 చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు ఎంత ఇంధనం మిగిలి ఉన్నదో లెక్కించి.. ఆర్బిటార్ జీవిత కాలాన్ని కచ్చితంగా అంచనా వేయొచ్చు' అని శాస్త్రవేత్తల బృందంలోని మరో శాస్త్రవేత్త తెలిపారు.

**ప్రజాస్వామ్య మద్దతుదారుల నిరసనలు, నినాదాలతో ఆదివారం హాంకాంగ్ వీధులు దద్దరిల్లాయి. ర్యాలీలకు అధికారులు అనుమతించకపోయినా.. వేలాదిమంది ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి తమ నిరసనను తెలియజేశారు. ఆందోళనలను అదుపుచేయడంతో నిరసనకారులపై అధికారులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో 24 మంది పౌరులు గాయపడ్డారు. నేరస్థులను చైనాకు అప్పగించే చట్టం(ఎక్స్‌ట్రడిషన్ లా)ను వ్యతిరేకిస్తూ, సార్వత్రిక ఓటుహక్కు కల్పించాలని కోరుతూ ప్రజలు వీధుల్లో భారీ ప్రదర్శనలు చేపడుతున్నారు.**





# రెబల్స్‌పై వేటు

## మరో 14 మంది అసమ్మతి ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

### ఉప ఎన్నికలతోపాటు 2023 వరకు పోటీకి దూరం ▪ కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ సంచలన నిర్ణయం

- అసెంబ్లీలో నేడే యెడియూరప్ప బలపరీక్ష
- మెజారిటీ నిరూపించుకుంటా: సీఎం
- ముఖ్యమంత్రికి పరోక్షంగా లబ్ధి చేకూర్చనున్న స్పీకర్ నిర్ణయం

**బెంగళూరు, జూలై 28:** కర్ణాటకలో రాజకీయం మరో మలుపు తిరిగింది. స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ ఆదివారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. రాజీనామాలు చేసిన మరో 14 మంది ఎమ్మెల్యేలను 'ఫిరాయింపుల నిరోధక చట్టం' కింద ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ముగిసే వరకు అనర్హులుగా ప్రకటిస్తున్నట్టు స్పీకర్ మీడియాతో చెప్పారు. ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందన్నారు. మొత్తం 17 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయగా.. ఇంతకుముందే ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటువేసిన సంగతి తెలిసిందే. ఫలితంగా ఖాళీ అయిన ఈ స్థానాలకు త్వరలో జరిగే ఉప ఎన్నికలతోపాటు 2023 మే 23 వరకు పోటీ చేసేందుకు రెబల్ ఎమ్మెల్యేలకు అర్హత ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్ర నూతన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన బీఎస్ యెడియూరప్ప సోమవారం అసెంబ్లీలో విశ్వాస పరీక్ష ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో 11 మంది కాంగ్రెస్ రెబల్, ముగ్గురు జేడీఎస్ రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటువేయడం గమనార్హం. కాగా, సోమవారం తాను అసెంబ్లీలో విశ్వాసపరీక్షలో వందశాతం నెగ్గుతానని సీఎం యెడియూరప్ప ధీమా వ్యక్తంచేశారు. రెబల్స్‌పై స్పీకర్ నిర్ణయం నిబంధనలకు విరుద్ధమని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్, జేడీఎస్ స్వాగతించాయి. స్పీకర్ నిర్ణయంతో అసెంబ్లీలో స్థానాల సంఖ్య 207కు పడిపోయింది. యెడియూరప్ప విశ్వాస పరీక్ష నెగ్గడానికి 104 మంది సభ్యుల మద్దతు చాలు. ప్రస్తుతం సభలో 105 మంది బీజేపీ సభ్యులు ఉండగా, ఓ స్వతంత్ర సభ్యుడు మద్దతునిస్తున్నారు.

**నా మనఃసాక్షి మేరకే అనర్హత వేటు: స్పీకర్**

తన మనఃసాక్షి మేరకు రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నానని, ఇది న్యాయబద్ధమేనని స్పీకర్ రమేశ్‌కుమార్ చెప్పారు. తనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వనున్నట్లు బీజేపీ సంకేతాలిచ్చిన నేపథ్యంలో రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం ద్వారా తాను స్వచ్ఛందంగా వైదొలుగబోనని స్పీకర్ సంకేతాలిచ్చారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని కాంగ్రెస్, జేడీఎస్ దాఖలు చేసిన పిటిషన్ల మేరకే నిర్ణయం తీసుకున్నానన్నారు. తమ రాజీనామాలతోపాటు తమపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తన ముందు హాజరై వివరణ ఇచ్చేందుకు 4 వారాల గడువు కావాలన్న రెబల్ ఎమ్మెల్యేల అభ్యర్థనను తిరస్కరించినట్లు స్పష్టం చేశారు. 'నాపై మానసికంగా ఒత్తిడి తెచ్చారు. నేను పూర్తిగా నిరాశానిస్పృహలకు గురయ్యా' అని స్పీకర్ భావోద్వేగపూరితంగా వ్యాఖ్యానించారు. సోమవారం విశ్వాస పరీక్ష నెగ్గడంతోపాటు ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపడమే ఏజెండా అని చెప్పారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు బీజేపీ యత్నిస్తుందన్న అంశంపై స్పందిస్తూ.. 'తీర్మానం ముందుకు రానివ్వండి. నేనెలా వ్యవహరిస్తానో మీరే చూస్తారు. స్పీకర్‌గా నా విధులు నిర్వర్తిస్తా. ఏం జరుగుతుందో చూద్దాం' అని అన్నారు. తాను రాజనీతిజ్ఞుడిలా నిర్ణయం తీసుకున్నానన్నారు. బీఎస్పీ ఎమ్మెల్యేపైనా ఫిర్యాదు వచ్చిందన్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలా? వద్దా? అన్నది కోర్టులు నిర్ణయిస్తాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**పార్టీ ఒత్తిడి మేరకే స్పీకర్ నిర్ణయం: బీజేపీ**

తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ స్పీకర్ రమేశ్‌కుమార్ తీసుకున్న నిర్ణయం అనుచితమని, చట్టాన్ని ఉల్లంఘించడమేనని బీజేపీ ఆరోపించింది. బీజేపీ సీనియర్ నేత గోవింద్ కర్జోల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి మేరకే స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

**ప్రజలు సరైన శిక్ష విధిస్తారు: కాంగ్రెస్**

రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన స్పీకర్ రమేశ్ కుమార్ నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. 'బీజేపీతో చేతులు కలిపి సంకీర్ణ సర్కార్‌ను కూలదోసిన రెబల్స్‌కు ప్రజలు సరైన శిక్ష విధిస్తారు' అని ట్వీట్‌చేసింది. స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య విజయం అని సీఎల్పీ నేత సిద్దరామయ్య అన్నారు. 'ప్రజాతీర్పునకు భిన్నంగా స్వార్థ ప్రయోజనాల కోసం అమ్ముడుబోయినవారి నీచ సంస్కృతికి ఈ నిర్ణయం చరమ గీతం పాడుతుందని నేను విశ్వసిస్తున్నా' అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పెకిలించడానికి ప్రయత్నించిన రెబల్స్‌పై అనర్హత వేటు వేసి స్పీకర్.. బీజేపీకి గట్టి సందేశం పంపారని జేడీఎస్ ట్వీట్ చేసింది.

**విశ్వాస పరీక్షపై యెడియూరప్ప ధీమా**

అసెంబ్లీలో వంద శాతం తన ప్రభుత్వం విశ్వాస పరీక్ష నెగ్గుతుందని సీఎం బీఎస్ యెడియూరప్ప ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. విశ్వాస పరీక్ష నెగ్గడంతోపాటు గత ప్రభుత్వం రూపొందించిన ఆర్థిక బిల్లు (ద్రవ్య వినిమయ బిల్లు)ను యథాతథంగా ఆమోదిస్తామన్నారు. తక్షణం ఆర్థిక బిల్లును ఆమోదించాల్సి ఉన్నదని, లేకపోతే ప్రభుత్వోద్యోగుల వేతనాలూ చెల్లించలేమన్నారు.


**సిద్దరామయ్యే విపక్ష నేత: దేవెగౌడ**

సీఎల్పీ నేత సిద్దరామయ్య అసెంబ్లీలో విపక్ష నేతగా వ్యవహరిస్తారని జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుమారస్వామి జేడీఎస్‌ఎల్పీ నేతగా ఉంటారన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్-జేడీఎస్ కూటమి కొనసాగింపుపై తుది నిర్ణయం కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

### అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు:** ప్రతాప్‌గౌడ పాటిల్, బీసీ పాటిల్, శివ్‌రామ్ హెబ్బర్, ఎస్టీ సోమశేఖర్, బైరాటీ బసవరాజ్, ఆనంద్‌సింగ్, రోషన్ బేగ్, మునిరత్న, కే సుధాకర్, ఎంటీబీ నాగరాజ్, శ్రీమంత్ పాటిల్.
**జేడీఎస్ ఎమ్మెల్యేలు:** గోపాలయ్య, ఏహెచ్ విశ్వనాథ్, నారాయణ గౌడ.
**గురువారం వేటు పడిన వారు:** రమేశ్ జార్కిహోళీ, మహేశ్ కుమటల్లీ, శంకర్.

### సుప్రీంకోర్టుకెళతాం: రెబల్ ఎమ్మెల్యేలు



తమపై అనర్హత వేటు వేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమని, దీనికి వ్యతిరేకంగా సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని కాంగ్రెస్, జేడీఎస్ అసమ్మతి ఎమ్మెల్యేలు చెప్పారు. జేడీఎస్ అసమ్మతి ఎమ్మెల్యే ఏహెచ్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. 'మాకు కేవలం విప్ జారీచేశారు. మేం సభకు హాజరయ్యేందుకు మీరు బలవంతం చేయలేరు' అని అన్నారు. కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యే ప్రతాప్‌గౌడ పాటిల్ ఒక వీడియో సందేశం విడుదల చేస్తూ ఓటర్లు ఆందోళన చెందనవసరం లేదన్నారు. శివ్‌రామ్ హెబ్బర్ మాట్లాడుతూ స్పీకర్‌ది పక్షపాత పూరిత నిర్ణయం అని ఆరోపించారు.

## స్పీకర్ నిర్ణయంతో యెడియూరప్పకు మేలే!

- అనర్హతతో నేటి విశ్వాస పరీక్ష విజయానికి బాట
- పూర్తి మెజారిటీకి ఉప ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాల్సిందే

**బెంగళూరు:** రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయం సీఎం బీఎస్ యెడియూరప్పకు ప్రయోజనకరమని విశ్లేషకులు చెప్తున్నారు. కుమారస్వామి ప్రభుత్వ పతనానికి పరోక్షంగా సహకరించిన రెబల్ ఎమ్మెల్యేలకు తన క్యాబినెట్‌లో చోటు కల్పిస్తానని యెడియూరప్ప వారికి హామీలిచ్చారని ఆరోపణలున్నాయి. రెబల్స్‌పై అనర్హత వేటుతో అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 207 మందికి చేరింది. విశ్వాస పరీక్ష నెగ్గాలంటే యెడియూరప్ప సర్కార్‌కు 104 ఓట్లు చాలు. బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేలతోపాటు ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతునిస్తున్నారు. కానీ సభలో బీజేపీకి స్వల్ప ఆధిక్యమే ఉన్నది. పూర్తిస్థాయి మెజారిటీకి 113 సభ్యుల మద్దతు అవసరం. స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టకుంటే తప్ప.. త్వరలో 17 స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో ఆ 8 స్థానాల్లో గెలుపొంది తన ప్రభుత్వ సుస్థిరతకు అవసరమైన మెజారిటీని యెడియూరప్ప కూడగట్టుకోవాలి. ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లొసుగులను కర్ణాటక పరిణామాలు బయటపెట్టాయని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. దీనికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనమే పరిష్కార మార్గాలు చూపాల్సి ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు.



బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం యెడియూరప్పను సత్కరిస్తున్న పార్టీ ఎమ్మెల్యేలు

## ఐపీఎల్ మాదిరిగా సీబీఎల్!

- పడవ పోటీలను నిర్వహిస్తున్న కేరళ పర్యాటక శాఖ
- రూ. 5.9 కోట్ల ప్రైజ్ మనీ.. ఆగస్టు 10న పోటీలు ప్రారంభం

**తిరువనంతపురం:** భారత్‌లో ఐపీఎల్‌కు ఉన్న ఆదరణ అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఇదే తరహాలో పడవ పోటీలు రానున్నాయి. ఏటా కేరళలో 'స్నేక్ బోట్ రేస్'లు జరుపుతారు. ఈ ఏడాది ఐపీఎల్ తరహాలో 'స్నేక్ బోట్ రేస్' టోర్నీ నిర్వహించాలని కేరళ పర్యాటక శాఖ నిర్ణయించింది. వచ్చేనెల 10 నుంచి ఈ టోర్నీ ప్రారంభం అవుతుంది. 'ఛాంపియన్స్ బోట్ లీగ్ (సీబీఎల్)' పేరిట వీటిని నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 9 జట్లు ఉంటా యి. సీబీఎల్ ఈ ఏడాది ఆగస్టు 10న ప్రారంభమై నవంబర్ 1న ముగుస్తుంది. కేరళ పర్యాటక మంత్రి కడకంపల్లి సురేంద్రన్ ఈ టోర్నీ వివరాల్ని శనివారం చెప్పారు. ఆగస్టు 10న టోర్నీని అలప్పుజాలో క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి సీఎం పినరాయి విజయన్ ప్రారంభిస్తారు. పోటీల్లో పాల్గొనే 9 జట్ల కొనుగోలుకు ఆగస్టు 1న వేలం నిర్వహిస్తారు. ఈ లీగ్‌లో 12 మ్యాచ్ లుంటాయి. 12 వారాంతాల్లో పది ప్రాంతాల్లో ఈ పోటీ లు జరుగుతాయి. ఈ లీగ్‌కు అర్హత సాధించిన తొమ్మిది జట్లకు ప్రతి వేదిక నుంచి బోనస్‌గా రూ.4 లక్షలు అందజేస్తారు. ప్రతి లీగ్ మ్యాచ్‌లో తొలి ముగ్గురు విజేతలకు రూ. 5 లక్షలు, రూ. 3 లక్షలు, రూ.లక్ష బహుమతిగా ఇస్తారు. ఇక మొత్తం లీగ్‌లో తొలి 3 స్థానా ల్లోని 3 టీమ్‌లకు రూ. 25 లక్షలు, రూ. 15 లక్షలు, రూ. 10 లక్షలను బహుమతులుగా అందజేస్తారు. ఈ లీగ్ మొత్తం అందించే ప్రైజ్ మనీ రూ. 5.9 కోట్లు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.




కాటనౌ(బెనిన్): పశ్చిమ ఆఫ్రికా రీజియన్ పరిధిలోని మూడు దేశాల పర్యటనకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వెళ్లారు. ఆదివారం బెనిన్ దేశానికి చేరుకున్న ఆయనకు ఘనస్వాగతం లభించింది. పశ్చిమ ఆఫ్రికా రీజియన్‌లో భారత రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి.

## 'ఉన్నావో' బాధితురాలికి గాయాలు

**న్యూఢిల్లీ:** యూపీలోని ఉన్నావో ఎమ్మెల్యే కుల్‌దీప్ సెంగార్‌పై లైంగిక దాడి ఆరోపణలు చేసిన మహిళ గాయపడ్డారు. బాధితురాలు ఆదివారం తన తల్లి ఆశా సింగ్, బంధువు పుష్పాసింగ్, న్యాయవాది మహేంద్ర సింగ్‌తో కలిసి రాయబరేలీకి వెళుతుండగా ట్రక్కు ఢీకొట్టింది. బాధితురాలి తల్లి, బంధువు మరణించగా, ఆమె, న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నది. రోడ్డు ప్రమాదం ఒక కుట్ర అని, ఇది ఎమ్మెల్యే కుల్‌దీప్ సెంగార్ పనేనని బాధితురాలి సోదరి ఆరోపించారు.

## బీహార్‌లో దున్నపోతుల కొమ్ముల పాలిష్‌కు..

# రూ.16 లక్షల ఆవనూనె

**పాట్నా, జూలై 28:** బీహార్‌లో దున్నపోతుల కొమ్ములకు పాలిష్ కోసం రూ.16 లక్షల విలువైన 49,950 లీటర్ల ఆవనూనె వినియోగించారట. ఎద్దులను రాంచీ నుంచి పలు ప్రాంతాలకు స్కూటర్, కారులో తరలించారట. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ ప్రభుత్వ హయాంలో జరిగిన దాణా కుంభకోణంలో విస్తుపోయే ఇలాంటి ఎన్నో అక్రమాలను ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి సుశీల్‌కుమార్ మోదీ బయటపెట్టారు. 1977-78 నుంచి 2015-16 ఆర్థిక సంవత్సరాల వరకు ఖర్చయిన నిధులకు ఆమోదం తెలిపేందుకు ఎక్సెస్ ఎక్స్‌పెండిచర్ అప్రాప్రియేషన్ బిల్లు - 2019ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా పలు అక్రమాలను సుశీల్ కుమార్ మోదీ ప్రస్తావించారు. రూ.658 కోట్ల ఖర్చుకు సంబంధించిన కేసులు రాంచీ, పాట్నా సీబీఐ కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటంతో వీటిని ఆమోదించలేకపోతున్నట్లు సభకు ఆయన వివరించారు.

## విశ్వకవి సినారె!

**విశ్వంభర** వీణ మీద
నవతంత్రీ మీటినయెద
జ్ఞానపీఠమెక్కి జీవన
నిజశైలియె కవన మేధ!

గాన గంధర్వమే మీదు
గజల్ శ్రావ్యగాన విందు
పరవశింపజేయు పరిత
పగలే వెన్నెల యందు!

మీ పాటలాపాతమధురం
కవనరచనె సుందరం
సామాజిక చేతన నిండె
మానవీయ గేయ బంధురం!

మీ కావ్యరచనె తపస్సు
సాహితీజగాన ఉషస్సు
నవరస రంజితస్ఫూర్తియె
పరితలకిచ్చు శ్రేయస్సు!

నాదారి పూల దారని
పాటలతోట రాగధుని
మట్టిపరిమళాల సురుచి
వెలయించిన కవితామణి!

విశ్వవేదిక మీ కవనం
విలసిల్లగ తెన్గువనం
సాహితీఫల పరిమళాల
వెదజల్లెను తెలుగుదనం!

**– డాక్టర్ గన్నోజుశ్రీనివాసాచారి**
**94901 45913**

## చెమట చుక్కల సంతకం

**అప్పుడప్పుడు**
పువ్వులు కూడా పరీక్షనెదుర్కోవాల్సి
వస్తది
పరిమళం మీద కుట్ర పన్నితేనే తీరని బాధ

వెలుతురు పిచ్చుక
ఏ కొమ్మమీద వాలిన తన
గొంతునే వినిపిస్తుంది
గొంతులో గునపం దించితేనే తీరని నొప్పి

చెమట చుక్కల్ని
ఒక్కొక్కటిగా పోగుచేసి నిర్మాణం
చేసుకున్నోళ్ళం
కొట్లాడి శిఖరం నడిబొడ్డున జెండాను
పాతుకున్నోళ్ళం
ఇవాళ చరిత్ర నాది అంటే ఎట్ల..?

గాయాలు పచ్చిగానే ఉన్నాయి
నెత్తురు తడింకా ఆరిపోలేదు
పరిమళం వీస్తూనే ఉంటుంది
పిచుక గొంతెత్తుతూనే ఉంటుంది
చరిత్ర మీద ఎప్పటికైనా చెమట చుక్కలదే
చివరి సంతకం!!

**– బిల్ల మహేందర్, 9177604430**

కథా గమనంలోను, పాత్రల సజీవ చిత్రణలోను, లలితమైన అభివ్యక్తిలోను, విలక్షణత్వాన్ని పుణికిపుచ్చుకున్న – కర్పూర వసంతరాయలు, పాఠకుల, శ్రోతల మన్ననలను పుష్కలంగా చూరగొంది. 1960–80 దశకాలలో, ఆంధ్రదేశంలో ఎక్కడ కవిగారి సభ జరిగినా అది యీ కావ్యగానం లేకుండా జయప్రదం కాలేదన్నది నగ్న సత్యం. అంతేకాదు లబ్ధ ప్రతిష్ఠులైన కవులనుండీ ఉద్యమానులైన యువకవుల వరకూ, ఎందరో ఆ బాణిలో కథా కావ్యాలను రాశారంటే ఈ కావ్య ప్రభావం ఎంత బలీయమైందో మనం ఊహించవచ్చును.

# కర్పూర వసంతరాయలు

**కవిత్వం ఒక అక్షర తపస్సు**
**కవిత్వం ఒక అక్షయ యశస్సు**
**కవిత్వం**
**భావాంబర వీధుల్లో విహరించే మనో విహంగం ముందు**
**సాక్షాత్కరించే ఒక రసోదయ ఉషస్సు!**

ఆ తపస్సును పండించుకుని, ఆ యశస్సును సముపార్జించుకుని, తాము దర్శించిన రసోదయ ఉషస్సులోని రోచిస్సులను, అక్షర గవాక్షాల ద్వారా అశేష పాఠకలోకానికి అందించి, అలరిస్తున్న కవులలో ప్రముఖులు డాక్టర్ సి. నారాయణరెడ్డి.

ఆయన మాటకు పరిమళాన్ని, పాటకు సంగీత గమకాన్ని నేర్పిన శబ్దశిల్పి. **పూల పాటల** నుండి నేటి **మినీ కవితల** మేలి బాటల వరకు, **నవ్వని పువ్వు** నుండి **నారాయణరెడ్డి గజల్స్** వరకు **వెన్నెలవాడ** నుండి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న **విశ్వంభర** వరకు ఆయన కవితా ప్రస్థానం ఒక సాహితీ జైత్రయాత్రగా కొనసాగుతూనే వుంది.

ఆధునిక గేయ కవిత్వంలో లఘు కథా కావ్యాలను ప్రారంభించిన ఘనత,అభ్యుదయ కవితలవాడ శ్రీ గురజాడకు దక్కుతుంది. ఆయన రాసిన **లవణరాజు కల, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ** వంటి రచనలు ఈ కోవకు చెందుతాయి. ఆ తర్వాత శ్రీ తల్లావఝుల శివశంకరశాస్త్రి 'వకుళ మాళిక' ని, విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాట'లని, పుట్టపర్తి నారాయణాచార్యులు 'శివతాండవా'న్ని గేయ కథాకావ్యాలుగా అందించారు. వీటిలో కథ నామమాత్రంగా వుండి, కవి రచనా విన్నాణమే యెక్కువ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కావ్యానికి కథాబలం ముఖ్యమన్న విషయాన్ని గమనించిన సినారె వస్తువులోను, అభివ్యక్తిలోను ప్రకృష్టమైన బంధాన్ని ఏర్పరచి, తమ కావ్యాలను గేయ ప్రబంధాలుగా తీర్చిదిద్దారు. **నాగార్జున సాగరం, స్వప్నభంగం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథ నాయకుడు, ఋతుచక్రం, జాతిరత్నం** ఆయన రాసిన గేయ కథాకావ్యాలు. వీటిలో వాసిలోను, వన్నెలోను, సొబగులోను, బిగువులోను తారా మణిహారంగా నిలిచే కావ్యం **'కర్పూర వసంతరాయలు'**.

'కర్పూర వసంత రాయలు' కావ్య రచనకు మూల ప్రేరణ రెడ్డి రాజుల యుగంలో ప్రసిద్ధుడైన కుమారగిరి రెడ్డికి–కర్పూర వసంతరాయలు– అనే బిరుదు వుందన్న యెరుక. ఆ యెరుకతో పొందిన స్పందన మల్లంపల్లి రచనలు అందించిన వివరణ, యీ కావ్య రచనకు ఆధారమని స్వయంగా సినారె తమ భూమికలో పేర్కొన్నారు. కవి కమనీయ కల్పనతో రూపం దిద్దుకున్న యీ కావ్యం–అయిదు ఆశ్వాసాల గేయ ప్రబంధం. మొదటి ఆశ్వాసంలో మదనోత్సవ సంబరం, నగరోద్యానంలో పూవిల్లుని పూజ, లకుమ నృత్య కళా ప్రదర్శన, రాయలచే కంఠహార బహూకరణ ప్రధానమైన అంశాలు. రెండవ ఆశ్వాసంలో లకుమ–వసంతరాయలుల ప్రణయోద్దీపన, లకుమకు రాజనర్తకి పదవీ పరికల్పన, లకుమ సంతోషము మహారాణి సంతాపము హృద్యంగా వర్ణించబడ్డాయి. మూడవ ఆశ్వాసంలో లకుమ –రాయలుల తీర్థయాత్రలు, లకుమ నాట్యలీలలో రాయలు అనుభవించిన ఆనందహేల, అంతఃపురంలో మహారాజ్ఞికి పీడకలల కలత–అక్షర రూపాన్ని సంతరించు కున్నాయి. నాల్గవ ఆశ్వాసంలో లకుమ కోసం కేళీ మందిర నిర్మాణం కాటయ వేముని దండయాత్ర, లకుమ నాట్య భంగిక పరవశించిన రాయలుచే వసంత రాజీయ నాట్యశాస్త్ర రచన. రాచకార్య బహిష్కరణ కాటయ వేముని అభ్యర్థన ముఖ్యమైన ఘట్టాలు. ఇక ఐదవ ఆశ్వాసంలో బావమరిది అభ్యరనపై రాయలు దర్బారుకు రాక, లకుమ కాలుబెణికిందన్న వార్తతో నిష్క్రమణ–ప్రజల గుసగుసలు –మహారాజ్ఞి పరితాపము–స్వయంగా లకుమ మందిరానికి వెళ్లి–వ్యక్తిగత స్వార్థం కోసం గాక దేశ క్షేమంకోసం రాయలపై గల ప్రణయాన్ని త్యాగం చేయవలసిందిగా అభ్యర్థన–లకుమ త్యాగం–రాయలులో కర్తవ్య జాగరణ–కమనీయంగా కావ్యబద్ధ మయ్యాయి.

కర్పూర వసంతరాయలు కావ్యంలో భావగాంభీర్యము, భాషా సౌకుమార్యము రెండూ సమపాళ్లలో ముందుకు సాగాయి. మదనోత్సవానికి బయలుదేరిన కుమారగిరిరెడ్డిని ప్రశంసిస్తూ వంది మాగధులు పలికిన కైవారాలు..

**'జయ జయ సమగ్రాంధ్ర**
**సర్వం సహా భార**
**సంభరణ శేషాహి రూపా!**
**పరి పంథి నృపతి దో**
**ర్దల కంధి మంథనా**
**పర మంద రాద్రి స్వరూపా..!'**

అంటూ సాగే సంస్కృత సమాన రచన రెడ్డిగారి ఉభయ భాషా పాండిత్యానికి నిదర్శన.

అభివ్యక్తిలో సరికొత్త అందాన్ని ఆవిష్కరించడం ఈ కవికి వెన్నతో పెట్టిన విద్య. ఉత్సాహం ఉరకలు వేసే యువతీ యువకుల సంబరాన్ని వర్ణిస్తూ..

**'ఏ మొగమ్మున చూపు నిలిపిన**
**యిగురు వోసెడు కాంతి వల్లులు**
**ఏ సిగను పరికించి చూసిన**
**ఏటవాలుగ నవ్వు మల్లెలు..'** అంటారు కవి.



ఈ చరణంలో మొదటి రెండు పాదాలు యువకుల మనోభావాలకి, మిగిలిన రెండు పాదాలు యువతుల నయనాభిరామ సౌందర్యానికి అద్దం పడతాయి. వడివడిగా నడిచేటప్పుడు, గాలి విసురుకి సిగలోని మల్లె సరులు నిటారుగా కాక ఏటవాలుగా ఎగురుతుంటాయి. ఈ సూక్ష్మాన్ని ఎంతో సుందరంగా అక్షరబద్ధం చేశారు. ఇది వారి పరిశీలనా దృష్టికి ఒక ఉదాహరణ మాత్రమే!

లకుమ, కుమారగిరిరెడ్డి–యిరువురి మధ్య పొటమరించిన అనురక్తి కేవలము కాయికమైన వ్యామోహానికి సంబంధించినది కాదని, జననాంతర సౌహృదాని ఏర్పడిన రాగబంధమని ధ్వనింప జేస్తారు డాక్టర్ నారాయణరెడ్డి.

**'లకుమయే రాణ్మౌళి**
**బ్రతుకు నావను నడుపు చుక్కాని**
**లకుమయే తేని లీ**
**లా మహా సామ్రాజ్యమున రాణి..'**
**'ఆమె కన్నులు విరిసి**
**నంతనే అతడు పగలను కొనును**
**ఆమె కన్నులు మోడ్చి**
**నంతనే రాతిరియయ్యెననుకొనును..'**
**'నాదేవర నా గుండియు**
**పాదున రతనాల మొలక**
**నా మనసే పంజరమ్ము**
**గా మెలగెడు రామచిలుక..'** అన్న పంక్తులు యీ సత్యాన్నే చాటి చెపుతాయి.

భంగ్యతరంగా సౌందర్యాన్ని ప్రభావోత్పాదకంగా వర్ణించడము ఈ కావ్యంలోని మరొక విశేషమైన అంశం. లకుమ సౌందర్యాన్ని వర్ణించిన తీరు యిందుకు మకుటాయమానంగా నిలుస్తుంది. తనలో రాగము రవళి రవళింప జేసిన లకుమను పంచభూతాత్మకమైన ప్రకృతికి ప్రతీకగా రాజు భావించడం, ఆ పంచభూతాల పోలికతోనే పరోక్షంగా లకుమ శారీరక సౌందర్యాన్ని మన మనోఫలకం పైన అంకితం చేయడం.. కవి ప్రతిభకు మచ్చుతునకలుగా నిలుస్తాయి.

**'పృథివి నాయమ జఘన పీఠమ్మునం జూచి**
**జల మామె కంటి పాపల లోతులం జూచి**
**తేజమ్ము నామె ముఖ రాజీవమున గాంచి**
**వాయుగతి నామె నిశ్వాసముల గుర్తించి**
**ఆకాశమామె మధ్యము నందు గమనించి**
**నిఖిల సృష్టికి లకుమనే ప్రతీకగ నెంచి..'** అన్న వర్ణనలో కవి ప్రకటించిన కౌశలం, ఆయన ప్రతిభా, వ్యుత్పన్నతలకు నికషోపలం.

సాంప్రదాయికమైన ఉపమానాలను స్వీకరిస్తూనే స్వతహాగా ఉన్న ప్రతిభతో అభివ్యక్తిని మరింత హృదయంగమంగా రూపొందించడం ఈ కవికి కరతలామలకం. లకుమ–రాయలు వీరి పరస్పర రాగానుబంధాన్ని తెలియజేసే ఘట్టంలో..

**'నీ వొక నాగ స్వర మవు**
**నేనో నాగిని మాత్రము**
**ఇరువుర బంధించి వేసే**
**నేదో అంతస్సూత్రము –**
**నీవు నిండు చందురుడవు**
**నేనో కల్వల చెల్వను**
**పరిమళ సోపాన పంక్తి**
**యిరువుర నేకము చేసెను..'** అన్న పంక్తులను యిందుకు ఉదాహరణంగా పేర్కొనవచ్చు.

ఒక క్రియకు జరిగే భిన్న ప్రతిక్రియలను ఏకకాలంలో, గుండెకు హత్తుకునేలా వర్ణించడం ఈ కావ్యంలోని యింకొక ప్రత్యేకమైన అంశం. లకుమను రాజ నర్తకిని చేసినప్పుడు..

**'లకుమ కావార్త క**
**ల్వ నెలంత కంటి పా**
**పల పైన పాల వె**
**న్నెల సోకినటులయ్యె..'**
**'రాణి కా వార్త క**
**ల్వ నెలంత చెవులలో**
**ఖర కరుని అశ్వరిం**
**ఖల చప్పుడుగ తోచె..'** అన్న వర్ణన
**'లకుమ అపుడే తొలిసారిగ**
**రాయని తన మనసార కౌగిలించె**
**అచట కొండ వీట రాణి**
**అతి వికృత స్వప్నమున కలవరించె,**
**ఇట తేడు లకుమను తన**
**హృదయ పట్టమహిషిగా ప్రతిష్ఠించెను**
**అచట రాణి కలలో, శ**
**య్యపై పొరలి, పొరలి నేల పై దొరలెను..'** అన్న పంక్తులు ఈ భిన్న దృశ్యమాలికా గ్రథన కౌశల్యానికి కరదీపికలుగా భాసిస్తాయి. ఏ కథా కావ్యంలో అయినా, నాటకీయత, సంవాదాత్మక శైలి ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. అవి పాఠకుని మనస్సులో పాత్రలను సజీవంగా ప్రతిష్ఠిస్తాయి. ఈ కావ్యంలో కూడా లకుమ–వసంతరాయలు మధ్య సాగిన ఎన్నో సంవాదాత్మక సంభాషణలు ఆ ప్రయోజనాన్ని పుష్కలంగా సాధించాయి.

> ద్వితీయ ముద్రణకు కర్పూర సౌరభాన్ని అందిస్తూ డాక్టర్ దివాకర్ల వెంకటావధాని గారు.. 'రమ్యమైన కథను గ్రహించి, దానిని రసభావ మహితముగా గ్రంథించి, గేయ రూపమున తీర్చిదిద్దిన కీర్తి నారాయణరెడ్డి గారికే దక్కుతుంది' అన్న మాట లు అక్షర సత్యాలుగా మన ముందు నిలుస్తాయి. ఈ కావ్యం అయిదుసార్లు ముద్రణకు నోచుకోవడం కూడా ఆ కావ్య గరిమకు తార్కాణంగానే పేర్కొనవచ్చు.

**'ఓ లకుమా**
**నీ పూదిన ఊపిరి యే**
**ఈ వసంత రాజీయము..'**
**మట్టిని ఒక అనర్ఘ**
**మణిగా మలచితి వీవే**
**రాతిని సాల గ్రామము**
**గా తీరిచినా వీవే..'** అని రాజు అంటే..
**'ప్రభూ పాద దాసి నిటుల**
**ప్రశంసించ దగునా?**
**కాలిధూళి ఏనాటికి**
**గంధపు పొడి యగునా..?'** అని లకుమ బదులు చెప్పిన తీరు యెంతో సప్రశ్రయంగా కనిపిస్తుంది.

కర్పూర వసంతరాయలు ప్రధానంగా శృంగార రస ప్రబంధంగా సాగినా, కరుణ రసం, వీర రసం దానికి తోడుగా నిలిచాయి. ముగింపులో త్యాగానికి, దేశభక్తికి పెద్ద పీట వేయడం వల్ల, కావ్య వస్తువు మరింత ఔచిత్యాన్ని సంతరించుకుని, విశ్వజనీనమైన సందేశాన్ని ప్రబోధించింది.. **'భోగంలో కాదు, గొప్పతనం త్యాగంలో వుంది'** అని నిరూపించిన లకుమను దేశభక్తికి నిలువెత్తు దర్పణంగా నిలిపింది.

తన కోసం కాక దేశ సంక్షేమం కోసం లకుమను త్యాగం చేయమని మహారాణి అభ్యర్థించే సన్నివేశం పాఠకుల హృదయాల్ని పిండివేస్తుంది..

**'దేశ మొక దెస, నీవు ఒక దెస**
**తేల్చుకొను మెయ్యది ఘనమ్మో**
**వ్యక్తి – సంఘములందు యెయ్యది**
**ప్రథమ గణ్యమొ చెప్పవమ్మా..'** అంటూ మహారాణి వేసిన ప్రశ్న దేశభక్తిని ప్రేరేపిస్తుంది. తూర్పున బాలభానుని తొలికిరణ ప్రసరణంతో లకుమలోని యిరుల దొంతర కూడ తొలగిపోతుంది. ఆమెలో ఒక వజ్ర సంకల్పము వేళూనుతుంది. శిబి. దధీచులను మించిన త్యాగం చేస్తూ లకుమ తన ప్రాణాలను అర్పిస్తుంది. ఆ బలిదానంలో వసంతరాయునికి కర్తవ్యం స్ఫురిస్తుంది.

**'ఓ లకుమ ఎటు నుంటివో నీవు? ఇంకెచట**
**పరమ సాధ్వీ జగత్ స్వర్ణాసనము పైన..'**
**ఓ సఖీ ఏమందువో నీవు? ఇంకేమి?**
**వ్యష్టికన్నను దేశ దృష్టియే గరిష్ఠమని..'**
అంటూ రాజు కర్తవ్యపథంలో అడుగు పెడతాడు.
**'కొమరగిరి చరితమ్ము కొండవీటను శిశిర**
**మును సైతము వసంతముగ రూపు గట్టించు.. '**
**కొండవీటను పాదు కొన్నట్టి మట్టిలో**
**సైతమ్ము కర్పూర సౌరభమ్ములు వీచు..'** అంటూ కవి తన కావ్యాన్ని ముగిస్తారు. ఈ చివరి వాక్యాలను చదువగానే కొందరి మనస్సులో కిన్నెరసాని పాటల ముందుమాట కల్పనలో విశ్వనాథ వారు అన్న

**'అచట కిన్నెరసాని**
**నాయాత్మయందు**
**ఇప్పటికి దాని సంగీతమే నినదించు..'**

అనే పంక్తులు అప్రయత్నంగానే ముఖరితమౌతాయి. ఇది యాదృచ్ఛికమైనా కావచ్చు, లేదా కవి సిద్ధ హృదయంపై కిన్నెరసాని పాటలు వేసిన అజ్ఞాతముద్ర అయినా కావచ్చు.

కావ్యం చదవటం పూర్తిచేసిన తర్వాత సామాన్య పాఠకుని మనస్సులో ఒకటి, రెండు సందేహాలు తలెత్తుతాయి! ఎంతో విజ్ఞుడు, ప్రాజ్ఞుడు అయిన కుమారగిరిరెడ్డి లకుమ సౌందర్యానికి దాసోహమని రాచకార్యాలను విస్మరించడం, బావమరిది మాటను, పట్టపురాణి ఆవేదనను పెడచెవిని పెట్టడం, నిండు దర్బారును ధిక్కరించడం..సమంజస మేనా? అన్నది మొదటి సందేహం. అయితే ఇనుప కచ్చడాల్ కట్టుకున్న ముని ముచ్చులే, అప్సరసల అందాలకు బందీలై, తపోభంగానికి పాల్పడినప్పుడు రసజ్ఞుడు రాగ హృదయుడు అయిన కర్పూర వసంతరాయలు అలా ప్రవర్తించడం మానవ సహజమనే అనిపిస్తుంది. కావ్యం చివరలో మానసిక వేదనతో, మరణ యాతన అనుభవిస్తున్న లకుమ తనను తాను సానిదానిగా సంబోధించుకోవటం మాత్రం కొంచెం యెబ్బెట్టుగానే అనిపిస్తుంది. అలా అనే బదులు ఆటవెలదికి అంటే బాగుండేదేమో!

ఇక అభివ్యక్తి పరంగా **కర్పూర వసంత రాయలు** లో ఎన్నో విశిష్టతలను వెలయించారు సినారె. త్రస్య, చతురస్ర గతులలో సాగే గేయఛందస్సులో ఎన్నో ప్రయోగాలు చేశారు. ఒకటి, రెండు మాత్రలను పెంచి తగ్గించి నడకకు నవ్యతను చేకూర్చారు. సాంప్రదాయిక కవులు సీసపద్యాలలో ఎన్నెన్ని చమత్కారాలను సాధించారో, గేయ ఛందస్సులో డాక్టర్ సినారె అన్ని చమక్కులు చూపించారు. పరిమళించే పదబంధాలకు పెట్టింది పేరు ఆయన. ఆచంట జానకిరామ్ గారి మాటల్లో.. కాలిధూళి, గంధపు పొడి, పాద పరాగము, పాపిట సింధూరము యీ పదముల పొందిక గమనింపదగినది. ఇలాగే కావ్యమంతటా అందమైన మాటలు పచ్చ కర్పూరపు పలుకులు లాగా పరిమళిస్తాయి.

ద్వితీయ ముద్రణకు కర్పూర సౌరభాన్ని అందిస్తూ డాక్టర్ దివాకర్ల వెంకటావధాని గారు.. 'రమ్యమైన కథను గ్రహించి, దానిని రసభావ మహితముగా గ్రంథించి, గేయ రూపమున తీర్చిదిద్దిన కీర్తి నారాయణరెడ్డి గారికే దక్కుతుంది' అన్న మాటలు అక్షర సత్యాలుగా మన ముందు నిలుస్తాయి. ఈ కావ్యం అయిదుసార్లు ముద్రణకు నోచుకోవడం కూడా ఆ కావ్య గరిమకు తార్కాణంగానే పేర్కొనవచ్చు. (ఈ కావ్యాన్ని రాగి రేకులలో, రాతి పలకలో కనుమూసిన తెనుగుల చరితకు ప్రాణం పోసిన మహామనీషి మల్లంపల్లి సోమశేఖరశర్మగారికే అంకితమివ్వడం కవి ఉన్నత మనస్విన్నతను చాటుతుంది.)

కథా గమనంలోను, పాత్రల సజీవ చిత్రణలోను, లలితమైన అభివ్యక్తిలోను, విలక్షణత్వాన్ని పుణికిపుచ్చుకున్న – కర్పూర వసంతరాయలు, పాఠకుల, శ్రోతల మన్ననలను పుష్కలంగా చూరగొంది. 1960–80 దశకాలలో, ఆంధ్రదేశంలో ఎక్కడ కవిగారి సభ జరిగినా అది యీ కావ్యగానం లేకుండా జయప్రదం కాలేదన్నది నగ్న సత్యం. అంతేకాదు లబ్ధ ప్రతిష్ఠులైన కవులనుండీ ఉద్యమానులైన యువకవుల వరకూ, ఎందరో ఆ బాణిలో కథా కావ్యాలను రాశారంటే ఈ కావ్య ప్రభావం ఎంత బలీయమైందో మనం ఊహించవచ్చును. కొండవీటి మృత్తికలోనే కాదు, సాహిత్యాభిమానుల గుండె వాటికలో కూడా యిప్పటికీ **కర్పూర వసంతరాయలు** కావ్య సౌరభాలు గుబాళిస్తూనే వున్నాయి. గేయ సాహిత్యం వున్నంత వరకు సాహిత్య అధ్యయనం సాగుతున్నంతవరకు, ఆ సౌరభాలు కాలాన్ని కర్పూరంలా పరిమళింపజేస్తూనే వుంటాయి. అందుకే ఆ కావ్యం ఆధునిక గేయ సరస్వతికి సువర్ణ సుమహారం. శత వసంతాల తెలుగు సాహిత్య నందనంలో వసివాడని అక్షర మందారం.

**– కేవీఎస్ ఆచార్య**

**(శత వసంత సాహితీ మంజీరాలు అనే పుస్తకంలో సినారె రాసిన 'కర్పూర వసంతరాయలు' గ్రంథంపై రాసిన వ్యాసం.)**

**(సినారె 88వ జయంతి సందర్భంగా..)**



## చంద్రయానం

సృష్టికి ప్రతిసృష్టిని స్వప్నించబోయేది
చంద్రయానమే!
దేశం కన్న చిన్నదైనా
శ్రీహరికోట ప్రపంచమంత విశాలమౌతోందిప్పుడు!

నా సృష్టికారుల సిరుల కోటా..
భారత అంతరిక్ష వ్యోమనౌకవు నువ్వే!
నువ్వో శాస్త్రసుతుల నిలయమైనందుకు
తల్లిలా పరవశిస్తున్న భూదేవిని నేనే!

నువ్వే ఆర్బిటర్‌వి ల్యాండర్‌వి రోవర్‌వి
సమరయోధునిలా
అన్నీ అమర్చుకుని వెళ్లిన చంద్రయానుడివి
నిన్ననే భూకక్ష్యను దాటించిన శాస్త్రఫల ధీరుడవి
మానవ జ్ఞానాన్ని
రోదసిలోకి పంపిన విశ్వంభరుడివి నువ్వే!

నా శాస్త్రమణుల రాసుల కోటా..
బిడ్డ తల్లి చుట్టు నడయాడినట్లు
ఏ లక్ష్య భ్రమణం కోసం
రోదసి రూపమెత్తి చంద్రబింబం చుట్టూ
ఎన్నెన్ని ప్రదక్షణాలకు
సిద్ధమై వెళ్లావో నాకు తెలియదా!

మన చంద్రయానానికి ముందే
మూడు దేశాలు తలో పాదం మోపాయిలే!
జలశోధనే జలాన్వేషణే
చంద్రయానుని అపరభగీరథ ప్రయత్నమంతా..

చంద్రతలం మీద
జల చిరునామా దొరికితే చాలు
చైనా కండ్లు ఎర్రబడక మానవు
అమెరికా రష్యాలు బరిలోకి దిగక మానరు
అయినా ఎవరి అంతరిక్షం వారిదే!

ఒకప్పుడు
చంద్రతలం మీద తడివుండేదట!
రోవర్ దయవల్ల
ఓ నీటిమడుగో జల సరోవరమో
స్కానింగ్‌లో దొరికితే బాగుండు!
నేనో చేపపిల్లనై
సమర జల శంఖారావాన్ని పూరించేవాణ్ని
అష్టాదశ వర్ణనల్లోని
చంద్రోదయ వర్ణన కాలాంతరం చెందేది
భూమిని భూదేవిగా భావించుకుంటున్నట్లే
చంద్రకాంత మాతృ రూపమెత్తి
మన భూమవ్వ పిల్లలకు చనుబాలు పట్టేది
నాకు నమ్మకాన్ని మించిన నమ్మకం ఉండబట్టే అంటున్నా
చంద్ర మండలం ఎప్పటికైనా
భూ మండలంగా వెల్లువిరుస్తుందని..!!

**– డాక్టర్ నాళేశ్వరం శంకరం**
**9440451960**

## ప్రకటనలు

### 'విశ్వంభర' సాహిత్య పురస్కారం

**డాక్టర్** సి.నారాయణరెడ్డి 88వ జయంత్యుత్సవం సందర్భంగా ప్రఖ్యాత రచయిత డాక్టర్ చంద్రశేఖర కంబార గారికి 'విశ్వంభర'జాతీయ పురస్కార ప్రదానోత్సవం 2019 జూలై 29న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ నార్నెరోడ్ జేఆర్‌పీ కన్వెన్షన్ ట్రేడ్‌ఫేర్స్ సెంటర్‌లో జరుగుతుంది. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా కె.శివారెడ్డి, మహమూద్ అలీ, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డాక్టర్ నందిని సిధారెడ్డి, ఓల్గా హాజరవుతారు.

**- గోవిందరాజు రామకృష్ణారావు, అధ్యక్షులు**
**- డాక్టర్ జె.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి**

### ఆవిష్కరణ సభ

**ప్రొఫెసర్** హరగోపాల్ నివాళి వ్యాసాల సంకలనం 'పరిమళించిన మానవత్వం' ఆవిష్కరణ సభ 2019 జూలై 29న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరుగు సభలో ప్రొఫెసర్ వీ.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్. శేషయ్య, జీవన్‌కుమార్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పద్మకుమారి, ఉదయమిత్ర, ప్రొఫెసర్ జి. హరగోపాల్ ప్రసంగిస్తారు. సి.రామ్మోహన్, పి.స్వామి సభా నిర్వహణలో పాలుపంచుకుంటారు..

**-పాలమూరు అధ్యయన వేదిక**

### హిందీ, ఆంగ్ల అనువాదాల ఆవిష్కరణ సభ

**భూతం** ముత్యాలు రచించిన సూర నవల హిందీ, ఆంగ్ల అనువాదాల ఆవిష్కరణ సభ 2019 ఆగస్టు 18న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి మినీ ఆడిటోరియంలో జరుగుతుంది. డాక్టర్ జి.వి. రత్నాకర్ అధ్యక్ష తన జరుగు సభలో గౌరవ అతిథులుగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ సూర్య ధనుంజ య్, డాక్టర్ అంబటి సురేందర్‌రాజు, దెంచనాల శ్రీనివాస్, డాక్టర్ నిమ్మ బాబురావు, డాక్టర్ మాధవి గోపి, డాక్టర్ చిన్నయ్య మల్లవరపు హాజరవుతారు. డాక్టర్ మాయాదేవి, డాక్టర్ బి. వెంకటరా వు గారలు పుస్తకాలను ఆవిష్కరిస్తారు. సభా నిర్వహణ ఉత్తం శ్రీనివాస్.

**- మాల విద్యావంతుల వేదిక, తెలంగాణ**

## భళారే సినారె



**క**మ్మని కైతల రేడు
చక్కనైన చెలికాడు
పగలే వెన్నెల కురిసి
బతుకంతా గడిపాడు
పరుల కొరకు పాటుపడే
మెత్తని మనసున్నవాడు
నిరంతరం కవిత కొరకు
పరుగులు తీసినవాడు
విశ్వంభరుడై ఎదిగెను సినారె
విశ్వకవిగ విలసిల్లెను భళారె
ఆదిమ నాగరికతలో
నాదాలను స్పృశియించి

కర్పూరపు వసంతాల
సోయగాలు చిలుకరించి
గోగుపూలలోని కొత్త
అందాలను పలుకరించి
నాగార్జునసాగర నవ
తరంగాల మదియించి
భూమికయై ప్రభవించెను సినారె–అమర
వేదికయై వెలుగొందెను భళారె

నవ్వని పువ్వుల లోన
రవ్వలనెన్నో రాల్చీ
దివ్వెల మువ్వల తోడ
సవ్వడులెన్నో చేసీ
మరణానికి పాలుపట్టి
జోల పాట పాడి
గున్నమామిడీ కొమ్మల
గూళ్ల తోడ ఆడి
వేద్మ నినదించెను సినారె–జ్ఞాన
పీఠ్మ కనిపించెను భళారె..

**– తిరునగరి శ్రీనివాసస్వామి**
**94403 69939**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో కూలిన పెంకుటిల్లు



లోక కల్యాణార్థమే బోనాల పండుగను నిర్వహించుకుంటున్నామని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవంలో పాల్గొన్న స్పీకర్ బోనమెత్తారు.
- బాన్సువాడ, నమస్తే తెలంగాణ

## కాళేశ్వరంతో నిండుగా గోదావరి



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి నది నిండుకుండలా మారిందని చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆదివారం బొక్కలగుట్టలో బోనాల జాతర సందర్భంగా గాంధారి మైసమ్మ ఆలయంలో పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వర ప్రాజెక్టు సీఎం కేసీఆర్ కల అని, ఈ ప్రాజెక్టుతో రైతుల కండ్లల్లో ఆనందం కనిపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ పాల్గొన్నారు.
- రామకృష్ణాపూర్





కామారెడ్డి జిల్లా కేంద్రంలో జలమయమైన రోడ్డు.



పొంగి ప్రవహిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని కొండాపూర్ వాగు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం వీరాపురం - పడిగాపురం మధ్య రాళ్ల వాగులో కొట్టుకుపోయిన రహదారి

# విస్తారంగా వర్షాలు

### ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా..

- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు
- తెగిన రోడ్లు.. పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో పలు జిల్లాల్లో గత మూడు, నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులకు జలకళ సంతరించుకున్నది. కాగా ఆదివారం ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లుతుండటంతో పలుచోట్ల రోడ్లు తెగిపోవడం తో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో నాలుగు ఇండ్లు కూలిపోయాయి. ఇదే జిల్లా మంగపేట మండలంలో అత్యధికంగా 86.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లాలోని పలు ప్రాజెక్టులు, చెరువులకు భారీగా వరద చేరింది. మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. కాగా నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్ అర్బన్ జిల్లాల్లో ముసురు పట్టుకున్నది.

**నిలిచిపోయిన రాకపోకలు..**

ములుగు జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదివానం కురిసిన వర్షానికి తాడ్వాయి మండలంలోని జంపన్నవాగు చెక్‌డ్యాం వద్ద నీరు పొంగి ప్రవహిస్తున్నది. మంగపేట మండలం కొత్తూరు–మొట్లగూడెం బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో రెండు తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు మండలం పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. గుండ్లవాగు ప్రా జెక్టు రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరింది. కన్నాయిగూడెం మండలంలో నాలుగు ఇండ్లు దెబ్బతిన్నది. అత్యధికంగా మంగపేట మండలంలో 86.4మి.మీ., తాడ్వాయి మండలంలో 80.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

**12 అడుగులకు చేరిన చలివాగు ప్రాజెక్టు**

వరంగల్ రూరల్ జిల్లాలో వర్షం నాలుగు రోజులుగా కురుస్తున్నది. ఇప్పుడిప్పుడే చెరువులు, కుంటల్లో నీరు చేరుతున్నది. పాకాల సరస్సు నీటిమట్టం ఈ సీజన్‌లో మొదటిసారిగా ఏడు అడుగులకు చేరింది. చలివాగు ప్రాజెక్టు నీటిమట్టం 12 అడుగులకు చేరుకున్నది. వరంగల్ అర్బన్ జిల్లాలో ముసురు కొనసాగింది. జనగామ జిల్లాలో తేలికపాటి జల్లులు పడ్డాయి.

**ఆదిలాబాద్‌లో భారీగా...**

ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం ఉదయం రెండు గంటలపాటు వర్షం పడగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ముసురుపట్టుకుంది. జిల్లాలో 24.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సిరికొండ మండలంలోని చిక్‌మాన్ ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతున్నది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇల్లెందు మండలం మస్సివాగులోకి భారీగా నీరు చేరింది. కరకగూడెం మండలం వీరాపురం–పడిగాపురం గ్రామాల మధ్య రాళ్లవాగు ఉధృతికి రహదారి కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు వాగు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. మణుగూరు పట్టణంలో వరదనీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. దుమ్ముగూడెం మండల పరిధిలోని గౌరారం వద్ద గుబ్బలమంగి వాగు పొంగి ప్రవహిస్తున్నది. కొత్తగూడెం, పాల్వంచలోని ముర్రేడువాగుల్లోకి వర్షపు నీరు చేరింది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు ఉండగా ఇప్పటికే 387.70 అడుగుల వరకు వరద నీరు చేరింది. ఖమ్మం జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా ఏన్కూరు మండలంలో 37.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తున్నది. ఆదివారం ఉదయం వరకు జిల్లాలో సగటు వర్షపాతం 22.1 మిల్లీ మీటర్లుగా నమోదైంది. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వానతో జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రహదారులు నీట మునిగాయి. సైదాపూర్ మండలం రాయికల్ జెండా గుట్టపై నలభై మీటర్ల ఎత్తు నుంచి వాననీరు ఏకధాటిగా వస్తుండటంతో ఈ ప్రాంతం జలపాతాన్ని తలపిస్తున్నది. మంచిర్యాల జిల్లాలో ఆదివారం వర్షం జోరు వాన కురిసింది. ఉదయం చిరు జల్లులతో మొదలై వాన మంచిర్యాల, లక్షెట్టిపేట, జన్నారం, చెన్నూర్, బీమారం, కోటపల్లి మండలాల్లో భారీగా కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. దండేపల్లి మండలం గూడెంలోని ఒడ్డెరకాలనీలో ఓ ఇంటి పైకప్పు కూలింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, సిర్పూర్–టి , కాగజ్‌నగర్ మండలాల్లో శనివారం నుంచి వర్షం కురుస్తున్నది. జగిత్యాల జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కురిశాయి. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా సరాసరి 14.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎగువన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యంచ వద్ద గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాను ముసురు పట్టుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది.



ములుగు జిల్లా మంగపేట మండలం కొత్తూరు-మొట్లగూడెం బ్రిడ్జి వద్ద తెగిపోయిన అప్రోచ్ రోడ్డు



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుంబూరు వాగు పొంగడంతో చేపలు పడుతున్న స్థానికులు



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మహ్మదాబాద్ బ్రిడ్జి కింద చెక్‌డ్యాంలోకి చేరిన వరద నీరు

## సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లోని క్వారీల్లో వర్షం కారణంగా రోడ్లన్నీ బురదమయం కావడంతో బొగ్గు వెలికితీసే యంత్రాలు నిలిచిపోవడంతో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ 1, ఓపెన్‌కాస్ట్ 2, గౌతంఖని ఓపెన్‌కాస్ట్, మణుగూరులోని ప్రకాశంఖని ఓపెన్ కాస్ట్ 4లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఇల్లందు మండలం కోయగూడెం ఓసీలో మొదటి షిఫ్టు పని నడవలేదు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని కేకే ఓసీలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నది. రోజుకు 60వేల మీటర్ల ఓబీ, 5 వేల టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా, మూడు రోజులకు 180వేల మీటర్ల ఓబీ, 15వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగలేదు.



జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో అదనపు గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

## తెలంగాణలో విద్యారంగానికి స్వర్ణయుగం

- కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు
- మంత్రి కొప్పుల ఈశ్వర్

**జగిత్యాల క్రైం/జగిత్యాల అర్బన్ :** స్వరాష్ట్రంలో చేపడుతున్న విప్లవాత్మక మార్పుల కారణంగా విద్యారంగానికి తెలంగాణ స్వర్ణయుగంలా మారిందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో అదనపు తరగదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన, మైనార్టీల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యనందించేందుకు గురుకులాలు ప్రారంభించామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 200 గురుకులాలు లేవనీ.. ప్రస్తుతం సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 1400 గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. తాజాగా ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా 119 గురుకులాలనుప్రారంభించామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సినారె రచనలు స్ఫూర్తిదాయకం

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో ఘనంగా సినారె జయంత్యుత్సవాలు



సినారె జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. వేదికపై నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎల్లూరు శివారెడ్డి తదితరులు

**వనపర్తి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భవిష్యత్‌తరాలకు డాక్టర్ సీ నారాయణరెడ్డి రచనలు స్ఫూర్తిదాయకమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, సినారె జయంత్యుత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తి పట్టణంలోని నాగవరం పద్మావతి గార్డెన్స్‌లో సినారే జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీఎం కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరు శివారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ఆచార్య ఎస్వీ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. సినారె రచనలు ఎప్పటికప్పుడు నవతరానికి పరిచయం చేస్తూ స్ఫూర్తి కల్పించినప్పుడే సినారెకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. సినీరంగంలో హీరోలకు ఉన్నంత గుర్తింపు సాహిత్యపరంగా సినారెకు ఉన్నదని సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ జయంతి, డాక్టర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న సీతారాంపల్లి గ్రామస్థులు

## ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందాం

- సీఎం కేసీఆర్ పేరు నిలబెడుదాం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** ఐక్యంగా ఉండి గ్రామాలను ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాల్లో ప్రజలతో సమావేశమై సీఎం కేసీఆర్ ప్రకటించిన ప్రత్యేక స్కీమ్‌పై చర్చించారు. జీవనోపాధి పెంచేందుకు సీఎం ఇస్తున్న రూ.10 లక్షలనుసద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. జీవనోపాధి కోసం డైరీ ఫామ్, దేశీ కోళ్లు, వరినాటు యంత్రాలు, వరి కోసే యంత్రాలు లాంటివి తీసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారీకి చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాల నుంచే అంకురార్పణ జరుగనున్నదని చెప్పారు. అనంతరం సిద్దిపేటలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. రూ.3 కోట్లతో కబేళా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



తమతోపాటు చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మంచం పట్టాడని తెలిసి స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం చక్రాపూర్‌కు చెందిన భగవంతు జానంపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 1992-93లో పదోతరగతి చదువుకొన్నాడు. భగవంతుకు ఇటీవల పక్షవాతం రావడంతో మంచం పట్టాడు. విషయం తెలుసుకున్న అతడి పదో తరగతి మిత్రులు ఆదివారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. - మూసాపేట

## 'రాష్ట్రంలో మరో మూడు వ్యవసాయ కళాశాలలు'



ప్రవీణ్‌రావు

**మామిళ్లగూడెం :** వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో మూడు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లాకు వచ్చిన ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. వ్యవసాయ విద్యకు డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ కళాశాలలో 60 సీట్లు పెంచామన్నారు.



నలిమెల భాస్కర్‌కు పురస్కారం ప్రదానం చేసి సత్కరిస్తున్న దేవులపల్లి ప్రభాకర్‌రావు

## దేశాభివృద్ధిలో పీవీ పాత్ర కీలకం

### అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు

**కరీంనగర్ కల్చరల్:** మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేసి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో పీవీ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో 2019కి పీవీ స్మారక సాహిత్య విశిష్ట పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం కల్వకోట వెంకటసంతోష్‌బాబు అనువదించిన 'పీవీ చెప్పిన ముచ్చట్లు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులు మృతి

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాలో ఆదివారం భద్రతాదళాలు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. దంతేవాడ ఎస్పీ అభిషేక్ పల్లవ్ వివరాల ప్రకారం.. దంతేవాడ జిల్లా కటే కల్యాణ్ పీఎస్ పరిధిలోని మర్జూమ్ అటవీప్రాంతంలో డీఆర్జీ, భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపారు. ఈక్రమలో మావోయిస్టులు పక్కనే ఉన్న దట్టమైన అటవీలోకి పారిపోయారు. కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు స్థానికుల ద్వారా సమాచారం అందిందని.. ఇంతవరకు మృతదేహాలు దొరుకలేదని ఎస్పీ తెలిపారు.

## వీఆర్‌ఏపై 'టిక్‌టాక్' వేటు


**మహబూబాబాద్ రూరల్ :** తాసిల్ కార్యాలయంలో విధులు నిర్వహించకుండా టిక్‌టాక్ వీడియోలు చేసిన వీఆర్‌ఏను తాసిల్దార్ సస్పెండ్ చేశారు. మహబూబాబాద్ మండలం జంగిలికొండ వీఆర్‌ఏ గుర్రాల విద్యాసాగర్ శనివారం విధులు నిర్వహించకుండా సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ టిక్‌టాక్ వీడియో తీసి పోస్ట్ చేశాడు. అది వైరల్‌గా మారడంతో సస్పెండ్ చేసినట్టు తహసీల్దార్ రంజిత్ కుమార్ తెలిపారు.



యాదాద్రి లక్ష్మీనర్సింహునికి ఆదివారం లక్ష పుష్పార్చన కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం దేవేరులను ముస్తాబు చేసి గజవాహనంపై ముఖ మండపంలో ఊరేగించారు. సెలవు రోజు కావడంతో గుట్టకు భక్తులు భారీగా తరలివచ్చారనీ, రూ. 9,86,742 ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ

## నల్లమలలో ట్రైనీ గ్రూప్-1 అధికారుల పర్యటన

**అమ్రాబాద్ రూరల్:** నల్లమల అటవీ ప్రాంతంలో 2017–18 ట్రైనీ గ్రూప్–1 అధికారులు పర్యటించారు. రెండురోజుల క్షేత్ర పర్యటనకు వచ్చిన 53 మంది రెండు గ్రూపులుగా విడిపోయి నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కృష్ణానది పరీవాహక ప్రాంతంతోపాటు, సలేశ్వరాన్ని సందర్శించారు. అమ్రాబాద్ రిజర్వు టైగర్ అటవీప్రాంతంలో పర్యటించిన వీరు అడవుల పరిరక్షణ, ప్రాముఖ్యత తదితర వివరాలు తెలుసుకొన్నారు.



ఆదివారం శంషాబాద్ మండలంలోని ముచ్చింతలలో చినజీయర్‌స్వామితో శ్రీనివాస్ కులకర్ణి

# అమెరికా ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ పోటీ

- కేటీఆర్‌తో భేటీ.. ప్రవాసభారతీయుల మద్దతుకు హైదరాబాద్‌లో ప్రచారం
- జీయర్‌స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న శ్రీనివాస్ కులకర్ణి

**హైదరాబాద్ ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు చెందిన ఎన్నారై అమెరికాలోని టెక్సాస్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి దిగువసభ సభ్యుడిగా డెమోక్రాటిక్ పార్టీ తరపున పోటీచేస్తుండటం ఆసక్తికరంగా మారింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్ వెంకటేశ్ కులకర్ణి కుమారుడైన శ్రీనివాస్ కులకర్ణి హైదరాబాద్‌లో ఎన్నారై కుటుంబసభ్యులను కలిసి మద్దతునివ్వాలని కోరారు. ఆయన ముంబై, బెంగళూరు, చెన్నై, తిరుపతి నగరాల్లో ప్రచారం చేస్తూ, హైదరాబాద్ నగరానికి వచ్చి శుక్రవారంనుంచి మూడ్రోజులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన శంషాబాద్ మండలం ముచ్చింతలలో చినజీయర్‌స్వామిని కలిసి ఆశీర్వాదాలు పొందారు. టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారకరామారావును కలిసి పోటీచేస్తున్న విషయం తెలిపారు. విద్యానగర్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో అమెరికాలో నివాసముంటున్నవారి సంబంధీకులను కలుసుకుని మద్దతునివ్వాలని కోరారు. అమెరికాలో ప్రవాస భారతీయుల హక్కుల పరిరక్షణకు పోటీచేస్తున్నానని ఆయన చెప్పారు. హైదరాబాద్ నుంచి వెళ్లిన వెంకటేశ్ కులకర్ణి అమెరికాలోని లూసియానాలో స్థిరపడగా, 1978లో శ్రీనివాస్ కులకర్ణి జన్మించారు. ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. గతంలోనూ దిగువసభకు పోటీచేసి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి చేతిలో స్వల్పతేడాతో ఓడిపోయారు. తాను గెలిచి దిగువసభలో భారత వాణిని వినిపిస్తానని వెల్లడించారు.



హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్ కులకర్ణి. చిత్రంలో హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ క్యాథరిన్ హడ్డా ఉన్నారు



# జైపాల్‌రెడ్డి కన్నుమూత



### రాజకీయ ప్రస్థానం..

- ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘ నాయకుడిగా రెండుసార్లు ఎన్నిక
- 1965–71 యూత్ కాంగ్రెస్ జాతీయ కమిటీ సభ్యుడు
- 1971 ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి
- 1969 నుంచి వరుసగా నాలుగుసార్లు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక
- 1977లో ఎమర్జెన్సీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా, 1979లో జనతాపార్టీలో చేరిక
- 1985–89 వరకు జనతాపార్టీ ప్రధాన కార్యదర్శి
- 1980లో మెదక్ లోక్‌సభ స్థానంలో ఇందిరాగాంధీపై పోటీచేసి ఓటమి
- 1984, 98లో మహబూబ్‌నగర్ నుంచి లోక్‌సభకు ఎన్నిక
- 1999లో కాంగ్రెస్‌లో తిరిగి చేరిక
- 1999, 2004లో మిర్యాలగూడ నుంచి లోక్‌సభకు ఎన్నిక
- 2009లో చేవెళ్ల నుంచి లోక్‌సభకు ఎన్నిక
- 1990, 1996 లో రాజ్యసభకు ఎన్నిక

కీలక పదవులు

- ఐకే గుజ్రాల్ క్యాబినెట్‌లో సమాచార ప్రసారశాఖ మంత్రి
- 1998 ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం
- 1999–2000 సభాహక్కుల ఉల్లంఘన కమిటీ చైర్మన్
- 2004.. మన్మోహన్‌సింగ్ క్యాబినెట్‌లో పెట్రోలియం, పట్టణాభివృద్ధి, సాంస్కృతిక శాఖ మంత్రి
- ఢిల్లీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో కీలకపాత్ర
- ప్రసార భారతి బిల్లును ప్రవేశపెట్టడం, అమలులో ప్రధానపాత్ర
- ఎఫ్‌ఎం రేడియో ఛానెళ్లను విస్తృతీకరణకు కృషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశ రాజకీయ యవనికపై తనదైన ముద్రను చిరస్థాయిగా వేసిన రాజకీయ దురంధరుడు.. తన అపార మేధస్సుతో, బహుభాషా పాం డిత్యంతో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకుడు.. పార్టీలకు అతీతంగా అందరితోనూ మన్ననలు అందుకొన్న నే త.. శారీరక వైకల్యాన్ని అధిగమించి.. మానసిక చైతన్యంతో జాతీయ రాజకీయాల్లో రాణించిన రాజనీతిజ్ఞుడు, సాహిత్యాన్ని, తత్వశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేసి.. వాటి పునాదులమీద రాజకీయ వాదాన్ని నిర్మించుకొన్న సీనియర్ రాజకీయ నాయకుడు సూదిని జైపాల్‌రెడ్డి (77) కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈనెల 20న గచ్చిబౌలి లోని ఏషియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ దవాఖానలో చేరారు. జ్వరానికి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. జైపాల్‌రెడ్డి భౌతికదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆయన మరణ వార్తతో దేశవ్యాప్తంగా విషాదం నెలకొన్నది. కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక.. జైపాల్‌రెడ్డి మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పలు రాష్ట్రాలలోని కాంగ్రెస్ నేతలు ఆయనతో సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకొన్నారు. జాతీయ స్థాయిలో పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు.. ఇతర నేతలు జైపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ నరసింహన్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు , రాజకీయ నాయకులు జైపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు.



ఆదివారం జూబ్లీహిల్స్‌లోని జైపాల్‌రెడ్డి నివాసంలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు



జైపాల్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ నరసింహన్, టీఆర్‌ఎస్ నేత గుత్తా సుఖేందర్‌రెడ్డి

## నివాళులు అర్పించిన సీఎం కేసీఆర్

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మృతికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్‌లోని జైపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు. జైపాల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించిన వారిలో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

సీనియర్ రాజకీయనేత జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు సోమవారం అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో పీవీ ఘాట్ సమీపంలో జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు సన్నాహాలుచేస్తున్నారు. సోమవారం ఉదయం జైపాల్‌రెడ్డి పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్‌కు తరలిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం గాంధీభవన్‌లో ఉంచుతారు. అనంతరం జైపాల్‌రెడ్డి అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. జైపాల్‌రెడ్డి మరణంతో ఆయన స్వగ్రామం కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## వ్యవసాయ కుటుంబం నుంచి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గుల గ్రామంలో 1942 జనవరి 16న దుర్గారెడ్డి, యశోదమ్మకు జన్మించిన జైపాల్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుట్టిన 18 మాసాలకే పోలియో కారణంగా ఆయనకు అంగవైకల్యం సంక్రమించింది. ఆయనలోని శారీరక వైకల్యం జాతీయస్థాయిలో రాజకీయ ఎదుగుదలకు అవరోధం కాలేకపోయింది. ప్రాథమిక విద్యను స్థానికంగా మాడ్గుల, నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో పూర్తిచేసి, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లిష్‌లో పట్టభద్రులయ్యారు. విద్యార్థి దశనుంచే రాజకీయాలపై అమితాసక్తి కలిగిన జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇందిరా



గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన నాయకుల్లో జైపాల్‌రెడ్డి ఒకరు. అనంతర పరిణామాల్లో జనతాపార్టీలో చేరి 1980లో మెదక్ లోక్‌సభ స్థానంనుంచి ఇందిరాగాంధీపై పోటీచేసి ఓడిపోయారు. జైపాల్‌రెడ్డి ఐదుసార్లు ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఐకే గుజ్రాల్ క్యాబినెట్‌లో సమాచార ప్రసారశాఖ మంత్రిగా పనిచేసిన జైపాల్‌రెడ్డి ప్రసారభారతి బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత మన్మోహన్ క్యాబినెట్‌లోనూ కీలకశాఖలను నిర్వహించారు. అధ్యయనం, అవగాహన, వాక్పటిమ జైపాల్‌రెడ్డిని దేశరాజకీయాల్లో విశిష్టమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. అరిస్టాటిల్ దగ్గరి నుంచి కార్ల్‌మార్క్స్ దాకా అనర్గళంగా మాట్లాడటంలో జైపాల్‌రెడ్డి దిట్ట. ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాన్ని అందుకొన్న దక్షిణాది తొలి ఎంపీ ఆయనే. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి కాంగ్రెస్‌లో కీలకనేతగా ఎదిగారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన ఆయన.. నెహ్రూగాంధీ కుటుంబానికి సన్నిహితుడు.

## ప్రముఖుల సంతాపం

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచిన నా మిత్రుడు, సహచరుడు జై పాల్‌రెడ్డి మరణం తీవ్రం గా కలచివేసింది. ఆయన రాజకీయ జీవితం అందరికీ ఆదర్శనీయం. జైపాల్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.
**- వెంకయ్యనాయుడు, ఉప రాష్ట్రపతి**



గొప్ప రాజకీయవేత్తగా, ప్రజాప్రతినిధిగా పేరు పొందిన జైపాల్‌రెడ్డి ఆకస్మిక మృతి దిగ్భ్రాంతిని కలిగించింది. ప్రజాప్రతినిధిగా వివిధ హోదాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచిన జైపాల్‌రెడ్డి దేశానికి అందించిన సేవలు మరువలేనివి.
**- నరేంద్రమోదీ, ప్రధాని**



జైపాల్‌రెడ్డి మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయనొక జ్ఞాన ఖని. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఎన్నో ఏండ్లపాటు ప్రజాసేవ చేశారు.
**- మన్మోహన్‌సింగ్, మాజీ ప్రధాని**



అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. జైపాల్‌రెడ్డి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. దేశాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివి. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారు. తెలంగాణ ప్రజలు ఆయన్ను ఎప్పటికీ మరువలేరు.
**- కిషన్‌రెడ్డి, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి**



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన జైపాల్‌రెడ్డి.. పార్లమెంటరీ సంప్రదాయాలకు విలువ ఇచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేస్తున్నా. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.
**-సోనియా గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్**

జైపాల్‌రెడ్డి మరణం బాధాకరం. ఆయనొక గొప్ప పార్లమెంటేరియన్. తెలంగాణ ముద్దు బిడ్డ అయిన జైపాల్‌రెడ్డి తన మొత్తం జీవితాన్ని ప్రజాసేవకే అంకితంచేశారు.ఆయన కుటుంబానికి, స్నేహితులకు సానుభూతి తెలియజేస్తున్నా.
**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత**

జైపాల్‌రెడ్డి ఉన్నత వ్యక్తిత్వం కలిగినవారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నా.
**- ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ నేత**


రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న జైపాల్‌రెడ్డి గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన మరణంతో తెలంగాణ రాష్ట్రం ఎంతో గొప్ప ప్రజాసేవకుడిని కోల్పోయింది.
**- విద్యాసాగర్‌రావు, మహారాష్ట్ర గవర్నర్**



జైపాల్‌రెడ్డి రాజకీయ జీవితం అందరికీ ఆదర్శనీయం. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.
**- కే తారకరామారావు, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**



జైపాల్‌రెడ్డి మరణం విషాదకరం. పెద్ద నాయకుడిని కోల్పోయాం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.
**- కల్వకుంట్ల కవిత, మాజీ ఎంపీ**



ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు ఎనలేనివి. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.
**-టీ హరీశ్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే**



అభ్యుదయ, లౌకిక భావాలు కలిగిన జైపాల్‌రెడ్డి మరణం క్రియాశీల రాజకీయాలకు తీరనిలోటు.
**- బీ వినోద్‌కుమార్, మాజీ ఎంపీ**

బహుభాషా కోవిదుడైన జైపాల్‌రెడ్డి మరణం ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమాలకు తీరనిలోటు. మచ్చలేని వ్యక్తిగా ఆయన రాజకీయాలకే అర్థం చెప్పారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా ఎనలేని సేవలందించిన జైపాల్‌రెడ్డి మరణంతో దేశం నిస్వార్థ రాజకీయ నేతను కోల్పోయింది.
**- డీ రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి**

జైపాల్‌రెడ్డి మరణం దిగ్భ్రాంతి కలిగించింది. కాంగ్రెస్ పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోయింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. **-డీఎంకే చీఫ్, స్టాలిన్**

జైపాల్‌రెడ్డి గొప్ప సామాజిక కార్యకర్త. ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన మృతి దిగ్భ్రాంతిని కలిగించింది.
**- నితీశ్‌కుమార్, బీహార్ సీఎం**

జాతీయ రాజకీయాల్లో గొప్ప నాయకుడిని కోల్పోయాం. ఇది చాలా విషాదకరమైన రోజు. గురుతుల్యులైన జైపాల్‌రెడ్డితో నాకు మంచి అనుబంధం ఉన్నది. పార్టీలకన్నా వ్యక్తిగత విలువలకు ఆయన అధిక ప్రాధాన్యమిచ్చేవారు.
**- రమేశ్‌కుమార్, కర్ణాటక స్పీకర్**

జైపాల్‌రెడ్డి రాజకీయ జీవితం సుదీర్ఘమైనది. ఆయన మృతి తీరనిలోటు. ఎంతో నిజాయతీపరుడైన ఆయనతో నాకు నాలుగు దశాబ్దాల నుంచి మంచి పరిచయం ఉన్నది.
**- సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి**

## కాంగ్రెస్‌లో నాయకత్వలేమి బాధిస్తున్నది

**పార్టీలో అన్ని స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించాలి: శశిథరూర్**

**న్యూఢిల్లీ, జూలై 28:** కాంగ్రెస్‌ను ముందుండి నడిపించే నాయకుడు లేకపోవడంతో కార్యకర్తలు, సానుభూతిపరులు ఆందోళన చెందుతున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్‌గాంధీ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం శశిథరూర్ పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ 'ముందుండి నడిపించే నాయకుడు లేక కార్యకర్తలు, సానుభూతిపరులు అసంతృప్తిలో ఉన్నారు. కీలక నిర్ణయాలు తీసుకోవడంలో, మార్గనిర్దేశం చేయడంలో నాయకత్వ లేమి కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా వేధిస్తున్నది' అని చెప్పారు. పార్టీ నాయకత్వ బాధ్యతలను యువనాయకుడికి అప్పగించాలన్న పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లు తెలిపారు. 'పార్టీలో అన్ని స్థాయిల్లో ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుంది. తద్వారా కార్యకర్తలు తమను ముందుండి నడిపించే నాయకుడిని ఎన్నుకుంటారు. అప్పుడు పార్టీ సంక్షోభం నుంచి బయటపడే అవకాశముంది' అని శశిథరూర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహిస్తే ప్రియాంకాగాంధీ పోటీ చేసే అవకాశముందని, అయితే ఆమె పోటీ చేయాలా? వద్దా? అన్న విషయాన్ని గాంధీ కుటుంబం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎలాంటి పద్ధతిని అవలంబిస్తున్నదో.. కాంగ్రెస్ కూడా అలాంటి పద్ధతిని అవలంబిస్తే బాగుంటుందని, తద్వారా పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందని పేర్కొన్నారు.

## 200 కోట్ల అక్రమాస్తులు వెలుగులోకి..

**విదేశాల్లో రహస్యంగా దాచిన హర్యానా కాంగ్రెస్ నేత**

న్యూఢిల్లీ, జూలై 28: హర్యానా కాంగ్రెస్ నాయకుడు కుల్దీప్ బిష్ణోయ్, ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో ఇటీవల నిర్వహించిన సోదాల్లో.. విదేశాల్లో రహస్యంగా దాచుకున్న రూ. 200 కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డట్టు ఇన్‌కం టాక్స్ అధికారులు ఆదివారం తెలిపారు. 'ఇప్పటి వరకూ బయటపెట్టని స్థిరాస్తులకు సంబంధించిన లావాదేవీల ఆధారాల్ని కనిపెట్టాం' అని ఐటీ అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్దీప్ నివాసం, ఆయనకు చెందిన కార్యాలయాలు.. ఇలా 13 ప్రాంతాల్లో ఈనెల 23న ఐటీ అధికారులు దాడులు చేసి సోదాలు నిర్వహించడం తెలిసిందే.

## ముఖేశ్ గౌడ్ పరిస్థితి విషమం

మొదటిపేజీ తరువాయి...

వాస్తవమేనని ముఖేశ్‌గౌడ్ కుమారుడు విక్రమ్ తెలిపారు. ఆయనకు అపోలో హాస్పిటల్ ఐసీయూలో చికిత్స జరుగుతున్నదని పేర్కొన్నారు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి తామే వివరాలు వెల్లడిస్తామని, వదంతులను ప్రచారం చేయవద్దని మీడియాను కోరారు.

# పేదలకు వైద్యం మరింత విస్తృతం

- కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా సర్కారు దవాఖానలు
- 2024 లక్ష్యంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రణాళికలు
- పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ధ్యేయం
- ఇప్పటికే 20 ఐసీయూల ఏర్పాటు.. వైద్య కళాశాలల్లోనూ పటిష్ఠం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా.. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా సర్కారు దవాఖానాల్లో అధునాతన సౌకర్యాలు కల్పించి వైద్య సేవలను విస్తృతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. అందులో భాగంగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) ద్వారా వైద్యసేవలను విస్తృతం చేసేందుకు 2024 లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి టీవీవీపీ పరిధిలోని దవాఖానాల ద్వారా మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు. టీవీవీపీ పరిధిలోని జిల్లా, ప్రాంతీయ దవాఖానలు, సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో



మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. జాతీయ ఆరోగ్యమిషన్ సూచనల మేరకు వాటిలో ఉండాల్సిన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ దవాఖానల్లో ఎంఆర్‌ఐ, సీటీస్కాన్, డిజిటల్ రేడియాలజీ, 2డీ ఎకో, అల్ట్రాసౌండ్, ఆటోఅనలైజర్ వంటి అత్యాధునిక పరికరాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. టీవీవీపీ పరిధిలో 9 బ్లడ్‌బ్యాంకులు ఉండగా కొత్తగా 13 ఏర్పాటుచేశారు. 31 రక్త నిల్వ కేంద్రాలను, 34 డయాలిసిస్ కేంద్రాలను టీవీవీపీ పరిధిలో నిర్వహిస్తున్నారు.

### 2024 లక్ష్యంగా వైద్యసేవల విస్తరణ

తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీ, ఏహెచ్, డీహెచ్‌ల ద్వారా వైద్యసేవలను మెరుగుపర్చేందుకు వైద్యశాఖ ప్రణాళికలను రూపొందించింది. 2024 నాటికి సేవల విస్తరణకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ్తున్నారు. ఏటా మంచాల సంఖ్యను పెంచడమే కాకుండా ఔట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సేవలు విస్తృతం చేయనున్నారు.

### 20 ఐసీయూల ఏర్పాటు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. ఇందుకు ఆయా ప్రాంత అవసరాలను బట్టి 20 ఐసీయూలను (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఏర్పాటుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా కూడా ఎమర్జెన్సీ వ్యాధిగ్రస్థుల గురించి ప్రత్యేకమైన ఐసీయూ సేవలు అందుబాటులో లేకపోవడంతో పేదప్రజలు ఖరీదైన ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నాగర్‌కర్నూల్, నారాయణపేట, మెదక్, జహీరాబాద్, ఏటూరునాగారం, మంచిర్యాల, నిర్మల్, కామారెడ్డి, సిరిసిల్ల, సంగారెడ్డి, మహబూబాబాద్, ఉట్నూరు, ఖమ్మం, భద్రాచలం, నల్లగొండ, సూర్యాపేట, గద్వాల, కరీంనగర్, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లలోని టీవీవీపీ దవాఖానల్లో ఐసీయూలను నిర్వహిస్తున్నారు. వీటితోపాటు వైద్య కళాశాలల్లోనూ ఐసీయూలను బలోపేతం చేశారు.

**టీవీవీపీ రూపొందించిన వైద్యసేవల విస్తరణ లక్ష్యాలు**

| సేవల విభాగం | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|---|---|---|---|
| ఔట్ పేషెంట్లు | 1,55,96,446 | 1,87,15,735 | 2,05,87,309 | 2,26,46,040 | 2,49,10,644 | 2,74,01,708 | 3,01,41,879 | 3,31,56,067 |
| ఇన్‌పేషెంట్లు | 13,17,863 | 15,81,436 | 17,39,579 | 19,13,537 | 21,04,891 | 23,15,380 | 25,46,918 | 28,01,610 |
| మేజర్‌సర్జరీలు | 76,950 | 92,340 | 1,01,574 | 1,11,731 | 1,22,905 | 1,35,195 | 1,48,714 | 1,63,586 |
| స్టెరిలైజేషన్స్ | 29,842 | 32,826 | 36,109 | 39,720 | 43,692 | 48,061 | 52,867 | 58,154 |
| ప్రసవాలు | 1,00,473 | 1,62,000 | 1,70,100 | 1,78,605 | 1,87,535 | 1,96,912 | 2,06,758 | 2,17,095 |

# దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి

- రాష్ట్రంలో లేని కులాల కోసం ఉద్యమాలా? : మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

**మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** జనాభా దమాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కోరారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మాదిగ జేఏసీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యమాలు చేస్తూ కొందరు నాయకులు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. తెలంగాణలో 15 శాతం రిజర్వేషన్లలో 12 శాతం రిజర్వేషన్ల కోసం మాదిగలు పోరాడాలన్నారు. గత 20 ఏండ్లుగా మాదిగ ఉద్యమ నాయకులు కాంగ్రెస్, బీజేపీలకు మద్దతిచ్చినప్పటికీ ఆ పార్టీలు పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా మోసం చేశాయన్నారు. మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొలికొండ వీరేందర్, రాష్ట్ర కన్వీనర్ కడారి ధీరన్, జిల్లా అధ్యక్షుడు మంగళంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## పేరు మార్చి పరేషాన్!

- భూరికార్డుల ప్రక్షాళనలో మారిన యజమాని పేరు
- పహాణీలో పేరున్నా పాస్‌బుక్ ఇచ్చేందుకు నిరాకరణ
- రెండేండ్లుగా తిరుగుతున్న సిద్దిపేట జిల్లావాసి మీర్ తకిరజా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు మీర్ తకిరజా.. తండ్రి పేరు మీర్ మహ్మద్. మాది సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడ. గ్రామంలోని సర్వే నంబర్లు 181/కలో 1.25 ఎకరాలు, 361/అ/1లో 2.15 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి 50 ఏండ్లుగా వారసత్వంగా వస్తున్నది. పాత పహాణీలోనూ నా పేరే నమోదై ఉన్నది. 2017 వరకు రికార్డుల్లో నాపేరే ఉన్నా. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం రికార్డుల్లోంచి నా పేరును తొలగించి వేరే వ్యక్తుల పేర్లు పహాణీల్లో ఎక్కించారు. రికార్డులో పేరు మారిందని గుర్తించిన తర్వాత సమస్య పరిష్కరించాలని ఎన్నోసార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడం లేదు. సమస్య పరిష్కరించాలని మొరపెట్టుకుంటే రేపు మాపంటూ తిప్పుకొంటూ.. పరేషాన్ చేస్తున్నరు. ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న. రెవెన్యూ కార్యాలయాలం చుట్టూ తిరుగాలంటే ఇబ్బందిగా ఉన్నది. హైదరాబాద్‌లో ఉంటానని తెలిసి కూడా అధికారులు సమస్యను పరిష్కరించకుండా తిప్పుకోవడం అన్యాయం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి, కొత్త పాస్‌పుస్తకం మంజూరు చేయాలి.

### దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరిస్తాం

నేను రిమ్మనగూడకు వీఆర్వోగా వచ్చి మూడు నెలలే అవుతున్నది. దరఖాస్తు చేసుకుంటే పాస్‌బుక్ ఇస్తున్నాం. సిస్టంలో చూసేవరకు సమస్య ఏందనేది అర్థం కాదు. దరఖాస్తు చేసుకుంటే రికార్డులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

- నరసింహులు, రిమ్మనగూడ వీఆర్వో

## రికార్డుల్లో 47 గుంటలు మాయం

- 'ధర్మగంట'ను ఆశ్రయించిన వరంగల్ బాధితుడు రాజయ్య

**కరీమాబాద్:** వరంగల్‌లోని రంగశాయిపేటకు చెందిన రైతు అవునూరి రాజయ్య కాజీపేట మండలం అమ్మవారిపేటలోని సర్వే నంబర్లు 227/జీలో 18 గుంటలు, 228/సీ/1లో 24 గుంటలు, 228/ఎఫ్1లో 23 గుంటల భూమిని కొని ముప్పై ఏండ్లుగా సాగుచేసుకొంటున్నారు. ఈ భూమిపై వ్యవసాయ రుణం కూడా తీసుకొన్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో సర్వే నంబర్ 227/ జీలోని 18 గుంటల భూమి మాత్రమే కొత్త పాస్‌పుస్తకంలో నమోదైంది. సర్వే నంబర్లు 228/సీ/1లోని 24 గుంటలు, 228/ఎఫ్1లోని 23 గుంటల భూమి రికార్డుల్లో లేదు. తన భూమిని రికార్డుల్లో చేర్చాలంటూ బాధితుడు ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులను వేడుకొన్నా పట్టించుకోలేదు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ రాజయ్య 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



పాస్‌బుక్ చూపుతున్న రాజయ్య దంపతులు

## విరాసత్ చెయ్యండి సారూ..



భూక్య రంగమ్మ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నా పేరు భూక్య రంగమ్మ అలియాస్ ఫాతిమాబేగం. మాది జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని బొంతగట్టు నాగారం. మా తండ్రి భూక్య సామ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్లు 192, 193, 181/డీ, 91, 181, 191/ఏ, 191బీసీ, 194/సీడీలలో ఉన్న 15.34 ఎకరాల భూమిని పెద్ద కుమార్తెనైన నాకు చెందేలా వీలునామా రాశారు. భూమి ఇతరుల కబ్జాలో ఉన్నది. తప్పుడు మార్గాన పట్టాలు పొందారు. ఈ విషయాన్ని గతంలో తాసిల్దార్ సలీం దృష్టికి తీసుకెళ్లగా, విషయం కోర్టు పరిధిలో ఉన్నదని దాటవేయగా, ప్రస్తుతం కోర్టు ఉత్తర్వులు అనుకూలంగా వచ్చినా తాసిల్దార్ పట్టించుకోవడం లేదు. గత తాసిల్దార్ అవతలివారికి మద్దతు తెలిపారు. ప్రస్తుత తాసిల్దార్ కూడా వారివైపే ఉన్నారు. ఎన్నిసార్లు వెళ్లినా కుంటిసాకులు చెప్తున్నారు. భూమి వద్దకు వెళ్లి సర్వే చేయాలని చెప్పినా పట్టించుకోవడంలేదు. రూ.30 వేలు ఇచ్చినా అధికారులు పనిచేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి విరాసత్‌చేయాలి.

### మోఖా, పట్టా ఇతరుల పేరిట ఉన్నది


భూ వివాదం ఉన్నది వాస్తవమే. తాసిల్ కార్యాలయానికి రంగమ్మతోపాటు ఇతరులు కూడా వస్తున్నారు. ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి విచారణకు వెళ్లాం. పట్టా, మోఖాలో ఉన్నవారు గొడవకు దిగుతున్నారు. చాలా ఏండ్లుగా రంగమ్మ భూమిలోకే వెళ్లలేదు. కోర్టు ఉత్తర్వులను గౌరవించి మళ్లీ విచారణకు వెళ్లాం. గతంలో తాసిల్దార్ ఆదేశాల మేరకు నడుచుకున్నాం.

- రమేశ్, బొంతగట్టు నాగారం వీఆర్వో

## తప్పులు చేశాం..

# తమ్మీకు చావండి!

**చీలికలు పేలికలుగా భూ మార్పిడి.. ఒక సర్వే నంబర్‌కు అనేక బై నంబర్లు.. ఎవరిది ఎంత మార్చారో తెలియని స్థితి**



భూమి పత్రాలు చూపుతున్న బాధితుడు రవిగౌడ్

- వాస్తవ భూమికంటే రికార్డుల్లో అధికం
- న్యాయం కోసం హక్కుదారుల పోరాటం
- దరఖాస్తులకు స్పందించని అధికారులు
- గతంలో జరిగిన తప్పులకు మేం ఏం చేయగలమంటున్న తాసిల్దార్
- మహబూబ్‌నగర్ జిల్లా వేములలో రెవెన్యూ అధికారుల అలసత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వేముల గ్రామంలోని సర్వే నంబర్ 309లో మాలె నాగమ్మకు 2.20 ఎకరాల భూమి ఉన్నది. ఆమె వియ్యపురాలు మాలె సత్తమ్మకు మూడెకరాల భూమి ఉన్నది. నాగమ్మ కుమార్తె లక్ష్మమ్మ, సత్తమ్మ కుమారుడు నారాయణకు ఇచ్చి పెండ్లిచేశారు. నాగమ్మ, సత్తమ్మ మరణానంతరం వాళ్లిద్దరికీ చెందిన మొత్తం 5.20 ఎకరాల భూమిని లక్ష్మమ్మ, నారాయణ దంపతులు సాగుచేస్తూ వచ్చారు. 2006లో నారాయణ చనిపోయిన అనంతరం.. భార్య లక్ష్మమ్మ ఆ భూమిని సాగుచేస్తూవస్తున్నారు. ఆ భూమి లక్ష్మమ్మకు చెందినదేనని అందరికీ తెలుసు. వాళ్లే కాస్తులో ఉన్నారు. కానీ, లక్ష్మమ్మకు, ఆమె కుటుంబసభ్యులకు తెలియకుండానే రికార్డుల్లో భూమి హక్కుదారులు మారిపోయారు. రెవెన్యూ అధికారులు సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి ఇష్టారాజ్యంగా పేర్లు బదలాయించారు. రికార్డుల్లో పేర్లు మార్చేముందు కనీసం క్షేత్రస్థాయి విచారణ చేపట్టలేదు. అసలైన హక్కుదారులకు నోటీసులు ఇవ్వలేదు. పేరు మార్పిడికి ఎలాంటి ప్రాతిపదిక లేకుండానే రికార్డుల్లో ఆటాడుకొన్నారు. ఎంత అడ్డగోలుగా వ్యవహరించారంటే.. దశాబ్దాల కిందటి రికార్డులను కూడా మార్చేశారు. 2012లో అప్పటి తాసిల్దార్ పాండునాయక్, గిర్దావర్ రాధాకృష్ణ, వీఆర్వో మల్లేశ్ (ఇప్పుడు ఆర్‌ఐగా పనిచేస్తున్నారు) కుమ్మక్కై రికార్డులన్నీ సమూలంగా మార్చేశారని లక్ష్మమ్మ కొడుకు రవిగౌడ్ ఆరోపిస్తున్నారు.

**భూమంతా చిందరవందర..**

వేముల గ్రామంలోని సర్వే నంబర్ 309లో 5.20 ఎకరాలలో సత్తమ్మ పేరిట ఉన్న మూడెకరాలు, నాగమ్మకు చెందిన 2.20 ఎకరాలు పూర్తిగా వారి వారసులకు దక్కాలి. కానీ ఇప్పుడున్న రికార్డులను పరిశీలిస్తే 309 సర్వే నంబర్‌కు బై నంబర్లు పుట్టుకొచ్చాయి. భూమి అంతా చిందరవందర అయింది. అసలైన సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉన్నది? కృత్రిమంగా పుట్టుకొచ్చిన బై నంబర్లలో ఎంత భూమి ఉన్నదో స్పష్టత లేనంతగా రికార్డులను అడ్డగోలుగా మార్చేశారు. ఒక్కో బై నంబర్‌లో తమకు తోచినంత భూమిని రాసేసి చిత్తం వచ్చినట్టు పేర్లు మార్చారు. అంతకుముందు 309 సర్వే నంబర్‌లో 5.20 ఎకరాలకు హక్కుదారుగా ఉన్న మాలె లక్ష్మమ్మ (సత్తమ్మ కోడలు, నాగమ్మ కుమార్తె) పేరిట 309/76 అనే సర్వే నంబర్ సృష్టించి 1.04 ఎకరాలు మాత్రం రాశారు. 309/77 అంటూ మరో బై నంబర్ పుట్టించి 1.04 ఎకరాల భూమిని మాలె లింగమయ్య (రాఘవులు) పేరిట బదలాయించారు. 309/80/1 అన్న సర్వే నంబర్‌తో 2.20 ఎకరాలకు కూడా లింగమయ్య పేరుతో రాసేశారు. ఎలాంటి బై నంబర్లు లేకుండా 309 సర్వే నంబర్‌లో 1.10 ఎకరాలను లక్ష్మమ్మ కొడుకులు రవిగౌడ్, సురేందర్, కుమార్తె సంతోష పేరిట మార్చారు. చివరకు లక్ష్మమ్మ కుటుంబానికి దక్కింది ఆమె పేరిట ఉన్న 1.04 ఎకరాలు, సంతానం పేరిట ఉన్న 1.10 ఎకరాలు.. మొత్తం 2.14 ఎకరాలు వీరికి మిగిలింది. మిగతా 3.06 ఎకరాలను అధికారులు హాంఫట్ చేశారు. గమ్మత్తేమిటంటే అధికారులు లింగమయ్య పేరిట బదలాయించిన భూమి రికార్డుల ప్రకారం 3.24 ఎకరాలుగా ఉన్నది. 309 సర్వే నంబర్‌లో క్షేత్రస్థాయిలో ఉన్న మొత్తం భూమే 5.20 ఎకరాలు. కానీ రెవెన్యూ అధికారులు బై నంబర్లతో లక్ష్మమ్మ కుటుంబానికి, లింగమయ్య పేరిట రాసిన భూమిని లెక్కేస్తే మొత్తంగా 6.30 ఎకరాలున్నట్టు తాజా రికార్డులు చెప్తున్నాయి. ఉన్న భూమే 5.20 ఎకరాలైనప్పుడు మిగతా 1.10 ఎకరాలు ఎక్కడి నుంచి పుట్టుకొచ్చిందో అధికారులకే తెలియాలి. పైగా ఇందుకోసం పాత రికార్డులన్నింటినీ మార్చేశారు. 1987-88 నుంచే రికార్డుల్లో పేర్లు మారిపోయాయి. 1989 నుంచి లింగమయ్య పేరిట కొంత భూమి చేరింది.

**రికార్డులు ఎలా మారాయి?**

309 సర్వే నంబర్‌కు సంబంధించిన భూరికార్డులను మార్చి.. లింగమయ్య పేరిట భూమిని మార్చినప్పుడు.. అది ఏ ప్రాతిపదికన, ఏ ఆధారాలతో చేశారో ఎక్కడా నమోదు చేయలేదు. లక్ష్మమ్మ కానీ, ఆయన కుటుంబం కానీ భూమిని అమ్మారా? ఏ కారణం చేత భూ మార్పిడి జరిగిందన్నది రికార్డుల్లో ఎక్కడా రాయలేదు. తాసిల్దార్ ఉత్తర్వులు కానీ, ఇతరత్రా ఆధార పత్రాల గురించి కానీ నమోదు చేయలేదు. కేవలం హక్కుదారు కాలమ్‌లో పేరు మాత్రమే మారింది. ఇది ఎందుకు మారిందో ఎవరికీ తెలియదు. పైగా సర్వే నంబర్‌లో ఉన్న భూమి కంటే.. మించి రికార్డుల్లోకి ఎలా ఎక్కిందో అర్థం కాదు. 1987-88లో లింగమయ్య పేరిట భూమి మారితే ఆయన కాస్తులో ఉండాలి. మోఖాపై ఉండి సాగుచేసుకోవాలి. కానీ లింగమయ్య ఏనాడూ భూమి మీదకు రాలేదు. లక్ష్మమ్మ, ఆమె కుటుంబసభ్యులే ఇవాళ్టికీ భూమిని సాగుచేసుకొంటున్నారు. ఈ సీజన్‌లో కూడా మక్కజొన్న పంట వేశారు. ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నిస్తే అధికారుల వద్ద ఎలాంటి సమాధానం లేదు.

### మేమేం చేస్తాం? కోర్టుకు వెళ్లండి

- మిడ్జిల్ తాసిల్దార్ రాంచంద్రయ్య

ఈ అంశంపై మిడ్జిల్ తాసిల్దార్ రాంచంద్రయ్యను 'నమస్తే తెలంగాణ' సంప్రదించింది. ఈ విషయంపై లక్ష్మమ్మ కుమారుడు రవిగౌడ్ అనేకసార్లు ఫిర్యాదు చేశారని తాసిల్దార్ అంగీకరించారు. రికార్డుల్లో ఉన్న వాస్తవిక పరిస్థితిని ఆయనకు లిఖితపూర్వకంగా ఇచ్చామని తెలిపారు. మాలె లింగమయ్య పేరిట భూబదలాయింపు చేయడానికి రికార్డుల్లో ఏ ప్రాతిపదికన జరిగింది? ఏ ఉత్తర్వుల ప్రకారం మారింది? అని ప్రశ్నించగా అలాంటి వివరాలేవీ రికార్డుల్లో లేవని.. కేవలం పేరు మాత్రమే మారిందని స్పష్టంచేశారు. అదే అంశాన్ని బాధితుడికి లిఖితపూర్వకంగా ఇవ్వవచ్చుకదా అని అడుగగా.. 'గతంలో జరిగిన దాన్ని మేమెలా ఇస్తాం? కేవలం రికార్డుల్లో ఏముందో ఆ వివరాలు మాత్రమే ఇస్తాం' అని జవాబిచ్చారు. ఇలాంటి విషయాల్లో కోర్టుకు కానీ, ఆర్డీవో కోర్టుకు గానీ వెళ్లాలని సలహా ఇచ్చారు.

## చిన్నాయన భూమిని కాజేసిన వీఆర్వో

- బదిలీ అయినా.. పాత తేదీలతో సంతకాలు
- కుటుంబ ఒప్పందాన్ని తుంగలో తొక్కి తండ్రిపేరిట విరాసత్
- సహకరించిన ఇతర అధికారులు
- న్యాయంకోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు



భూమి పత్రాలు చూపుతున్న లచ్చయ్య

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లికి చెందిన కంకణాల రాజయ్యకు ఎల్లయ్య, లచ్చయ్య అనే ఇద్దరు కొడుకులున్నారు. రాజయ్యకు నీరడి (వీఆర్‌ఏ) ఉద్యోగంతోపాటు అదే గ్రామం పరిధిలోని సర్వేనంబర్ 39లో పద్నాలుగున్నర గుంటల భూమి ఉన్నది. 1994లో రాజయ్య చనిపోవడంతో తండ్రి ఉద్యోగాన్ని పెద్ద కొడుకు ఎల్లయ్య కుమారుడు రాజేశంకు ఇవ్వాలని, పద్నాలుగున్నర గుంటల భూమి చిన్న కొడుకు లచ్చయ్యకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. 1997 జూలై 19న ఈ మేరకు ఒప్పందం పత్రం రాసుకున్నారు. ఆ ప్రకారంగానే వీఆర్‌ఏ ఉద్యోగం ఎల్లయ్య కొడుకు రాజేశంకు ఇచ్చారు. భూమి మాత్రం పట్టాదారుగా తండ్రి రాజయ్య వస్తుండగా కబ్జా కాలమ్‌లో లచ్చయ్య వస్తున్నారు. అయితే, ఒప్పందపత్రం ఉండటంతో లచ్చయ్య తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేసుకోలేదు.

**విరాసత్ అమలు చేసుకోలేదు**

1997లో వీఆర్‌ఏగా ఉద్యోగంలో చేరిన రాజేశంకు 2008లో వీఆర్వోగా పదోన్నతి వచ్చింది. దేశరాజ్‌పల్లిలో 2008 జూన్ 13 నుంచి 2009 సెప్టెంబర్ 30 వరకు వీఆర్వోగా విధులు నిర్వహించారు. తన తాత రాజయ్య పేరిట ఉన్న భూమి ఇంకా రికార్డుల్లో అలాగే ఉండటంతో తన తండ్రి ఎల్లయ్యతో 2010 జూన్ 11న అర్జీ పెట్టించారు. విరాసత్ అమలుకు 45 రోజుల వ్యవధి ఉండాలి. అభ్యంతరాలు వస్తే పరిశీలించాలి. కానీ, అర్జీ పెట్టుకున్న 18 రోజులకే అంటే 2010 జూన్ 29న రామడుగు తాసిల్దార్ విరాసత్ ఉత్తర్వులు ఇచ్చారు. ఒక తాసిల్దార్ ఉత్తర్వుల సంఖ్య బీ/66/2010తో విరాసత్ అమలుచేస్తే మరో తాసిల్దార్ ఉత్తర్వులసంఖ్య బీ/66/2009తో వీఆర్వో రాజేశం తండ్రి ఎల్లయ్య పేరిట పాస్‌పుస్తకం జారీచేశారు. పైగా 2009 సెప్టెంబర్ 30 వరకే ఈ గ్రామంలో విధులు నిర్వహించిన రాజేశం 2010 జూన్ 29న జారీ అయిన ఎల్లయ్య విరాసత్ ఉత్తర్వులపై వీఆర్వో హోదాలో సంతకం చేశారు.

**అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితుడు**

తనకు తెలియకుండా తన అన్న ఎల్లయ్య పేరిట పట్టామార్పిడి జరిగినట్టు తెలుసుకున్న లచ్చయ్య న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. 'మీ అన్న ఎల్లయ్య, అతని కొడుకు రాజేశం (వీఆర్వో) ను తీసుకొస్తేనే నీకు విరాసత్ చేస్తాం' అని అధికారులు చెప్తున్నారు. తన అన్నకు విరాసత్ చేసినపుడు తనకెందుకు చెప్పలేదని అడిగితే అధికారుల నుంచి సమాధానం లేదని లచ్చయ్య వాపోతున్నారు. తమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య జరిగిన ఒప్పందం మేరకు 14 గుంటల భూమి తనకే రావాల్సి ఉన్నదని, ఒకవేళ పంపకం జరిగినా కనీసం తనవాటా కింద ఏడు గుంటలైనా ఇవ్వాలని లచ్చయ్య వేడుకొంటున్నారు. తన అన్న కొడుకు రాజేశం కారణంగా తమ ఇద్దరి మధ్య ఇప్పుడు మాటలు లేవని.. అలాంటప్పుడు తన అన్నను ఏవిధంగా తీసుకొస్తానని లచ్చయ్య ప్రశ్నిస్తున్నారు. కబ్జాకాలంలో తనపేరు ఉన్నదని, తన అనుమతి లేకుండానే అధికారులు విరాసత్ చేశారని వాపోయారు. అధికారులు తనకు రావాల్సిన వాటాను ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితుడు పేర్కొన్నారు. ఇప్పటికైనా భూమిని తన పేరిట నమోదు చేయాలని అధికారులను కోరారు.

## వారసత్వ భూమి ఒకరికే పట్టా

- కాసులకు కక్కుర్తిపడిన వీఆర్వోపై మిగిలిన వారసుల ఆగ్రహం
- న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు



నసీర్ పేరిట పట్టా అయిన పత్రాలను చూపుతున్న అన్నదమ్ములు

**దేవరకద్ర, నమస్తే తెలంగాణ:** తండ్రి భూమికి తానొక్కడినే వారసుడినని నలుగురు కుమారుల్లో ఒకరు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోకా.. కాసులకు కక్కుర్తిపడిన వీఆర్వో ఎలాంటి విచారణ చేయకుండానే సదరు భూమిని ఆ వ్యక్తికి పట్టాచేశాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం కౌకుంట్లలో చోటుచేసుకున్నది. కౌకుంట్లకు చెందిన కటికె బురాన్‌కు నలుగురు కుమారులు. గ్రామంలో జీవనోపాధిలేక అతని పెద్దకుమారుడు జహంగీర్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో, మరో ఇద్దరు మహ్మద్ ఖాజా, మహ్మద్ షబ్బీర్ హైదరాబాద్‌లో హోటళ్లు నిర్వహిస్తున్నారు. బురాన్ 2013 మేలో మృతిచెందగా, ఆయన పేరిట సర్వే నంబర్లు 519, 520లో 2.30 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమి ద్వారా వచ్చే కౌలుతో రెండో కుమారుడు నసీర్ గ్రామంలోనే జీవిస్తున్నాడు. తండ్రి పేరిట ఉన్న పొలాన్ని పంచుకోవాలని నిర్ణయించిన ముగ్గురు అన్నదమ్ములు కొద్దిరోజుల కింద గ్రామంలో ఉంటున్న నసీర్ వద్దకు వెళ్లారు. అయితే ఆ పొలాన్ని తనపేరిట పట్టాచేసుకొన్నానని నసీర్ చెప్పడంతో అతని అన్నదమ్ములు అవాక్కయ్యారు. అనంతరం వారు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై వారు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. బురాన్‌కు నలుగురు సంతానం ఉంటే కాసులకు కక్కుర్తిపడి ఒకరిపేరిటే ఎలా పట్టాచేస్తారని అధికారులను ప్రశ్నించారు. నసీర్‌కు పట్టాచేసిన భూమిని ఇప్పటికైనా తమ నలుగురికి సమానంగా పంచాలని రెవెన్యూ సిబ్బందిని కోరుతున్నారు. ఈ విషయమై తాసిల్దార్ కృష్ణయ్యను వివరణ కోరగా.. నసీర్ పేరిట పట్టామార్పిడి జరుగడంతోపాటు కొత్త పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయని, వాటిని రద్దు చేసే అధికారం తనకు లేదని చెప్పారు. ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవాలని బాధితులకు సూచించినట్టు పేర్కొన్నారు.

# ఒకరి భూమి మరొకరికి రాశారు

- ఆందోళనలో తాసిల్దార్ లావణ్య బాధితులు
- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో వెలుగుచూస్తున్న మరికొన్ని అక్రమాలు



భూమి పత్రాలను చూపుతున్న వాంక్డావత్ గోప్యా దంపతులు


**కేశంపేట:** తాతముత్తాతల నుంచి భూమిని సాగుచేస్తున్న రైతుల నోట్లో మట్టికొట్టి, వారి భూమిని వేరొకరి పేరిట ఆన్‌లైన్‌లో మార్పిడిచేసిన బాగోతం మరొకటి రంగారెడ్డి జిల్లా కేశంపేట తాసిల్దార్ కార్యాలయంలో వెలుగుచూసింది. కేశంపేట మండలం వేములనర్వ గ్రామ పరిధిలోని కంకరాళ్లతండాకు చెందిన వాంక్డావత్ గోప్యా చెప్పిన వివరాల ప్రకారం.. గోప్యాకు సర్వే నంబర్లు 58/2లో 1.27 ఎకరాలు, 61/2లో 0.33 ఎకరాలు కలిపి మొత్తం 2.20 ఎకరాల అసైన్డ్‌భూమి ఉన్నది. ఆ భూమిని గోప్యా తాతముత్తాల నుంచి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో గోప్యాకు చెందిన మొత్తం భూమిని అదే తండాకు చెందిన వాంక్డావత్ రాములు పేరిట ఆన్‌లైన్‌లోఎక్కించారు. కొత్త పాస్‌పుస్తకాలు రాకపోవడంతో బాధితుడు గోప్యా, అతని కుంటుబసభ్యులు తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి విచారించగా అసలు విషయం బయటపడింది. దీనిపై తాసిల్దార్ లావణ్య, వీఆర్వో మధుబాబును ప్రశ్నించడంతో ఆన్‌లైన్‌లో తప్పు జరిగి ఉంటుందని.. సరిచేస్తామని సముదాయించారు. కొన్ని నెలలుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగినా రికార్డులు సరిచేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అవినీతి ఆరోపణల కేసులో తాసిల్దార్ లావణ్య పట్టుబడటం, వీఆర్వో మధుబాబు బదిలీపై వెళ్లడంతో ఎవరిని అడగాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆందోళన వ్యక్తంచేశారు.

### మాకు న్యాయంచేయాలి

తాతముత్తాతల నుంచి సాగుచేసుకొంటున్న మా భూమిని అధికారులు లంచాలు తీసుకొని వేరొకరి పేరిట ఆన్‌లైన్‌లో మార్చారు. వారికి పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయి. ఇదేమని నిలదీస్తే తమకు తెలియకుండా జరిగిందని తాసిల్దార్ లావణ్య, వీఆర్వో మధుబాబు బుకాయించారు. తప్పుచేసినవారు ఇప్పుడులేరు. ఉన్నతాధికారులు మాకు న్యాయంచేయాలి.

- వాంక్డావత్ గోప్యా, బాధితరైతు, కంకరాళ్ల తండా

### సర్పంచ్‌గా ఉన్న నన్నే ఇబ్బంది పెడుతున్నారు




సర్వే నంబర్లు 63, 65, 66, 67లో మా నాన్న వాంక్డావత్ గోప్యా తండ్రి రాంసింగ్ పేరున 7.37 ఎకరాల భూమి ఉన్నది. అందుకు సంబంధించిన పాత పాస్‌పుస్తకాలు కూడాఉన్నాయి. రికార్డులన్నీ ఆన్‌లైన్‌చేసే క్రమంలో 32 గుంటల భూమిని తగ్గించి.. 7.05 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దాని ప్రకారమే కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చారు. ఆన్‌లైన్ రికార్డులను సరిచేయాలని తాసిల్దార్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా.. అధికారులు అందుబాటులో లేక పని జరుగడంలేదు. గ్రామ సర్పంచ్‌గా ఉన్న నన్నే ఇబ్బంది పెడుతున్నారు.

- వాంక్డావత్ జగన్, సర్పంచ్ పుట్టోనిగూడెం, కేశంపేట మండలం

## భూ యజమానులతో రెవెన్యూ ఆట

- పాస్‌పుస్తకంలో తప్పుల మీద తప్పులు
- తప్పుడు పత్రాలతో కౌలురాదుడికి పది గుంటలు రాసిచారు
- కామారెడ్డి జిల్లా భిక్కనూరువాసి వైద్య రంగాచారి ఆవేదన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాస్‌పుస్తకంలో మొదటిసారి తప్పుచేస్తే సరిదిద్దొచ్చులే అని అనుకోవచ్చు.. సర్వే నంబర్, భూమి విస్తీర్ణం తప్పుగా నమోదుచేశారని చెప్పిన తర్వాత కూడా మళ్లీ కొత్త తప్పుచేస్తే ఏమనాలి? ఆరు సర్వే నంబర్లలో భూమి ఉండగా.. అందులో రెండు సర్వే నంబర్లను రాత్రికి రాత్రే తొలగించేశారు. దొంగ అమ్మకపు పత్రాన్ని సృష్టించిన వ్యక్తి కాసులివ్వగానే పది గుంటలు రాసిచ్చేశారు. కామారెడ్డి అధికారులు ఒకదాని వెంట ఒకటిగా తప్పులు చేస్తూ పోతుంటే.. సరిదిద్దేవారెవరు? రికార్డులను సవరించాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోకపోవడంతో కామారెడ్డి జిల్లావాసి వైద్య రంగాచారి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

'నా పేరు వైద్య రంగాచారి. మా తాతముత్తాతల నుంచి వారసత్వంగా మా ఇద్దరి అన్నదమ్ములకు 6.7 ఎకరాలు సంక్రమించింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సర్వే నంబర్లు 1226, 1227, 1228, 1229లలో 4.18 ఎకరాలు, 1127, 205లలో 1.29 ఎకరాల భూమి ఉన్నది. 2006లో నాగ్‌పూర్ హైవే నిర్మాణం కోసం సర్వే నంబర్ 1229లో 30 గుంటల భూమిని ప్రభుత్వం సేకరించి పరిహారం ఇచ్చింది. ఈ ఆరు సర్వే నంబర్లను కొత్త పాస్‌పుస్తకంలో నమోదు చేయాలని భిక్కనూరు రెవెన్యూ అధికారులను కోరాం. 1-బీ ఫారంలో మేం అన్నీ సరిగ్గానే నమోదు చేశాం. అయినా సర్వే నంబర్, విస్తీర్ణం తప్పుగా నమోదుచేశారు. ఆ సర్వే నంబర్ నాది కాదని, తప్పును సరిచేయాలని రెవెన్యూ అధికారులను కోరాం. కొన్నిరోజుల తర్వాత.. రెండోసారి వేరే సర్వే నంబర్లు నా పాస్‌పుస్తకంలో నమోదుచేశారు. నాకు చెందిన రెండు సర్వే నంబర్లలోని 1.29 ఎకరాలు తొలగించారు. ప్రశ్నిస్తే.. ఆర్డీవో ఆదేశాల ప్రకారం చేశామని చెప్పుకొస్తున్నారు. ఇంతటితో ఆగకుండా మా వద్ద ఒకట్రెండేండ్లు కొంత భూమిని కౌలుచేసిన వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించగా.. వాటి ఆధారంగా రెవెన్యూ అధికారులు సొమ్ము తీసుకొని పది గుంటల భూమిని అతడికి రాసిచ్చారు. మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాలని కోరుతున్నాను.'

### సమస్య పరిష్కరిస్తా..

మా వద్ద ఉన్న రికార్డుల ప్రకారం.. మొదటి నాలుగు సర్వే నంబర్లలో బాధితుడి పేరిట ఎకరం ఏడున్నర గుంటల భూమి మాత్రమే ఉన్నది. అంతకు మించి భూమి వారి వాటా కిందికొస్తే.. సంబంధిత పత్రాలను తీసుకొస్తే.. వాటిని పరిశీలించి న్యాయంచేస్తాం. 1127 సర్వే నంబర్‌లో ఎలాంటి భూమి లేదు. 205 సర్వే నంబర్‌లో 1.16 ఎకరాల భూమి ఉన్నది. ఇందుకు సంబంధించి వారసులు ఎంతమంది ఉన్నారో మా దగ్గరకొచ్చి.. ఫారం-6 నింపి, వారి తండ్రి మరణ ధృవీకరణ పత్రం సమర్పిస్తే సమస్యను పరిష్కరిస్తాను.

- వెంకన్న, భిక్కనూరు తాసిల్దార్

**పీకేఎల్‌లో నేడు**

తలైవాస్ X పాట్నా-7.30గం.
బెంగాల్ X పుణెరీ-8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో


అనిల్ కుంబ్లే

# బౌండరీల లెక్కింపుపై ఐసీసీ సమీక్ష

**న్యూఢిల్లీ :** ప్రపంచకప్ ఫైనల్‌లో తుదిస్కోర్లు సమం కావడం సహా సూపర్ ఓవర్ టై అయిన సందర్భంలో బౌండరీల లెక్క ఆధారంగా ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నిబంధనను సమీక్షించాలని మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు చాలా మంది డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అనిల్ కుంబ్లే నేతృత్వంలోని కమిటీ.. బౌండరీలను లెక్కించే నిబంధనను తదుపరి సమావేశంలో సమీక్షించనుందని ఐసీసీ ఆదివారం తెలిపింది. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించింది. 'ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా నిబంధనలపై వ్యక్తమైన అభ్యంతరాలను క్రికెట్ కమిటీ తదుపరి సమావేశంలో పరిగణలోకి తీసుకుంటుంది. మ్యాచ్ టై అయిన సందర్భంలో ఫలితం తేల్చడానికి 2009 నుంచి ఐసీసీ టోర్నీల్లో సూపర్ ఓవర్ నిర్వహిస్తున్నాం. ఒకవేళ సూపర్ ఓవర్ కూడా టై అయితే బౌండరీలు లెక్కించాలన్న నిబంధన ఉంది. ఆ మ్యాచ్‌లో అదే జరిగింది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల టీ20 లీగ్‌ల్లో ఇదే నిబంధన ఉంది. ప్రొఫెషనల్ క్రికెట్‌లో ఎక్కువగా అదే నిబంధన ఉన్నందున కొనసాగించాం. దీనికి మరేదైనా ప్రత్యామ్నాయం ఉంటే క్రికెట్ కమిటీ పరిశీస్తుంది' అని ఐసీసీ జనరల్ మేనేజర్ జెఫ్ అలార్డైస్ తెలిపారు. టై అయిన సందర్భంలో భవిష్యత్తులో టైటిల్‌ను ఇరు జట్లకు పంచాలన్న విషయంపై ఐసీసీ వార్షిక సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. టెస్ట్ చాంపియన్‌షిప్‌ను స్వాగతిస్తున్నామన్న టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యాఖ్యలపైనా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

### ఐసీసీకి ఆల్‌బ్లాక్స్ పంచ్

బౌండరీ నిబంధనపై న్యూజిలాండ్ రగ్బీ జట్టు ఆల్‌బ్లాక్స్ ట్విట్టర్ వేదికగా ఐసీసీకి పంచ్ వేసింది. వెల్లింగ్టన్‌లో ఆదివారం జరిగిన ఫ్రీడమ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌ను 16-16తో కివీస్ డ్రా చేసుకుంది. దీంతో ఇరు దేశాలు సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో ఐసీసీని పరోక్షంగా ఉద్దేశిస్తూ... 'వెల్లింగ్టన్‌లో బౌండరీల లెక్కింపు లేదు. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన మ్యాచ్' అంటూ బ్లాక్స్‌కాప్స్ ట్వీట్ చేసింది.

# పసిడి పంచ్‌లు

- భారత్‌కు ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు
- మెరిసిన మేరి కోం, సిమ్రన్‌జీత్, మోనిక, జమున
- ప్రెసిడెంట్స్ కప్ టోర్నీ



**న్యూఢిల్లీ:** పంచ్‌లకు పసిడి పతకాలు వెల్లువెత్తాయి. లాబౌన్ బాజో(ఇండోనేషియా) వేదికగా జరిగిన 23వ ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో తమదైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఆఖరి రోజైన ఆదివారం ఏడు స్వర్ణాలు సహా రెండు రజత పతకాలు దక్కించుకుని తమకు తిరుగులేదని ఘనంగా చాటి చెప్పారు. భారత బాక్సింగ్ క్వీన్ మేరి కోం(51కి), మోనిక(48కి), సిమ్రన్‌జీత్‌కౌర్, జమున బొరో(54కి), అంకుశ్ దహియా(64కి), అనంత్ ప్రహ్లాద్(52కి), నీరజ్ స్వామి(49కి) స్వర్ణ పతకాలతో మెరువగా, గౌరవ్ బిధూరి(56కి), దినేశ్ దాగర్ రజత పతకాలతో సంతృప్తిపడ్డారు.

### మేరి అదుర్స్

వయసు పెరిగినా వన్నె తగ్గలేదని మేరికోం మరోమారు నిరూపించింది. ముగ్గురు పిల్లలకు తల్లి అయినా తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ అంతర్జాతీయ వేదికలపై పతకాల మోత మోగిస్తూనే ఉన్నది. రెండు నెలల క్రితమే ఇండియా ఓపెన్‌లో అదరగొట్టిన ఈ మణిపూర్ మణిపూస ప్రెసిడెంట్స్ కప్‌లోనూ ఇరుగదీసింది. ఆదివారం జరిగిన 51కిలోల ఫైనల్లో ఆస్ట్రేలియా బాక్సర్ ఆప్రిల్ ఫ్రాంక్స్‌పై 5-0 తేడాతో ఘన విజయం సాధించింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. మూడు రౌండ్లలో తనదైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ కీలక పాయిం ట్లు కొల్లగొట్టింది. అక్టోబర్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ముం దు మేరి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. 'ప్రెసిడెంట్స్ కప్‌లో స్వర్ణ పతకం నాకు, నా దేశానికి గర్వకారణం. గెలువడం ద్వారా ఇంకా కష్టపడాలన్నది తెలిసొచ్చింది. నాకు వెన్నంటి నిలిచిన కోచ్ లు, సహాయక బృందం, కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు, సాయ్ అధికారులకు అందరికీ కృతజ్ఞతలు' అని మేరి ట్వీట్ చేసింది. మిగతా విభాగాల్లో సిమ్రన్‌జీత్ కౌర్..హస్నాహ్ హుస్వాతున్‌పై, జమున బొరో 5-0తో గులియా లామాంగ్‌పై, మోనికా..ఎండాంగ్‌పై విజయాలతో పసిడి పతకాలు నెగ్గారు.



# 'ఏం జరుగుతున్నది..?

- కోహ్లీ-రోహిత్ మధ్య విభేదాలు..!
- అంతా సవ్యంగానే ఉందంటున్న సీవోఏ
- నేడు మీడియా ముందుకు కోహ్లీ

### నిప్పు లేనిదే పొగరాదనేది నానుడి..

టీమ్ఇండియాలో విరాట్ కోహ్లీ-రోహిత్ శర్మ మధ్య విభేదాలున్నయన్న వాదనలు పొగలా కాదు ఏకంగా దావానలంలా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీని రోహిత్ అన్‌ఫాలో కావడం దగ్గరి నుంచి.. ప్రాకబడ్డీకి వచ్చి మీడియాతో కోహ్లీ మాట్లాడకపోవడం వరకు జరిగిన అన్ని ఘటనలు ఆ వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఎంత జరిగినా వారిద్దరు మాత్రం ఒక్కమాటా మాట్లాడడం లేదు. మరోవైపు జట్టులో ఎలాంటి విభేదాలు లేవని బీసీసీఐ చెబుతుంటే.. టీమ్ఇండియా ఆటగాళ్లు ఎవరూ పెదవి విప్పడం లేదు. అసలు భారత క్రికెట్‌లో ఏం జరుగుతుందనేది ఎవరికీ అంతుచిక్కని అంశంగా మారింది. ఈ నేపథ్యంలో విండీస్ సిరీస్ బయల్దేరే ముందు కోహ్లీ నేడు మీడియా ముందుకు రానున్నాడు. మరి రోహిత్‌తో విభేదాల అంశంపై అతడు ఏం చెబుతాడన్నది ఆసక్తికరంగా మారింది.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

విరాట్ కోహ్లీ - రోహిత్ శర్మ.. టీమ్ఇండియాకు ఇద్దరూ ప్రధానమైన ఆటగాళ్లు. ఒకరు సారథి.. మరొకరు ఉపసారథి.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లోనూ తొలి రెండు స్థానాలు వారివే. అలాంటి వారి మధ్య విభేదాలున్నాయన్న వార్తలు కొద్దిరోజులుగా విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై కోహ్లీ-రోహిత్‌తో పాటు భారత ఆటగాళ్లెవరూ స్పందించకపోవడం వాటికి ఆజ్యం పోసినట్టుగా ఉంది. సీవోఏ, బీసీసీఐ అధికారులు కొందరు అంతా సవ్యంగా ఉందని బయటకు చెబుతున్నా... ఇటీవల జరుగుతున్న కొన్ని పరిణామాలు జట్టులో అంతర్గంతంగా ఏదో జరుగుతుందని స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయేందుకు కారణం కోహ్లీ నిర్ణయాలేనని రోహిత్ ఆగ్రహించాడని, అప్పటి నుంచి విభేదాలు తారస్థాయికి చేరాయనేది సమాచారం.

### మొదలైందక్కడేనా..!

ప్రపంచకప్ సెమీఫైనల్‌లో టీమ్ఇండియా ఓటమే కోహ్లీ- రోహిత్ మధ్య విభేదాలకు కారణమైందనేది ప్రధానమైన వాదన. ఆ మ్యాచ్‌లో ధోనీని ఏడో స్థానంలో పంపడం సహా కోహ్లీ మరి కొన్ని నిర్ణయాలపై రోహిత్ తీవ్రంగా మనస్తాపం చెందినట్టు సమాచారం. కెప్టెన్ నిర్ణయాల వల్లే మ్యాచ్ చేజారిందని, తాను ఐదు శతకాలు చేసి ఎంతో కష్టపడితే అంతా వృథా చేశారని రోహిత్ ఆవేదన చెందినట్టు వార్తలొచ్చాయి. ఇంగ్లండ్‌పై ఓడిన సందర్భంలో బౌలర్లపై కోహ్లీ తప్పు నెట్టడంపైనా జట్టులో విభిన్న వాదనలు వినిపించాయట.

### ఇన్‌స్టాతో... రచ్చకు..

రోహిత్-కోహ్లీ విభేదాలు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రచ్చకెక్కాయి. కొంతకాలం కిందటే ఇన్‌స్టాలో కోహ్లీని రోహిత్ అన్‌ఫాలో కాగా... ఆ తర్వాత విరాట్ భార్య అనుష్కను తొలగించాడు. ఆ తర్వాత అనుష్క శర్మ సైతం రోహిత్‌ను... అతడి భార్య రితికను అన్‌ఫాలో చేసింది. కఠిన సమయాల్లో నిజం మాత్రమే మౌనంగా మనతో కరచాలనం చేస్తుందంటూ ఆమె చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. దీంతో వారి మధ్య విభేదాలు నిజమేనన్న వాదనకు బలం చేకూరింది. రితిక అయితే కోహ్లీ, అనుష్క ఇద్దరినీ ఫాలో కావడం లేదు. రోహిత్‌శర్మను కోహ్లీ ఇంకా ఇన్‌స్టాలో అనుసరిస్తుండడం కొసమెరుపు.

### అంతా ఓకే అని చెబుతున్నా...

ఇక ఈ వివాదం రోజురోజుకూ ముదురుతుండడంతో బీసీసీఐ, సీవోఓ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని నిర్ణయించాయి. కోహ్లీ-రోహిత్ మధ్య విభేదాలన్నీ మీడియా సృష్టేనని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ ఇటీవల అన్నారు. బీసీసీఐ కూడా ఇలాంటి మాటలే చెప్పింది. అయితే, జట్టులో అంతా సవ్యంగా ఉందని ఓ సందేశమివ్వాలని సీవోఏ సభ్యుల్లో ఒకరు టీమ్ఇండియాలోని ఓ సీనియర్ ఆటగాడిని కోరారని, అందుకు ఆ ప్లేయర్ ససేమిరా అన్నాడని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. దీంతో వివాదం మరింత జటిలమైంది.



### ఏం చెబుతాడో..

విండీస్ పర్యటన కోసం టీమ్ఇండియా సోమవారం బయలుదేరి వెళ్లనుంది. అంతకంటే ముందు కెప్టెన్ విరాట్ కోహ్లీ మీడియా ముందుకు రానున్నాడు. రోహిత్‌తో విభేదాలు, జట్టు పరిస్థితుల గురించి ఈ సమావేశంలో విరాట్ ఏం చెప్తాడనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. ప్రశ్నలను దాటవేస్తాడా.. అంతా సవ్యంగానే ఉందని వివరిస్తాడా.. ఇక నుంచి కలిసి ముందుకు పోతామని చెబుతాడా అన్నదే ఆసక్తికరం.కాగా, బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ వచ్చే వారంలో అమెరికాకు వెళ్లి.. టీమ్ఇండియా సభ్యులతో మాట్లాడి.. అభిప్రాయాలను తెలుసుకుంటారని సమాచారం. విండీస్‌తో తొలి రెండు టీ20లను అమెరికాలోని ఫ్లోరిడా వేదికగా భారత్ ఆడనుంది.

### కోహ్లీ మనసు మార్చుకుంది అందుకేనా...

రానున్న విండీస్ పర్యటనలో వన్డే, టీ20ల సిరీస్‌లకు కెప్టెన్ కోహ్లీ విశ్రాంతి తీసుకుంటాడని అందరూ భావించారు. అదే ఖాయంగా కనపడింది. అయితే హఠాత్తుగా ఇంగ్లండ్ నుంచి కోహ్లీ రావడం... విండీస్ పర్యటనలో అన్ని సిరీస్‌లకు అతడినే కెప్టెన్‌గా ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పరిమిత ఓవర్ల పగ్గాలు రోహిత్ చేపట్టి.. టీమ్ఇండియా గెలిస్తే తన కెప్టెన్సీ పోస్టుకు ప్రమాదమనే అభద్రతా భావంతోనే కోహ్లీ వెస్టిండీస్‌తో అన్ని సిరీస్‌లకు అందుబాటులోకి వచ్చాడనే వాదనలు అనేకం వినిపించాయి. అలాగే పరిమిత ఓవర్ల క్రికెట్‌కు రోహిత్‌ను కెప్టెన్‌ను చేయాలన్న డిమాండ్లు ఎక్కువవడమూ విరాట్ నిర్ణయానికి మరో కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు.

### గాడిలో పడాల్సిందే..


విండీస్ పర్యటన తర్వాత ఇంటా బయటా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా తదితర దేశాలతో టీమ్ఇండియా సిరీస్‌లు ఆడాల్సి ఉంది. అందునా టెస్టు చాంపియన్‌షిప్ కూడా ఆరంభం కానుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరుగనుంది. ఈ తరుణంలో కోహ్లీ-రోహిత్ మధ్య విభేదాలు ఉంటే జట్టుకు తీవ్ర నష్టం చేకూరుస్తాయి. వారికి మద్దతిచ్చే జట్టు సభ్యులు రెండుగా చీలే ప్రమాదముంది. అది జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే సమస్యలను, ఆటగాళ్ల మధ్య మనస్పర్థలపై బీసీసీఐ, సీఓఏ దృష్టి సారించి, సమసిపోయేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# 44 నెలల తర్వాత..

- సొంతగడ్డపై సిరీస్ గెలిచిన శ్రీలంక
- రెండో వన్డేలో బంగ్లాపై గెలుపు


అవిష్క ఫెర్నాండో (82)

**కొలంబో :** ప్రపంచకప్ టోర్నీ తర్వాత సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే శ్రీలంక కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడి ప్రేమదాస మైదానం వేదికగా జరిగిన రెండో వన్డేలో బంగ్లాపై ఏడు వికెట్ల తేడాతో లంక అలవోక విజయం సాధించింది. 2-0తో ఆధిక్యంలో నిలిచి మూడేళ్ల ఆరు నెలల తర్వాత సొంత గడ్డపై వన్డే సిరీస్‌ను దక్కించుకుంది. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్... మొదట టపటపా వికెట్లు కోల్పోయినా ముష్ఫికర్ రహీమ్(110బంతుల్లో 98 నాటౌట్), మెహదీ హసన్(43) అద్భుత పోరాటంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 238 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో శ్రీలం క ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(75 బంతుల్లో 82) అద్భుత ప్రదర్శన చేశాడు. అతడికి తోడు సీనియర్ బ్యాట్స్‌మెన్ అంజెలో మాథ్యూస్ (52), కుశాల్ మెండీస్(41) రాణించడంతో మూడు వికెట్లు కోల్పోయి 44.4 ఓవర్లలో శ్రీలంక విజయం సాధించింది. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ రెండు, మెహందీ హసన్ ఓ వికెట్ పడగొట్టారు. శ్రీలంక బ్యాట్స్‌మెన్ అవిష్క పెర్నాండోకు మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ అవార్డు దక్కింది.


ఆదివారం హైదరాబాద్‌లో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు

### 'బర్మింగ్‌హామ్'లో భారత్ పాల్గొనాలి : సీజీఎఫ్

**న్యూఢిల్లీ :** 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగే కామన్వెల్త్ కీడల్లో భారత్ కచ్చితంగా పాల్గొనాలని తాము కోరుకుంటున్నామని ఆ క్రీడల సమాఖ్య(సీజీఎఫ్) ఆదివారం వెల్లడించింది. షూటింగ్‌ను తొలగించినందుకు నిరసనగా కామన్వెల్త్ క్రీడలను బహిష్కరించాలనే ప్రతిపాదనను భారత ఒలింపిక్ సంఘం(ఐఓఏ) శనివారం కేంద్ర క్రీడా శాఖకు ప్రతిపాదించింది. దీనిపై కామన్వెల్త్ క్రీడల సమాఖ్య(సీజీఎఫ్) ఆదివారం స్పందించింది. '2022 క్రీడల్లో భారత్ పాల్గొనాలని మేము కోరుకుంటున్నాం. భవిష్యత్ లక్ష్యాలు, ఆందోళనలపై భారత్‌లో ఐఓఏతో రానున్న రోజుల్లో చర్చిస్తాం. అని సీజీఎఫ్ అధికారి తెలిపారు.

# ఢిల్లీ హ్యాట్రిక్

- హర్యానాపై ఘన విజయం

**ముంబై:** ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ లీగ్‌లో దూసుకెళుతున్నది. ఆదివారం హర్యానా స్టీలర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 41-21 తేడాతో గెలిచి హ్యాట్రిక్‌ను నమోదు చేసుకుంది. ఈ విజయం ద్వారా లీగ్‌లో 15 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నది. ఢిల్లీ తరపున రైడింగ్‌లో చంద్రన్ రంజిత్ 11 పాయింట్లతో అదరగొట్టగా, డిఫెన్స్‌లో సయిద్ గఫారీ(4) రాణించాడు. మరోవైపు హర్యానా జట్టులో నవీన్(9), కెప్టెన్ ధర్మరాజ్(3) ఆకట్టుకున్నారు. మ్యాచ్‌లో తొలుత చంద్రన్ జోరుతో ఢిల్లీ 7-3తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే వెంటనే పుంజుకున్న హర్యానా..ఢిల్లీ స్టార్ రైడర్ చంద్రన్‌ను ఔట్ చేసి ఆధిక్యాన్ని 6-8కి తగ్గించింది. జోగిందర్ నార్వల్ సూపర్ ట్యాకిల్‌కు తోడు విజయవంతమైన రైడ్‌తో 12-8కి ఢిల్లీ ఆధిక్యాన్ని పెంచుకుంది. ఇదే జోరుతో ప్రథమార్ధం ముగిసే సరికి 15-10తోనిలిచింది. కీలకమైన ద్వితీయార్ధంలోనూ అదే జోరు కొనసాగించిన ఢిల్లీ..పటిష్ఠ డిఫెన్స్, కండ్లు చెదిరే రైడ్లతో పాయింట్ల మధ్య అంతరాన్ని అంతకంతకు పెంచుకుంటూ పోయింది. ఈ క్రమంలో పలుమార్లు హర్యానాను ఆలౌట్ చేసి తిరిగి కోలుకోకుండా చేసింది. మరో మ్యాచ్‌లో ఆతిథ్య యు ముంబా 26-30తో బెంగళూరు బుల్స్ చేతిలో ఓడింది.




ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో బీసీసీఐ మాజీ జనరల్ మేనేజర్ ఎంవీ శ్రీధర్ జీవిత నేపథ్యంలో రూపుదిద్దుకున్న పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, వెంకటపతి రాజు, వినోద్, సీవీ ఆనంద్ తదితరులు


గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం తెలంగాణ, హైదరాబాద్ అథ్లెటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 2వ హైదరాబాద్ ఓపెన్ స్ప్రింగ్స్ & జంప్స్ అథ్లెటిక్స్ టోర్నీలో విజేతలను అభినందిస్తున్న శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు తదితరులు

# హంగేరి స్విమ్మర్ అరెస్ట్, విడుదల

- లైంగిక వేధింపుల ఆరోపణలపై కేసు నమోదు

**గ్వాంగ్జు(దక్షిణకొరియా):** ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఉదంతం చోటు చేసుకుంది. నైట్‌క్లబ్‌లో బాల్కనీ కూలి ఇద్దరి మరణంతో సహా పలువురు అథ్లెట్లు గాయపడ్డ ఘటన మరువకముందే హంగేరి స్విమ్మర్ థామస్ కెండెరెసీని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడినందుకు థామస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ తర్వాత విడుదల చేశారు. అయితే పది రోజుల వ రకు కొరియా విడిచి వెళ్లరాదంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పోలీసులు ఆదివారం పేర్కొన్నారు. 'విచారణ సందర్భంగా స్విమ్మర్ థామస్ తప్పుచేసినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మనుషులను కించపరిచేలా ఎవరూ వ్యవహరించినా ఊరుకునే ప్రసక్తి లేదు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించేటప్పుడు గౌరవంగా వ్యవహరించాలి' అని హంగేరి స్విమ్మింగ్ సమాఖ్య ఒక ప్రకటనలో పేర్కొంది.


థామస్

# వెర్‌స్టాపెన్‌దే జర్మనీ

**హాకెన్‌హీమ్(జర్మనీ) :** జర్మనీ గ్రాండ్ ప్రిక్స్‌ను నెదర్లాండ్ రెడ్‌బుల్ రేసర్ మాక్స్ వెర్‌స్టాపెన్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన రేసులో ప్రత్యర్థుల తప్పిదాలను సద్వినియోగం చేసుకొని.. ఐదుసార్లు చాంపియన్ అయిన మెర్సిడెస్ రేసర్ హామిల్టన్, ఫెరారీ రేసర్ సెబాస్టియన్ వెటెల్‌ను సైతం వెనక్కి నెట్టి మాక్స్ విజయం సాధించాడు. కెరీర్‌లో మొత్తం అతడికిది ఏడో విజయం కాగా.. ఈ సీజన్‌లో రెండోది. సెబాస్టియన్ వెటెల్, క్వియట్ వరుసగా రెండు, మూడు స్థానాలతో పోడియం ఫినిష్ చేశారు. మరోవైపు ఈ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళుతున్న బ్రిటన్ స్టార్ రేసర్ లూయిస్ హామిల్టన్ పదకొండో స్థానానికి పరిమితమయ్యాడు.



వెర్‌స్టాపెన్

# ఆగస్టు 5న డేవిస్ కప్ ఎంపిక

**కోల్‌కతా:** ఇస్లామాబాద్ వేదికగా జరిగే డేవిస్ కప్ ఆసియా/ఓషియానా గ్రూపులో భాగంగా పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్ కోసం వచ్చే నెల 5న భారత జట్టును ప్రకటించనున్నారు. ఈ విషయాన్ని అఖిల భారత టెన్నిస్ సమాఖ్య(ఏఐటీఏ) జనరల్ సెక్రెటరీ హిరణ్మయ్ ఛటర్జీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. 1964 తర్వాత తొలిసారి పాకిస్థాన్‌లో భారత టెన్నిస్ జట్టు పర్యటించబోతున్నది. లాహోర్‌లో జరిగిన పర్యటనలో భారత్ 4-0 తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. 'ప్రస్తుత ర్యాంకింగ్స్ ఆధారంగా వచ్చే నెల 5న ఆటగాళ్లను ఎంపిక చేస్తాం. ఇటలీతో ఆడిన జట్టును దాదాపుగా తీసుకుంటాం. సింగిల్స్‌లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌తో పాటు రామ్‌కుమార్ రామనాథన్ ఉంటారు. యుకీ భాంబ్రీ, సుమిత్ నాగల్ గాయాలతో బాధపడుతున్నందున వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. డబుల్స్‌లో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ ప్రాతినిధ్యం వహిస్తారు. నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా మహేశ్ భూపతి, కోచ్‌గా జీషాన్ అలీ వ్యవహరిస్తారు. డేవిస్ కప్ ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్(37వ) కంటే మనం మెరుగైన ర్యాంక్(20వ)లో ఉన్నాం. గెలుపు, ఓటముల పరంగా పాక్‌పై 6-0 ఆధిక్యం మనదే కావడం కలిసొచ్చే అంశం. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఐటీఎఫ్) నిబంధనలకు అనుగుణంగా పాక్‌లో పర్యటించాల్సిందే. లేకపోతే మనపై ఐటీఎఫ్ నిషేధం విధించే పరిస్థితి కూడా ఏర్పడుతుంది' అని ఛటర్జీ అన్నాడు.

## విదేశీ బాండ్లపై వెనక్కి తగ్గేది లేదు..



- స్పష్టం చేసిన నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జూలై 28:** విదేశీ బాండ్ల జారీ ద్వారా సేకరించాలనుకుంటున్న 10 బిలియన్ డాలర్ల నిధులపై వెనక్కి తగ్గేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాల కల్పనకోసం 103 బిలియన్ డాలర్ల వరకు నిధులను వెచ్చించనున్నట్లు ప్రకటించిన కేంద్రం..వీటిలో పదోవంతు విదేశీ బాండ్ల ద్వారా సేకరించాలని సంకల్పించింది. ఈ బాండ్ల జారీపై పలువురు ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తంచేసిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ బాండ్ల జారీపై ప్రధాన మంత్రి కార్యాలయం సమీక్షించినట్లు వచ్చిన వార్తలపై మంత్రి స్పందిస్తూ..తాను ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, వేరేవర్ని నిర్వహించాలని కోరలేదని ప్రముఖ ఇంగ్లీష్ పేపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. ఈ నిధుల సేకరణపై రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్లు, బీజేపీ మిత్ర పార్టీలు విమర్శించాయి. నిధుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ ప్రయత్నాలు ముమ్మరం చేసిందని, విదేశీ మార్కెట్ల నుంచి విదేశీ కరెన్సీ రూపంలో నిధులను సేకరించాలని నిర్ణయించినట్లు మంత్రి స్పష్టంచేశారు.

## ఐపీవోకి గ్రామీణ బ్యాంకులు

- 3-4 సంస్థలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే స్టాక్ మార్కెట్ లిస్టింగ్



**న్యూఢిల్లీ, జూలై 28:** ఆర్థిక పరిపుష్ఠి గల ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ)ను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లోకి తీసుకెళ్లాలని యోచిస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లో కనీసం మూడు, నాలుగు ఆర్ఆర్‌బీలను స్టాక్ మార్కెట్లకు పరిచయం చేయాలనుకుంటున్నది. పబ్లిక్ ఇష్యూ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ లేదా ఐపీవో)లకూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. అయితే అంతకుముందు బ్యాంకుల ఏకీకరణ పూర్తి చేయనున్న మోదీ సర్కారు.. ఆ తర్వాతే లిస్టింగ్‌ల్లోకి దిగనున్నది. ఇప్పటికే ఈ ప్రక్రియ నడుస్తున్నదని సంబంధిత వర్గాల సమాచారం. ప్రస్తుతం 45గా ఉన్న ఆర్ఆర్‌బీల సంఖ్యను 38కి తగ్గించాలని కేంద్రం యోచిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే ఈ సంఖ్య మరింతగా తగ్గవచ్చని సదరు వర్గాల ద్వారా తెలుస్తున్నది. నిజానికి గడిచిన కొద్ది నెలలుగా వివిధ రాష్ర్టాల్లో 21 బ్యాంకులను ఏకం చేసింది కేంద్ర ప్రభుత్వం. భారీ సంస్థలైతేనే ఆర్థిక ప్రయోజనాలను అందుకోగలవన్న ఉద్దేశంతోనే ఈ విలీనాలకు మోదీ సర్కారు తెరతీసింది. ఆర్ఆర్‌బీ చట్టం-1976 కింద ఈ బ్యాంకులు ఏర్పాటైయ్యాయి. సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇతర కళాకారులకు రుణాలు, తదితర బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఇవి పనిచేస్తున్నాయి. కాగా, 2015లో ఆర్ఆర్‌బీ చట్టంలో పలు మార్పులను కేంద్రం చేయగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్పాన్సర్ బ్యాంకుల నుంచేగాక ఇతర మార్గాల నుంచీ నిధుల సమీకరణకు వీలు కలిగింది. ప్రస్తుతం ఆర్ఆర్‌బీల్లో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం వాటా, స్పాన్సర్ బ్యాంకులకు 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలకు 15 శాతం చొప్పున వాటాలున్నాయి. అయితే ఈ బ్యాంకుల్లో వాటాల ఉపసంహరణ జరిగినా.. కేంద్రం, స్పాన్సర్ ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలు కలిపి 51 శాతానికి తగ్గకూడదని సవరణ చట్టం చెబుతున్నది. దీనివల్ల యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దే ఉండనున్నాయి. 2005 నుంచి ఆర్ఆర్‌బీల్లో దశలవారీగా విలీనాలు మొదలైయ్యాయి. ఈ క్రమంలోనే 2006లో 196 నుంచి 133కు తగ్గిన బ్యాంకులు.. ఆ తర్వాత 105కు, 2012 మార్చి నాటికి 82కు చేరాయి. అనంతరం 56కు, ఆ తర్వాత 45కు పడిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ఈ నెల 5న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్ఆర్‌బీల రీక్యాపిటలైజేషన్‌కు రూ.235 కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే. స్పాన్సర్ బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వాలూ రీక్యాపిటలైజేషన్‌లో భాగస్వాములవుతాయి.

# ఫలితాలే దిక్సూచి

### స్థూల ఆర్థికాంశాలు, ఫెడ్ నిర్ణయాలు కూడా..
### మార్కెట్లకు దిశా నిర్దేశం చేయనున్న అంశాలు

**న్యూఢిల్లీ, జూలై 28:**

గతవారంలో తీవ్ర ఒత్తిడికి గురైన దేశీయ స్టాక్ మార్కెట్లు ఈవారంలో పలు కీలక అంశాలు దిశానిర్దేశం చేయనున్నాయి. కార్పొరేట్ల ఫలితాలకు తోడు స్థూల ఆర్థికాంశాలు, వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకోనున్న నిర్ణయం దలాల్‌స్ట్రీట్‌ను ప్రభావితం చేయనున్నాయని మార్కెట్ పండితులు జోస్యంచెబుతున్నారు. వరుసగా ఆరు ట్రేడింగ్‌ల పాటు నష్టపోయిన బీఎస్‌ఈ సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్‌లో స్వల్పంగా కోలుకున్నది. మే నెల తర్వాత వరుసగా ఇలా నష్టపోవడం ఇదే తొలిసారి. కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ, ప్రపంచ మార్కెట్ల బలహీనత నేపథ్యంలో మదుపరుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నాయని క్యాపిటల్ ఎయిమ్ హెడ్ రోమేష్ తివారీ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ల సరళి ఆధారంగా దేశీయ సూచీల ట్రేడింగ్ జరుగనున్నదన్నారు. ఈవారంలోనే కార్పొరేట్ దిగ్గజాలైన డీఎల్‌ఎఫ్, డాక్టర్ రెడ్డీస్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లతోపాటు ఇతర సంస్థలు తమ తొలి త్రైమాసికపు ఆర్థిక ఫలితాలను ప్రకటించబోతున్నాయి. వీటితోపాటు మౌలిక రంగ ఉత్పత్తి గణాంకాలు, తయారీ రంగానికి సంబంధించిన పీఎంఐ డాటా కూడా మార్కెట్లకు కీలకమని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. అగరాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థ బలపడుతుండటంతో ఈవారంలో జరుగనున్న యూఎస్ ఫెడ్ రిజర్వు సమీక్షలో కీలక వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటం గ్లోబల్ మార్కెట్లలో కీలకపాత్ర పోషించనున్నది. గతవారంలో సెన్సెక్స్ 454.22 పాయింట్లు(1.18 శాతం) నష్టపోయి 37,882.79 వద్దకు, నిఫ్టీ 11,350 దిగువకు పడిపోయింది.

#### వాహన షేర్లకు డిమాండ్!

ఈవారంలో వాహన షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్యుత్‌తో నడిచే వాహనాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం ఈ రంగ షేర్లకు డిమాండ్ నెలకొనే అవకాశాలున్నాయి. అలాగే ఎలక్ట్రిక్ వాహన చార్జర్లపై కూడా సుంకాన్ని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారు.

#### బ్లూచిప్ సంస్థలకు తప్పని నిరాశ

గడిచిన వారంలో బ్లూచిప్ సంస్థలకు నిరాశనే మిగిల్చింది. టాప్-10 సంస్థల్లో నాలుగు ఏకంగా రూ.84,433 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు అత్యధికంగా నష్టపోగా, టీసీఎస్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకులు మొత్తంగా రూ.22,058.3 కోట్ల మేర పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.రూ.26,900 కోట్లు పడిపోయి రూ.6,22,401.90 కోట్లకు జారుకోగా, హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ క్యాప్ రూ.24,360 కోట్లు పతనం చెంది రూ.3,74,131.53 కోట్లకు పడిపోయింది. ఆర్ఐఎల్ రూ.22,123 కోట్లు పడిపోగా, ఎస్బీఐ రూ.12,048 కోట్లు పడిపోయింది. ఇదే సమయంలో టీసీఎస్ విలువ రూ.11,951.35 కోట్లు పెరుగగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.3,484.66 కోట్లు, ఐటీసీ రూ.2,487.11 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.2,138.61 కోట్లు, హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ రూ.1,266.41 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.730.16 కోట్లు బలపడ్డాయి.



## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల ఉపసంహరణ

- జూలైలో రూ.3,700 కోట్ల పెట్టుబడులు వెనక్కి



విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ కొనసాగుతున్నది. వరుసగా ఐదు నెలలపాటు దేశీయ ఈక్విటీ, డెబిట్ మార్కెట్లలోకి భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పెట్టుబడిదారులు.. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు రూ.3,758 కోట్లను తరలించుకుపోయారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై పన్ను విధిస్తున్నట్లు ప్రకటించడం, విదేశీ బాండ్లను జారీ చేయడం ద్వారా భారీగా నిధులను సేకరించాలని ప్రకటించడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళనను పెంచింది. తాజాగా డిపాజిటరీ నివేదిక ప్రకారం..జూలై 1 నుంచి 26 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.14,382.59 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు.. ఇదే సమయంలో డెబిట్ మార్కెట్లలో రూ.10,624.15 కోట్ల పెట్టుబడులను పెట్టారు. దీంతో రూ.3,758.44 కోట్లను తరలించుకుపోయినట్లు అయింది. జూన్‌లో రూ.10,384.54 కోట్లను ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు..మే నెలలో రూ.9,031.15 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు, మార్చి నెలలో రూ.45,981 కోట్లు, ఫిబ్రవరిలో రూ.11,182 కోట్లను దేశీయ క్యాపిటల్ మార్కెట్ల(ఈక్విటీ, డెబిట్ మార్కెట్లు)లోకి చొప్పించారు. సంపన్న వర్గాలపై పన్ను విధించిన నాటి నుంచి ఎఫ్‌పీఐలు అమ్మకానికి మొగ్గుచూపుతున్నారు మార్నింగ్ స్టార్ సీనియర్ మేనేజర్ హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. ఆర్థిక రంగ మందగమనంలో కొనసాగుతుండటం, ముఖ్యంగా వాహన రంగ నిరాశాజనక పనితీరు ఎఫ్‌పీఐల్లో ఆందోళను మరింత పెంచింది. వీటికితోడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కార్పొరేట్ల ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటం, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం వంటి అంశాలు కూడా వీటికి తోడయ్యాయి.

## ఆస్తుల జప్తు ఆపండి

- సుప్రీం కోర్టులో మాల్యా పిటిషన్



**న్యూఢిల్లీ, జూలై 28:** లిక్కర్ వ్యాపారి విజయ్ మాల్యా.. తమ ఆస్తుల జప్తును అడ్డుకోవాలని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనవి, తన బంధువులకు చెందిన ఆస్తుల అటాచ్‌మెంట్‌పై స్టే విధించాలంటూ అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా పిటిషన్ వేశారు. ఇప్పటికే ఇదే తరహా ఓ పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. మాల్యా ఆస్తుల జప్తుపై ప్రత్యేక కోర్టు జరుపుతున్న విచారణను నిలిపివేయాలని ఆదేశించాలంటూ మాల్యా తరపు న్యాయవాదులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఈ ఏడాది జనవరి 5న మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టు మాల్యాను పరారీ ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పుడే మాల్యా ఆస్తుల జప్తు ప్రక్రియను కోర్టు ప్రారంభించింది. దీన్ని ఆపేందుకే మాల్యాపై కోర్టుల గడప తొక్కుతున్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి బ్యాంకులకు రూ.9,000 కోట్లకుపైగా రుణాలను ఎగవేసి మూడున్నరేండ్ల క్రితం మాల్యా లండన్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అక్కడ భారత్‌కు అప్పగింత విచారణను ఎదుర్కొంటున్న సంగతీ విదితమే.

## మూడేండ్లలో రూ.700 కోట్ల పెట్టుబడి: హీరో ఎలక్ట్రిక్

**న్యూఢిల్లీ, జూలై 28:** విద్యుత్‌తో నడిచే వాహనాలకు ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుకూలంగా ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ హీరో ఎలక్ట్రిక్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి సిద్ధమైంది. ఇందుకోసం వచ్చే మూడేండ్లకాలంలో రూ.700 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఉత్పత్తి కెపాసిటీ 5 లక్షల యూనిట్లకు చేరుకోనున్నది. ప్రస్తుతం సంస్థ లక్ష యూనిట్లను ఏడాదికి ఉత్పత్తి చేస్తున్నది. ఇందుకు అవసరమైన నిధులను పలు రూట్లలో సేకరించాలనుకుంటున్నట్లు హీరో ఎలక్ట్రిక్ ఎండీ నవీన్ ముంజల్ తెలిపారు. ఎంతమేర నిధులను సేకరించేదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికే బయట నుంచి రుణాలను సేకరించినట్లు, వీరిలో ఆల్ఫా క్యాపిటల్ పెట్టుబడులు పెట్టింది. వ్యాపార విస్తరణలో భాగంగా ప్రస్తుతం 600గా ఉన్న డీలర్లు వచ్చే ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను వెయ్యికి పెంచబోతున్నట్లు ప్రకటించారు.



ఆదివారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన గార్మెంట్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రహోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

# విద్యుత్ వాహనాలదే హవా

- భవిష్యత్తులో పెరుగనున్న వినియోగం
- కాలుష్య నివారణకు దోహదం
- నిర్వహణ ఖర్చూ తక్కువే

విపరీతంగా పెరిగిపోయిన వాతావరణ కాలుష్యంతో మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. దీనికి రవాణా వ్యవస్థ కూడా ఒక ప్రధాన కారణమని చెప్పొచ్చు. వాహనాల వాడకం రోజురోజుకూ పెరిగిపోవడంతో వాయు కాలుష్యానికి దారితీస్తుంది. అయితే డీజిల్, పెట్రోల్ వాహనాలకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత వాహనాలను వినియోగిస్తే వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత కలుషిత నగరాల జాబితాలో భారతీయ నగరాలే ఎక్కువగా ఉన్నాయని ఇప్పటికే చాలా సర్వేలు వెల్లడించాయి. ఈ క్రమంలో కొన్ని నగరాలు విద్యుత్ వాహనాల వినియోగం బాట పట్టాయి. నిజానికి భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదే. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణకు విద్యుత్ ఆధారిత వాహనాలు ఏవిధంగా ఉపయోగపడుతాయో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

### ప్రవాస్ 2019 వేదికగా..

రవాణా రంగాభివృద్ధి కేంద్రంగా నిర్వహించిన 'ప్రవాస్-2019' సదస్సు.. విద్యుత్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు కృషి చేసింది. అంతర్జాతీయ కంపెనీలూ విద్యుత్ వాహనాల తయారీపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా టాటా మోటర్స్ తయారు చేసిన మొట్టమొదటి విద్యుత్ బస్సును సదస్సులో ప్రదర్శించి విద్యుత్ వాహనాల కొనుగోలు పట్ల ప్రజల్లో ఆసక్తి పెంచేలా ప్రవాస్-2019 సదస్సు చొరవ చూపింది. దేశీయ ఆటో రంగ సంస్థైన టాటా మోటర్స్.. ఆల్ట్రా ఈవీ పేరుతో విద్యుత్ బస్సును రూపొందించింది. రెండున్నర గంటల్లో బస్సు ఫుల్‌గా చార్జింగ్ అవుతుంది. ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 100 కి.మీ దూరం ప్రయాణించవచ్చు. విద్యుత్ బస్సుతో పోల్చుకుంటే 100 కి.మీ దూరం ప్రయాణించేందుకు డీజిల్ బస్సుకు రూ.1.400 వరకూ ఖర్చు అవుతుంది. అదే విద్యుత్ వాహనాలకైతే ఈ ఖర్చు రూ.500 నుంచి 600లే. కిలోమీటర్‌కు ఒక యూనిట్ విద్యుత్ మాత్రమే వినియోగంతో విద్యుత్ బస్సుల నిర్వహణ ఖర్చు గణనీయంగా తగ్గుతున్నది. ఫలితంగా ప్రయాణీకులపైనా భారం దిగుతున్నది.

### పర్మిట్ అవసరం లేదు..

రాబోయే పదేండ్లలో వంద శాతం విద్యుత్ వాహనాలే వినియోగంలోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. విద్యుత్ వాహనాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తయారీ, అమ్మకాలపై పన్నుల రాయితీ ప్రకటించడం. రోడ్డు పన్నులను తగ్గించడం వంటి ప్రోత్సాహకాలెన్నింటినో ప్రభుత్వం అందిస్తున్నది. వీటికి నేషనల్ పర్మిట్ ఉండబోదని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రవాస్-2019లో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో విద్యుత్ వాహనాలదే హవా అని స్పష్టమవుతున్నది. దీని ద్వారా ఉద్యోగాల కల్పనలో కీలక ప్రాత పోషిస్తున్న రవాణా రంగం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. పర్యావరణ కాలుష్యాన్నీ గణనీయంగా నియంత్రించవచ్చు.


### ప్రజా రవాణాకు బస్సులే మేలు

దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో వాయు కాలుష్యం పెరుగడానికి ముఖ్య కారణం వాహనాల పెరుగుదలే. ఏటేటా వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. రాను రాను వ్యక్తిగత వాహనాలకు ప్రాధాన్యత ఎక్కువవుతున్నది. ప్రజా రవాణాకు షేర్ ఆటోలనే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. దేశంలో ఆటోల ద్వారా ప్రయాణాన్ని సాగిస్తున్న వారు 73 శాతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. జనాభా పెరుగుదల కంటే 7-8 శాతం ఎక్కువగా వ్యక్తిగత వాహనాల పెరుగుదల నమోదవుతున్నది. పెద్ద నగరాల్లో ప్రజా రవాణా చాలా కష్టతరమైన పని. కానీ దీన్ని బస్సుల వినియోగంతో అధిగమించవచ్చు. లండన్ వంటి పెద్ద నగరాల్లోనూ ట్రాఫిక్ సమస్య, వాయు కాలుష్యం వంటివి లేకపోవడానికి కారణం ప్రజా రవాణాకు బస్సులను వాడుకోవడమే. కోటి మంది నివసిస్తున్న లండన్‌లో 16 వేల బస్సులున్నాయి. 80 శాతం డబుల్ డెక్కర్ బస్సులే. లండన్ నగరంలో వ్యక్తిగత వాహనాల రవాణా చాలా తక్కువగా ఉంటుంది. ప్రజా రవాణా సమస్యలు తలెత్తకపోవడానికి మరో కారణం మెట్రో రైలు. లండన్‌లో 1,000 కి.మీల మెట్రో రైలు మార్గం ప్రజలకు అందుబాటులో ఉంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లోనూ ప్రజా రవాణాకు బస్సులను, మెట్రో రైలును ఉపయోగించుకుంటే ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు, వాయు కాలుష్యాన్ని నివారించవచ్చు. అలాగే పర్యాటక రంగంలో రవాణా వ్యవస్థే కీలకం. కాబట్టి దేశంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచి పర్యాటక రంగాభివృద్ధికి దోహదం చేయాలి.




- ముంబై నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి
క్రాంతి మల్లాడి

## సాంకేతికతను వాడుకోండిలా..



రోడ్డుమీద చాలా వాహనాలు భయంకరంగా పొగను విడుదల చేస్తున్నాయి. అసలు వాహన కండీషన్ తెలుసుకోవడం ఎలాగో చాలా మందికి తెలియట్లేదు. మెకానిక్ వద్దకో, సర్వీస్ పాయింట్‌కో వెళ్లాల్సి వస్తున్నది. అలాంటి అవసరం లేకుండా వాహనదారులు సులభంగా తమ వాహన స్థితిగతులను ముఖ్యంగా పెట్రోల్ స్థాయి, అతివేగం, వెహికిల్ లోకేషన్ వంటివి కనిపెట్టేందుకు ఇన్‌టాన్‌గిల్స్ సంస్థ వెహికిల్ హెల్త్ మానిటరింగ్ సిస్టం అనే పరికరాన్ని రూపొందించింది. ఈ పరికరం కేవలం కొత్తగా వస్తున్న బీఎస్ ఫోర్ వాహనాల్లో మాత్రమే అమర్చే విధంగా తయారు చేశారు. వాహనంలో తలెత్తిన సమస్యను తెలుపడంతోపాటు రిపేర్‌కు కావాల్సిన సూచనలనూ అందిస్తుంది. ఈ పరికరం తన సలహాలను ఇన్‌టాన్‌గిల్స్ యాప్ ద్వారా గానీ, మెసేజ్ రూపంలోగానీ వాహనదారులకు తెలియజేస్తుంది. అలాగే వాహనం ప్రయాణానికి సిద్ధంగా ఉందో?.. లేదో?.. తెలుపుతుంది. ఏమైనా లోపాలుంటే వెంటనే తెలియజేస్తుంది. ఏ భాగంలో సమస్య తలెత్తిందో కూడా పసిగడుతుంది. దీంతోపాటు బ్యాటరీ పరిస్థితిని ఎప్పటికప్పుడు చెబుతుంది. వాహన ఇంజిన్‌ను పరిశీలించి సమాచారం అందిస్తుంది. ఎంత ఇంధనం ఉంది, దాంతో ఇంకా ఎంత దూరం ప్రయాణించవచ్చో స్పష్టం చేస్తుంది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ దొంగతనాలనూ త్వరగా గుర్తించవచ్చని తయారీదారులు చెబుతున్నారు. వాహన వేగం మితిమీరితే అలర్ట్ చేస్తుంది. దీంతో ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు. బ్రేకుల పనితీరు, గేర్ వినియోగాలతోపాటు ఎక్కడ్నుంచి ఎక్కడికి ప్రయాణిస్తుందనే సమాచారాన్నీ అందిస్తుంది. వాహనం ప్రస్తుతం ఎక్కడుందో లొకేషన్ గుర్తించి సమాచారాన్ని చేరవేస్తుంది. వాహనంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటికి పరిష్కార మార్గాలనూ చూపడం ఈ పరికరం విశేషం. దూర ప్రయాణాలు చేసేవారికి, పర్యాటక వాహనాలకు, ట్రావెల్స్ నిర్వాహకులకు ఎంతో ఇది ఉపయోగపడుతుంది.

## హైదరాబాద్ ముందడుగు...

దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతాల్లో వాయు కాలుష్యం పెరిగిపోయింది. అయితే హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా విద్యుత్ బస్సులను ప్రజా రవాణా కోసం వినియోగిస్తున్నారు. మున్ముందు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీటి సంఖ్య మరింత పెరుగనుండగా, తగ్గే డీజిల్, పెట్రోల్ ఆధారిత వాహనాలతో వాయు కాలుష్యం అదుపులోకి వస్తుందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నగర పరిధిలో గతేడాది వరకు దాదాపు 30 లక్షల పెట్రో వాహనాలు ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక రోజువారీ ఇతర జిల్లాల నుంచి వచ్చే వాహనాలతో కలుపుకుంటే ఈ సంఖ్య ఇంకా ఎక్కువే. దీంతో నగరంలోనూ వాయు కాలుష్యం పెరుగుతున్నది. హైదరాబాద్‌లో మొదట ప్రయోగాత్మకంగా కేవలం 40 విద్యుత్ బస్సులను కొనుగోలు చేశారు. విద్యుత్ వాహనాలతో ఇంధన ఖర్చును బాగా తగ్గించవచ్చు. అంతేకాకుండా ఇంధనంతో నడిచే బస్సులతో పోలిస్తే ఈ బస్సుల వల్ల శబ్ద కాలుష్యం కూడా చాలా తక్కువే.

## ఉపాధి అవకాశాల్ని మెరుగు పరుస్తాం

- కేంద్రహోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

**శంషాబాద్, జూలై 28:** విదేశాలకు దుస్తుల ఎగుమతి ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని పెంచుకోవడంతోపాటు దేశంలోని రైతులు, నిరుద్యోగులు, వ్యాపారస్తుల ఉపాధి అవకాశాలు మెరుగయ్యే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్-3లో మూడు రోజులపాటు జరిగే బిజినెస్ టు బిజినెస్ గార్మెంట్స్ ఫెయిర్‌ను ఆయన ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ర్టాలకు చెందిన పారిశ్రామికవేత్తలు 150 స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు వచ్చే జనం కోసం నిర్వాహకులు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఉచిత బస్సులు నడుపుతున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మన దేశం.. చైనా నుంచి గార్మెంట్స్ దిగుమతి చేసుకునేదని, నేడు గార్మెంట్స్ తయారీలో భారత్ దూసుకుపోతున్నదని చెప్పారు. గార్మెంట్స్ తయారీదారులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉత్పత్తులు, ధరలను ఉంచాలని సూచించారు. ఇలాంటి ప్రదర్శనలు మరిన్ని ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి, గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జేఎల్ఎల్‌లో 2 వేల ఉద్యోగాలు

### వచ్చే ఏడాది చివరినాటికి నియమించుకోనున్న సంస్థ




**న్యూఢిల్లీ, జూలై 28:** ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. రియల్ ఎస్టేట్ రంగం మందకొడిగా కొనసాగుతున్నప్పటికీ గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.4,000 కోట్ల ఆదాయాన్ని గడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 17 శాతం అధికం. అయినప్పటికీ వచ్చే ఏడాది చివరినాటికి 2 వేల మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ జేఎల్ఎల్‌కు చెందిన సబ్సిడరీ సంస్థే ఈ జేఎల్ఎల్ ఇండియా. 2017-18లో సంస్థ రూ.3,420 కోట్ల ఆదాయాన్ని గడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పది కార్యాలయాల్లో 11,500 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేఎల్ఎల్ ఇండియా సీఈవో రమేష్ నాయర్ మాట్లాడుతూ..దేశీయ కమర్షియల్ రియల్ ఎస్టేట్ రంగంలో డిమాండ్ అనూహ్యంగా పెరుగడం, ముఖ్యంగా ఆఫీస్ స్థలానికి అధిక గిరాకీ ఉన్నదన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 800 మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకున్నట్లు, ఈ ఏడాది చివరినాటికి 12 వేలకు చేరుకోనున్న సంఖ్య...వచ్చే ఏడాది చివరినాటికి 13000-13,500కి చేరుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఇతర కంపెనీలతో పోలిస్తే వలసలు చాలా స్వల్పమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై నాయర్ స్పందిస్తూ.. రెసిడెన్షియల్ విభాగంగా క్రమంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, ముఖ్యంగా అమ్మకాలు, డెలివరీలో ఈ వృద్ధి కనిపిస్తున్నదని, కమర్షియల్ రంగం అంచనాలకుమించి పుంజుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెరా, బినామీ లావాదేవీల చట్టం, జీఎస్టీ వంటి కీలక సంస్కరణలు రియల్ ఎస్టేట్‌పై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

## విస్తరణ బాటలో ఇండిగో

**న్యూఢిల్లీ, జూలై 28:** ఆసియా, ఐరోపా, మధ్య ప్రాచ్య దేశాల్లో దూసుకుపోతున్న దేశీయ ప్రైవేట్ రంగ విమానయాన దిగ్గజం ఇండిగో ఎయిర్‌లైన్స్.. వియత్నాంలోకి అడుగు పెట్టాలని యోచిస్తున్నది. హనోయ్, హో చీ మిన్ వంటి నగరాలకు విమాన సేవలను ప్రారంభించాలని భావిస్తున్నది. ఈ సెప్టెంబర్‌లోగా విమానాలను నడుపాలని ప్రయత్నిస్తున్నట్లు ఇండిగో చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ విలియం బౌల్టర్ తెలిపారు. ఇక చైనాలోని చెంగ్డూతోపాటు సింగపూర్, బ్యాంకాక్, యాంగూన్‌లకూ ఇండిగో సర్వీసులు నడువనున్నాయి. ఢిల్లీ-చెంగ్డూ-ఢిల్లీ నాన్-స్టాప్ సర్వీసు సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమవుతున్నది.

# బేగంపేట రోడ్డుపై వాహనం బీభత్సం



ఆదివారం బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో స్తంభాన్ని, చెట్టును ఢీకొన్న వింగర్ వాహనం

- 'వింగర్' ఢీకొని ట్రాఫిక్ హోంగార్డ్ మృతి
- మరో ఆరుగురు వాహనదారులకు గాయాలు
- డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పిన వాహనం

**బేగంపేట:** ఆదివారం ఉదయం 10.35 గంటల సమయం.. సికింద్రాబాద్-పంజాగుట్ట ప్రధాన రహదారి.. ఓవైపు బోనాల పండుగ ఉత్సవాల్లో స్థానికుల హడావుడి.. మరోవైపు గమ్యస్థానాలకు వెళ్తున్న వాహనదారులు.. ఆ సమయంలో ఒక్కసారిగా ఓ వింగర్ వాహనం అతివేగంగా దూసుకొచ్చింది. రోడ్డుపై వాహనాలను ఢీ కొట్టుకుంటూ వెళ్తూ బీభత్సం సృష్టించింది. రోడ్డుపై విధులు ట్రాఫిక్ హోంగార్డ్‌ను సైతం ఢీకొట్టింది. మరో ఆరుగురు వాహనదారులను గాయాల పాలు చేసింది. రెప్పపాటులో జరిగిన ఈ దుర్ఘటన ఇతర వాహనదారులు, స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అసలేం జరిగిందంటే.. హెచ్ఎస్‌బీసీ బ్యాంకుకు చెందిన వింగర్ వాహనం ఆదివారం ఉదయం సికింద్రాబాద్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్తున్నది. బేగంపేట ప్రకాశ్‌నగర్ అల్మాస్ హోటల్ సమీపానికి రాగానే ఆ వాహన డ్రైవర్ రవికృష్ణకు ఫిట్స్ వచ్చాయి. దీంతో వాహనం అదుపుతప్పి వాహనదారులపైకి దూసుకెళ్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న బేగంపేట ట్రాఫిక్ హోంగార్డ్ ప్రభాకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మరో ఆరుగురు వాహనదారులకు గాయాలయ్యాయి. వీరిని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా హోంగార్డ్ ప్రభాకర్ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మిగతా క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స అనంతరం గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆదివారం బేగంపేటలో వింగర్ వాహనం ఢీకొనడంతో మృతిచెందిన హోంగార్డ్ ప్రభాకర్




కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్ ఎస్కే జోషి, ఐఎంఏ తెలంగాణ శాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి సైంటిస్ట్ ప్రసాద్, 'డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్' నిర్వాహకుడు రఘురాం

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

'డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్' హైదరాబాద్‌శాఖ ప్రారంభోత్సవంలో సీఎస్ జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు పెంచాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్' హైదరాబాద్‌శాఖ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. వైద్యుల ఆధ్వర్యంలో డాక్టర్స్ క్లీన్ ఎయిర్‌ను ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పచ్చనిహారంగా మార్చేందుకు ప్రభుత్వం సైతం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్నదని చెప్పారు. ఇందుకోసం నర్సరీల్లో 100 కోట్ల మొక్కలను పెంచుతున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 83 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా కార్యక్రమాలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో బాధ్యతలను అప్పగిస్తున్నామని, నిర్లక్ష్యం చేసినవారిపై కఠినచర్యలు చేపడుతామని సీఎస్ జోషి స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సైంటిస్ట్ ప్రసాద్, లంగ్స్‌కేర్ ప్రతినిధి అనిల్‌కుమార్, డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్ నిర్వాహకుడు డాక్టర్ పీ రఘురాం తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ నామా నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల జేఏసీ నాయకులు

# ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలపై కేంద్రాన్ని నిలదీయండి

టీఆర్‌ఎస్ ఎంపీ నామాను కోరిన ఉద్యోగుల జేఏసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేషన్‌గా మార్చాలన్న కేంద్ర నిర్ణయాన్ని లోక్‌సభలో నిలదీయాలని సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగ జేఏసీ నాయకులు.. లోక్‌సభ టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆదివారం హైదరాబాద్‌లో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేషన్‌గా చేయాలని నిర్ణయించినట్టు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన దేశ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, ఉద్యోగుల భద్రతకు పెనుముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమస్యపై లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. నామాను కలిసినవారిలో తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు టీ లక్ష్మీనారాయణ, ఓఎఫ్‌సీఈయూ అధ్యక్షుడు ఆర్ ఈశ్వర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎండీ బషీరుద్దీన్, ఓఎఫ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు వై మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బలరాం, ఓఎఫ్ఆర్ఈయూ యూనియన్ అధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజయ్య తదితరులు ఉన్నారు.

# ఎల్బ్రస్ పర్వతంపై తెలుగుతేజం

- 18,510 ఫీట్ల పర్వతాన్ని అధిరోహించిన తుకారాం
- జాతీయ జెండాను ప్రదర్శించిన గిరిజన యువకుడు

**యాచారం:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తక్కళ్లపల్లితండాకు చెందిన ఆంగోతు తుకారాం మరో అరుదైన ఘనత సాధించాడు. ఇటీవలే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు (8,848మీటర్లు) శిఖరాన్ని అధిరోహించిన తుకారాం.. రష్యాలోని 18,510 ఫీట్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని ఆదివారం అధిరోహించి ఔరా అనిపించాడు. పర్వతంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు. తుకారాం విజయపరంపర కొనసాగుతుండటంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఆయన సాహసయాత్రలకు సలాం చేస్తున్నారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకున్న తుకారాం.. ఇప్పటికే దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో, ఆసియాలోని ఎవరెస్టు పర్వతాలను, ఇప్పుడు యూరప్‌లోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించాడు. మిగతా ఆఫ్రికా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, అంటార్కికా ఖండాల్లో ఎత్తైన పర్వతాలను సైతం అధిరోహించడమే తన ధ్యేయమని తెలిపారు. 2016 జూన్ రెండున హిమాచల్‌ప్రదేశ్‌లోని నార్బ్బా (17,145 ఫీట్లు) పర్వతాన్ని అధిరోహించిన 25 మంది సభ్యుల్లో మొదటిస్థానాన్ని సాధించి బెస్టు మౌంటనీర్‌గా గుర్తింపును పొందాడు తుకారాం. 2017 జూన్ రెండున ఉత్తరాఖాండ్‌లోని రుదుగైరా (19,091 ఫీట్లు) పర్వతాన్ని ఎక్కి హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు సంపాదించాడు.



ఎల్బ్రస్ పర్వత శిఖరంపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్న ఆంగోతు తుకారాం

# ములుగులో ఫారెస్ట్ కాలేజీ రెడీ

- ఆధునిక హంగులతో భవనాలు పూర్తి
- వచ్చేనెల నుంచి తరగతులు
- ప్రవేశాలకు ఐదు వరకు అవకాశం
- వచ్చే ఏడాది నుంచి ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ములుగులో ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో నిర్మించిన అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ ప్రారంభానికి సిద్ధమైంది. సంస్థ భవనాల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. దీనిని త్వరలోనే ప్రారంభించడానికి అధికారులు అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం దూలపల్లిలో నిర్వహిస్తున్న ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్ వచ్చేనెలలో నుంచి ములుగులోని విశాల భవనంలోకి మారనున్నది. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ క్యాంపస్‌లో 2016లో తాత్కాలికంగా ప్రారంభమైన బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులో ఇప్పటికే మూడు బ్యాచులు పూర్తయ్యాయి. నాలుగో బ్యాచ్ ప్రవేశాలు మొదలయ్యాయి. కాలేజీలో ప్రవేశాల దరఖాస్తులకు ఆగస్టు ఐదు వరకు అవకాశముందని ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పర్సన్ ఇంచార్జి, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాలలో 14 విశ్వవిద్యాలయాల నుంచి నిపుణులైన ప్రొఫెసర్లు విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఏడాదినుంచి ఎమ్మెస్సీతోపాటు పీహెచ్‌డీ ఫారెస్ట్రీ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.



మానవ అక్రమ రవాణా నుంచి బయటపడినవారికి ఆశ్రయం కల్పించేందుకు ఉద్దేశించిన శిక్షణా మాన్యువల్‌ను విడుదల చేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో కేంద్రమహిళా, శిశు అభివృద్ధిశాఖ సహాయ మంత్రిదేబశ్రీ చౌదరి, సీఎస్ ఎస్కే జోషి

# మానవ అక్రమ రవాణాను ఉపేక్షించం

నిరోధానికి కఠినంగా వ్యవహరిస్తాం: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మానవ అక్రమ రవాణాను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, దీనిని నిరోధించేందుకు కఠినంగా వ్యవహరిస్తామని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. మానవ అక్రమ రవాణా అన్నిదేశాల్లో ఉన్నదని, దీనిని సమిష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక రోజును పురస్కరించుకుని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్చార్డీఐలో ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'వ్యక్తుల అక్రమ రవాణా' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మానవ అక్రమ రవాణకు గురైనవారిని గుర్తించి.. చేరదీసి ఆవాసం కల్పిస్తున్న ప్రజ్వల సంస్థకు అభినందనలు తెలిపారు. ఆ సంస్థకు రూ.2.80 లక్షల విరాళం ప్రకటించారు. చట్టం చేయడంతోనే పని పూర్తవదని, అమలులో కూడా కఠినంగా ఉండాలని అన్నారు. పవిత్ర భారతదేశంలో దురాచారాలను తుడిచేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులను బెదిరించి వ్యభిచారంలోకి దింపుతుండటం సిగ్గుచేటని అన్నారు. మనిషి మైండ్‌సెట్ మారకపోతే ఎన్ని చట్టాలు తెచ్చినా వృథానేనని అన్నారు. సామాజిక పరివర్తన జరుగాలని ఉపరాష్ట్రపతి చెప్పారు. మానవ అక్రమ రవాణా నుంచి బయటపడినవారికి ఆశ్రయం కల్పించే ఆశ్రమ నిర్వహణ శిక్షణా మాన్యువల్‌ను ఆయన విడుదల చేశారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ సహాయ మంత్రి దేబశ్రీ చౌదరి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను చాలా సీరియస్‌గా తీసుకున్నామని చెప్పారు. బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగేలా కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం జగదీశ్వర్, ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీత కృష్ణన్ పాల్గొన్నారు.




## జీర్ణశక్తికి గోధుమలు



ప్రపంచవ్యాప్తంగా చాలా వంటకాల్లో గోధుమపిండిని ఉపయోగిస్తారు. గోధుమలు నిత్యం ఆహారంలో ఉపయోగించడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- గోధుమలతో తయారు చేసే ఆహారపదార్థాలు తేలికగా జీర్ణమవుతాయి. గోధుమల్లోని అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అన్ని వయసుల వారికీ మేలు చేస్తాయి.
- రక్తం శుద్ధి చేసుకోవడానికి ఒక ఉత్తమ మార్గం గోధుమలతో తయారు చేసిన పదార్థాలు. గోధుమ రసం తాగడం వల్ల ఎర్ర రక్తకణాలు అభివృద్ధి చెందుతాయి. దీనిలో బి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి.
- బరువు తగ్గాలనుకునే వారు గోధుమలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. ఈ ఆహార పదార్థాలను రెగ్యులర్ డైట్‌లో చేర్చుకుంటే అధిక క్యాలరీలు తగ్గుతాయి. క్రమంగా బరువు తగ్గుతారు.
- గోధుమలను తరచూ ఆహారంలో తీసుకోవడం వల్ల గుండె బలోపేతమవుతుంది.
- గోధుమల్లో విటమిన్ ఇ, సెలీనియం, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. క్యాన్సర్ నివారిణిలా సహాయపడుతాయి.
- అధిక బ్లడ్ ప్రెజర్ సమస్యతో బాధపడే వారు మైదా రోటీలకు చెక్ పెట్టి గోధుమ పిండితో తయారు చేసే రొట్టెలను తింటే మంచిది.

సక్సెస్ మంత్ర

### పూల వ్యాపారంలో పురోగతి సాధించిన

# నుస్రత్ జహాన్



**నుస్రత్ జహాన్ కంప్యూటర్ గ్రాడ్యుయేట్, ప్రభుత్వ ఉద్యోగి. కానీ, ఆమెకు పూల మొక్కలంటే ఎంతో ఇష్టం. దాని కోసం తన ఉద్యోగాన్ని వదిలేసింది. కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఫ్లోరీ కల్చర్ బిజినెస్ స్టార్ట్ చేసింది. పురుషాధిక్యం ఉండే కశ్మీర్ లో ఒక మహిళ పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకోవడం చాలా కష్టం. కానీ, నుస్రత్ పూల వ్యాపారంలో నిలదొక్కుకున్నది. 'పెటల్స్ అండ్ ఫేర్న్స్' దగ్గర నుంచి కష్మీరి ఎస్సెన్స్ దాక పువ్వుల ఉత్పత్తులే ఆమె బిజినెస్. సాంప్రదాయ ఉత్పత్తులైన కుంకుమ పువ్వు, బాదం, చెర్రి, వాల్ నట్స్, యాపిల్, ఆలివ్, అప్రికాట్ మంచి, హ్యాండ్ మేడ్ సోప్స్, స్కిన్ కేర్, బ్యూటీ ప్రొడక్ట్స్, ఆరోమేటిక్ ఆయిల్స్ అన్నీ ఈమె కంపెనీలో తయారవుతాయి. మనకు నచ్చిన రంగంలో రాణించాలంటున్నది నుస్రత్. వ్యాపారపరంగా ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా వెనుదిరగక విజేతగా నిలిచిన నుస్రత్ జహాన్ ఆరా సక్సెస్‌మంత్ర.**

నుస్రత్‌ది పుల్వామా జిల్లాలోని దదూర గ్రామం. కంప్యూటర్ గ్రాడ్యుయేషన్ చేసి ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించింది. అయితే ఆమె గోల్ అది కాదు. ఆమెకు చిన్నతనం నుంచి కూడా పూలన్నా, పూలమొక్కలన్న ఎంతో ఇష్టం. అందుకే ఎప్పటికైనా పూల వ్యాపారం చేయాలని కలకన్నది. అందుకోసం తాతల నాటి నుండి వస్తున్న ఇంటి పెరడునే వేదిక చేసుకుంది. నుస్రత జమ్ము డెవలప్‌మెంట్ అథారిటీలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా ప్రభుత్వోద్యోగం చేసేది. వ్యాపారానికి అడ్డుగా ఉందని ఉద్యోగానికి రాజీనామా కూడా చేసింది. ఒక శుభముహూర్తాన 'పెటల్స్ అండ్ ఫెర్న్స్' పేరిట బిజినెస్‌కి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో పెద్దగా ఎవరి నుంచీ ఎలాంటి ఆర్థికసాయం అందలేదామెకు. అయినా వెనుదిరగలేదు. ఎన్ని కష్టనష్టాలొచ్చిన అలాగే నిలబడింది. మొండితనమే ఆమెను విజేతగా నిలిపింది. ఇప్పుడు కట్ ఫ్లవర్ బిజినెస్‌కి శ్రీకారం చుట్టి వ్యాపారవేత్తగా ఎదిగింది.



### తొలి అడుగు విజయం వైపు

ఒక వ్యాపారం ప్రారంభించాలంటే మనం ప్రారంభించే వ్యాపారానికి మార్కెట్‌లో డిమాండ్ ఉందో లేదో ముందు గమనించాలి. లేదా మార్కెట్లో ఎలాంటి వ్యాపారానికి డిమాండ్ ఉందో తెలుసుకోవాలి. నుస్రత్ కూడా దాన్నే అనుసరించింది. తను చేయాలనుకుంటున్న పూల వ్యాపారం ఎలా ఉండాలి అనేదానిపై సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో సహజమైన, తాజా పూలు అనుకున్న స్థాయిలో లభించండం లేదన్న విషయాన్ని గుర్తించింది. ఎక్కడ చూసినా కృత్రిమంగా తయారు చేసిన పూలు ఉపయోగించడాన్ని గమనించింది. దీంతో ఫ్లోరికల్చర్ రంగంలోకి అడుగుపెడితే బాగుంటుందని భావించింది. ఆ రంగానికి ఆదరణ ఉంటుందన్న నమ్మకమే ఆమెను ముందుకు నడిపించింది. అలా అప్పటి వరకు కశ్మీర్ లోయలో లేని ఫ్లోరికల్చర్ బిజినెస్‌ను ప్రారంభించింది. అయితే ఇలాంటి పూల వ్యాపారానికి అక్కడి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందలేదు. అయినా నుస్రత ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది. బ్యాంక్‌లో రుణం తీసుకుని వ్యాపారం మొదలుపెట్టింది. ఆమె చేస్తున్న ప్రయత్నాలపట్ల మొదట అంతగా అవగాహన లేకపోయినప్పటికీ తర్వాత్తర్వాత ఆమె కుటుంబం, బంధుమిత్రులు కూడా సహకారం అందించారు. దీంతో ఇక వెనుదిరిగి చూడలేదు. తక్కువ సమయంలోనే మె పూల వ్యాపారం సక్సెస్ అయ్యింది. 'ఆడపిల్లలు తప్పని సరిగా చదువుకోవాలి. నచ్చిన ఉద్యోగం చేయాలి. ఒక వేళ ఉద్యోగం దొరకకపోతే నిరాశ చెందకుండా తమకు నచ్చిన రంగంలో రాణించాలి. స్వయం ఉపాధికి కశ్మీర్లో మహిళలకు అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్నాయి. మనం ఎంచుకున్న రంగంలో ధైర్యంగా సాగితే విజయం మనల్ని వెతుక్కుంటూ వస్తుంది' అంటుంది నుస్రత్.

### కట్టుబాట్లను దాటుకుని

కశ్మీర్ వంటి సమస్యాత్మక రాష్ట్రాల్లో వ్యాపారం అందులోనూ మహిళా వ్యాపారం చేయడం అంటే కత్తిమీదసాములాంటిదే. అందులోనూ ఫ్లోరికల్చర్ రంగంలో ఇక్కడ పూర్తిగా మగవాళ్లదే ఆధిపత్యం. అలాంటి రంగాన్ని నుస్రత్ ఎంచుకోవడమే ఒక సవాల్. నిజానికి నిన్న మొన్నటి వరకు కశ్మీర్‌లో అమ్మాయిలు చదువుకోవడానికి బయటకు వెళ్లడం అంటే సమ్మతించేవారు కాదు. ఇప్పుడిప్పుడే కొంత అవగాహన పెరిగి చదువు విషయంలో ఎలాంటి అభ్యంతరాలు చెప్పడం లేదు. కానీ అమ్మాయి వ్యాపారం చేస్తున్నదంటే ఒప్పుకోవడం చాలా కష్టం. బ్యూటీపార్లర్, బోటిక్ వంటి బిజినెస్‌లు పూర్తిగా ఆడవాళ్లు నిర్వహించేవి కనుక పెద్దగా పట్టించుకోరు. కానీ, మగవారి ప్రమేయం ఉండే ఎలాంటి వ్యాపారాన్ని కశ్మీరీ సమాజం అంగీకరించదు. ఫ్లోరికల్చర్ వ్యాపారంలో నిత్యం మగవాళ్లతో లావాదేవీలు చేయాల్సి ఉంటుంది. అలాంటి వారిని అక్కడి సమాజం భిన్నంగా చూస్తుంది. అయినా నుస్రత్ వేటికీ తలవంచలేదు. కఠినమైన కట్టుబాట్లను కాదని ఏదైతే అదే జరగని అని ముందుకే సాగింది. 'నాకు ఎదురైన అనుభవాలే నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని' అంటున్నది నుస్రత.

### స్వంతంగా పూలతోటలు

2000లో వ్యాపారం ప్రారంభించడానికి ముందు నుస్రత్ ఒక ఫ్లవర్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించింది. ఆమె అనుకున్నదానికంటే ఎక్కువ స్పందన వచ్చింది. కొన్ని ఆర్డర్లు కూడా వచ్చాయి. అప్పటి వరకు నిలువచేసిన పూలు లేదా కృత్రిమ పూలు ఇచ్చే సంస్కృతికి ఆమె టాటా చెప్పి తాజా పూలు ఇచ్చే సంస్కృతిని మొదలు పెట్టింది. దీనిమీదా చాలామందికి అవగాహన లేకపోవడంతో ప్రారంభంలో వ్యాపారం అంతంత మాత్రంగా ఉండేది. అయితే తాజా పూలకు, కృత్రిమ పూలకు తేడా తెలుసుకున్నాక అక్కడి ప్రజలు పూలు కొనడానికి ఆసక్తి కనపరిచారు. దీంతో వ్యాపారం ఊపందుకుంది. ప్రభుత్వం ఎలాంటి సాయం చేయకపోవడంతో నుస్రత ఉద్దెర మీద విదేశాల నుంచి పూలను దిగుమతి చేసుకునేది. అయితే అది ఖర్చుతో కూడుకున్న పని కావడంతో తర్వాత తన ఇంటి పెరడులో పూలమొక్కల పెంపకాన్ని ప్రారంభించింది. 2004లో నుజ్రత 'పెటల్స్ అండ్ ఫెర్న్స్' పేరుతో ఒక ఫ్లవర్ షోరూమ్‌ను ప్రారంభించింది. తన వ్యాపారం పెరుగుతున్న క్రమంలో బీర్వా ప్రాంతంలో పూల మొక్కల పెంపకాన్ని ప్రారంభించింది. రకరకాల పూలమొక్కలు పెంచింది. దీంతో విదేశాల నుంచి పూలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. దిగుమతి ఆపడంతో పాటు తనే స్వయంగా పూల తోటను పెంచుతుండడంతో లాభాలు పెరిగాయి. అంతేకాదు తన పూలతోటలో పూసిన పూలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. ఇప్పుడు నుస్రత్ మూడు పూదోటలు, ఒక రిటైల్ అవుట్‌లెట్ పదిహేను మంది రెగ్యులర్ ఉద్యోగులు, రెండు కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్‌తో కశ్మీర్ లోయలో తన కంటూ ఒక ప్రత్యేక వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది.


### మరో మెట్టు ఎక్కి

పూలవ్యాపారంలో సాధించిన విజయంతో నుస్రత్ సంతృప్తి చెందలేదు. 'కశ్మీరీ ఎసెన్స్' పేరుతో మరో కంపెనీని ప్రారంభించింది. అందులో మొక్కలు నాటడం, వాటిని ఉత్పత్తులుగా మార్చడం వంటివి చేస్తారు. ఇక్కడ సాంప్రదాయ ఉత్పత్తులైన కుంకుమ పువ్వు, బాదాం, చెర్రి, వాల్ నట్స్, యాపిల్, ఆలివ్, అప్రికాట్ మంచి, హ్యాండ్ మేడ్ సోప్స్, స్కిన్ కేర్, బ్యూటీ ప్రొడక్ట్స్, ఆరోమేటిక్ ఆయిల్స్ అన్నీ ఈమె కంపెనీలో తయారవుతాయి.అంతేకాదు కశ్మీర్‌లోని సంస్కృతి, చారిత్రక వారసత్వ సంపదను పెంపొందించడం, వాటిని కాపాడడం వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి 'సెంటర్ కన్జర్వేషన్ ఆఫ్ కల్చర్ అండ్ హెరిటేజ్ ట్రస్టు'ను ప్రారంభించింది. అదే సమయంలో ఆమె మూత్రపిండాలు పాడై కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. అయినా తన వ్యాపారాన్ని మాత్రం విస్మరించలేదు. ఆమె చేసినా, చేస్తున్న సేవలకు గుర్తుగా 'టాటా స్త్రీశక్తి అవార్డు', 'బెస్ట్ బిజినెస్ ఉమెన్' వంటి అవార్డులు వరించాయి.




## మూగజీవాలే ప్రాణంగా!

ఈమెకు మూగజీవాలంటే ప్రాణం. ఇప్పటి వరకు వేలాది జంతువుల ప్రాణాలు కాపాడింది. ఈ క్రమంలో జంతు హక్కుల కార్యకర్తలలో ఒకరిగా నిలిచి.. మూగజీవాలనే కన్నబిడ్డల్లా చూసుకుంటున్నది.



తమిళనాడులో చెన్నైకి చెందిన షిరానీ పెరిరాయకు మూగ జీవాల సంరక్షణకు నడుంకట్టింది. ఇందుకుగల కారణం.. 1932 నుంచి 1995 మధ్యకాలంలో చెన్నైలో 20 వేలకు పైగా కుక్కలు దారుణంగా హతమయ్యాయి. దీంతో ప్రజల్లో జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తూ.. జంతువుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. ఇప్పటి వరకు 800లకు పైగా జీవులను కాపాడి.. వాటి సంరక్షణ బాధ్యతలు చూస్తున్నది షిరానీ పెరారియా. తల్లిగా మారి వాటికి ప్రతిరోజూ కావాల్సిన ఆహారం, వైద్య సదుపాయాలు అందిస్తున్నది. మూగ జీవాలను సంరక్షించడం దేవుడు ఇచ్చిన వరంలా భావిస్తున్నది షిరానీ. 1994లో 'పీపుల్ ఫర్ యానిమల్స్' సంస్థకు సహ వ్యవస్థాపకురాలిగా పనిచేసింది. ఆ సంస్థ ద్వారా వేలాది జంతువులను రక్షించింది. షిరానీకి తోడుగా ఆమె కుటుంబం కూడా జంతువుల సంరక్షణ బాధ్యతలు తీసుకుంటున్నది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన 17 పిల్లులను కాపాడి, వాటి బాధ్యతలు చూసుకుంటున్నాడు ఆమె తమ్ముడు. జీవశాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన షిరానీ 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్' ప్రముఖ పరిశోధకురాలిగా పేరొందింది. చెన్నైలోని రెడ్‌హిల్స్‌లో మూడున్నర ఎకరాల స్థలంలో తన వలంటీర్లతో కలిసి జంతువులను సంరక్షిస్తున్నది. వాటికి షెల్టర్లు కట్టించి, ఆహారం అందిస్తున్నది. ప్రస్తుతం జంతు ప్రయోగ నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది షిరానీ. తన జంతు సంరక్షణాలయంలో ప్రస్తుతం 102 పిల్లులు, 40 మేకలు, 185 పశువులు, 16 పానీస్ (గాడిద-గుర్రంపోలికతో ఉండేవి), 11 రేసు గుర్రాలను సంరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది షిరానీ పెరారియా.

## ముడతల నివారణ ఇలా

చర్మం మీద ముడతలు నివారించడానికి ఖరీదైన క్రీమ్‌లు, లేజర్ ట్రీట్‌మెంట్లు అవసరం లేదు. సమస్య మొదట్లోనే ఈ చిన్న టిప్స్ పాటించి చూస్తే చర్మం తాజాగా మారుతుంది.



- గుడ్డు తెల్లసొనలో కొద్దిగా నిమ్మరసం, చెంచా తేనె కలుపాలి. దీన్ని ముఖం, మెడకు పూతలా పట్టించి, 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. గుడ్డులోని ప్రొటీన్లు చర్మం బిగుతుగా మారేలా చేస్తాయి. నిమ్మరసం కొలాజిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తేనె చర్మానికి తేమనందిస్తుంది.
- 8 బాదాం గింజలను రాత్రి నానబెట్టి.. ఉదయం పచ్చిపాలు పోసి ముద్దలా చేసుకోవాలి. దీన్ని ముఖానికి రాసుకొని అరగంట తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా వారంలో రెండు మూడు సార్లు చేస్తే ముడతలు పెరగకుండా ఉంటాయి.
- బాగా మగ్గిన అరటిపండును గుజ్జులా చేసుకోవాలి. అందులో చెంచా పెరుగు, కొద్దిగా తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని వేడి చేసి ఆ తర్వాత ముఖం, మెడకు పూతలా వేసుకోవాలి. 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే ప్రయోజనం ఉంటుంది.
- ప్రతి రోజు రాత్రి పచ్చిపాలలో దూదిని ముంచి ముఖానికి రాయాలి. ఉదయం లేచిన తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ముఖం నిగారింపు సంతరించుకుంటుంది.

## ట్విట్టర్ మేడమ్

సోషల్ మీడియా ద్వారా ప్రజల ఫిర్యాదులను పోలీసులకు ఇస్తూ.. గంటల వ్యవధిలోనే వారికి పరిష్కారమార్గాలు అందిస్తున్నది ఓ మహిళ. నిమిషాల్లో రక్షణ కల్పిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నది.



జార్ఖండ్‌కు చెందిన సంచిక పాండే 2004లో చదువుకునేందుకు ముంబై వచ్చింది. జర్నలిజం కోర్సు పూర్తి చేసి లోకల్ న్యూస్‌చానెల్లో రిపోర్టర్‌గా చేరింది. విధి నిర్వహణలో ముంబైలో జరిగే నేరకథనాలను గురించి తెలుసుకుంటూ పోలీసు అధికారులతో పరిచయాలు పెంచుకున్నది. కొద్దిరోజుల తర్వాత సంచిక ఓ చానెల్లో ప్రసారమయ్యే 'సత్యమేవ జయతే' అనే కార్యక్రమానికి కథనాలు అందించేందుకు సీనియర్ కరెస్పాండెంట్‌గా చేరింది. బాలీవుడ్ హీరో అమీర్‌ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించే కార్యక్రమం ఇది. ఈ షో ద్వారా సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తుంటారు. క్రైం రిపోర్టర్‌గా పనిచేసిన సంచిక పాండేకు ఉన్న పరిచయాలు ఇక్కడ బాగా పనికొచ్చాయి. రెండునెలల తర్వాత ఆమె 'సత్యమేవ జయతే' కార్యక్రమానికి సంబంధించిన సోషల్ మీడియా ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టింది. అలా సామాజిక మాధ్యమంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సంచిక ఇచ్చే సమాచారంతో బెంగళూరు పోలీసులు ట్విట్టర్ ద్వారా నేరాలను కొంతమేర నియంత్రించగలిగారు. ప్రజలకు అక్కడ వారు సేవలందించే ప్రక్రియను గురించి తెలుసుకున్నది. ఈ విషయాన్ని ముంబై పోలీసు ఉన్నతాధికారులకు తెలిపింది. దీంతో వారు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. సంచికకు కొంతమంది పోలీసు సిబ్బందిని కేటాయించారు. ఫిర్యాదులను స్వీకరించేందుకు సోషల్ మీడియా వేదికను ఏర్పాటు చేసింది. ముంబై నగరం నలుమూలల నుంచి బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ఓ బృందానికి శిక్షణ ఇచ్చింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌ల ద్వారా ఎటువంటి అఘాయిత్యాలు జరిగినా వెంటనే స్పందించేందుకు పోలీసు సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది. అలా సోషల్ మీడియా ద్వారా ముంబైలో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నది సంచిక పాండే. ఇప్పుడు అమెను అందరూ 'ట్విట్టర్ మేడమ్' అని పిలుస్తున్నారు.

## వంటింటి చిట్కాలు



- బ్రెడ్ బజ్జీలు చేసేటప్పుడు ముక్కలకు ఇరువైపుల పెరుగు రాసి, పిండిలో ముంచి నూనెలో వేపాలి. ఇలా చేస్తే బ్రెడ్ ముక్కలు అధికంగా నూనె పీల్చవు.
- పాయసంలో నీళ్లు ఎక్కువైతే శనగపిండిని కలిపితే సరిపోతుంది.
- గోధుమపిండిలో స్పూన్ సోయా పౌడర్, అర స్పూన్ చక్కెర చేర్చుకోవాలి. ఇలా చేస్తే పూరీలు రుచిగా ఉంటాయి.
- ఇడ్లీలకోసం ఉపయోగించే కారం పొడిలో నూనె, నెయ్యికు బదులుగా పెరుగు చేర్చుకుంటే రుచిగా ఉంటుంది.
- సూప్ తయారీకి కార్న్‌ఫ్లోర్ లేకపోతే అటుకుల పొడిని చేర్చుకుంటే సరిపోతుంది.
- అటుకులను వేయించి పొడి చేసి పెట్టుకుంటే.. కట్‌లెట్‌లకు బ్రెడ్ పొడికి బదులు, సూప్‌లో కార్న్‌ఫ్లోర్‌కు బదులు వాడుకోవచ్చు.

## లావుగా ఉంటే పిల్లలు కలగరా?

అడుగండి చెబుతా

**నా వయసు 35 సంవత్సరాలు. మాకు 5 సంవత్సరాల బాబు ఉన్నాడు. తర్వాత పిల్లలు పుట్టడం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. బాబు వయసు ఎక్కువ అవుతుంది. ఇద్దరికీ మధ్య గ్యాప్ చాలా ఉంటుందేమో అనే ఆందోళన ఎక్కువ అవుతున్నది. మా ఆయన లావు ఎక్కువ ఉంటారు. లావు వల్ల సంతాన సమస్య వస్తుందా? డాక్టర్లు లైబిడో సమస్య అన్నారు. అంటే ఏంది? దయచేసి తెలుపగలరు.**

**- ఎస్. రేఖ, హైదరాబాద్**



ఇది జీవనశైలి సమస్య. సంతానం కలుగదు అనే ఆందోళన లోంచి మీరు బయటకు రావాలి. ఒకవేళ మీకు సంతాన సమస్య ఉందనుకుంటే ఇంతకుముందే బాబు పుట్టాడు కదా? సో.. ఐదేండ్లకు, ఇప్పటికీ మీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు వచ్చాయన్నమాట. మీరన్నట్టు మీ వారు అధిక బరువుతో ఉండటం కూడా కారణమే కావచ్చు. ఎక్కువగా టీవీ చూడటం, జంక్‌ఫుడ్ తినడం వల్ల ముందు బద్ధకం పెరుగుతుంది. దీనికి తోడు మద్యం సేవించే అలవాటు ఉంటే ఊబకాయం పెరిగి సంతానోత్పతి సమస్యగా మారుతుంది. మగవారిలో ఈ సమస్య వల్ల లైబిడో తగ్గిపోతుంది. మీకు డాక్టర్ కూడా ఇదే చెప్పారన్నారు కదా? ఒకవేళ ఆడవారిలో ఈ లక్షణాలు ఉంటే శృంగార కోరికలు తగ్గిపోతాయి. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఎపిడమాలజీ ఇటీవల ప్రచురించిన అధ్యయనం ప్రకారం వారానికి 20 గంటల కన్నా ఎక్కువగా టీవీ చూస్తే స్పెర్మ్ కౌంట్ 35% తగ్గిపోతుంది. రోజుకు 5 గంటల కన్నా ఎక్కువ చూస్తే మెల్లిమెల్లిగా శరీరంలో సిస్టోస్టీరాన్ స్థాయి తగ్గి స్పెర్మ్ కౌంట్ తగ్గిపోతుంది. కాబట్టి ఈ పద్ధతిని మార్చుకోండి. మీరు.. మీ వారు శరీర బరువు తగ్గండి. బరువు అనేది డైటింగ్ చేస్తే తగ్గదు. వ్యాయామం చేయాలి. కనీసం వారానికి 4 గంటలు తగ్గకుండా వ్యాయామం చేయడం వల్ల ఊబకాయం తగ్గుతుంది. ఎక్కువగా కొవ్వు పదార్థాలు తినడం వల్ల శరీరంలో పీహెచ్ స్థాయి మారిపోతుంది. ఎక్కువగా కూర్చుని పనిచేయడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఫెర్టిలిటీ స్పెషలిస్ట్‌ను కలిసి మీ సమస్యకు కౌన్సెలింగ్ తీసుకోండి. ఆ తర్వాత మీ జీవనశైలిని మీరే మార్చుకుంటారు.



డాక్టర్ శిల్పారెడ్డి
ఐవీఎఫ్ నిపుణురాలు
ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్
హైదరాబాద్

II.
నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 29 జూలై 2019



వైద్యవిద్య చదవాలనుకుని అందులో సీటు రానివారు బాధపడాల్సిన పని లేదు. ఎందుకంటే వైద్యవిద్యలో ఒక భాగమైన ఫిజియోథెరపీ కోర్సును కూడా చేసి డాక్టర్ కావచ్చు. ప్రస్తుతం మారిన పరిస్థితులవల్ల ప్రతి ఒక్కరిలో ఏదో ఒకవిధంగా ఆరోగ్యం దెబ్బ తిని నొప్పల బారినపడుతుంటారు. ఈ నొప్పలు, ఇతరత్రా అనారోగ్య పరిస్థితులను దూరం చేయడానికి ఫిజియోథెరపిస్టుల అవసరం ఉంది. కాబట్టి ఈ కోర్సు చేసినవారికి కూడా మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ నేపథ్యంలో కోర్సు గురించి వివరాలు మీ కోసం అందిస్తున్నాం.

# ఫిజియోథెరపీ

- హెల్త్‌కేర్ రంగంలో అవకాశాలకు వేదికగా నిలుస్తున్నది ఫిజియోథెరపీ కోర్సు. ఇది వృద్ధులు, ప్రమాదాల్లో గాయపడిన వారు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారికి సేవలందించే ఒక వైద్య విభాగం. ఔషధారిత చికిత్సకు అనుబంధంగా ఉంటుంది.
- ప్రజల జీవనశైలిలో మార్పులవల్ల ఆరోగ్యం దెబ్బతినడం, అనుకోని ప్రమాదాలు జరిగి గాయాపాలు కావడం జరుగుతుంది. దీంతో శరీరం విపరీతమైన నొప్పులకు గురవుతుంది. వీటినుంచి ఉపశమనం పొందడానికి ఫిజియోథెరపీ చాలా ఉపయోగపడుతుంది.
- శారీరక నొప్పులతో బాధపడేవారికి వైద్యం అందించే విధానాలను ఈ కోర్సులో నేర్పుతారు. నొప్పుల బాధలనేవి వృద్ధులకు, రుమటాయిడ్, ఆర్థరైటిస్ వంటి వ్యాధిగ్రస్తులకు వస్తుంటాయి. వీరికి ఆ బాధల నుంచి ఉపశమనం కలిగించేందుకు ఈ ఫిజియోథెరపిస్టుల అవసరం చాలా ఉంది.
- ఇది వైద్యశాస్త్రంలో ఒక భాగం కాబట్టి హ్యూమన్ అనాటమీ, ఫిజియాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, సైకాలజీ, మెడికల్, సర్జికల్ కండిషన్స్, బయోమెకానిక్స్, వైకల్యం నివారణ, పునరావాసం ఇతర అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. కోర్సు పూర్తిచేయడానికి ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ చేయాలి.

## కోర్సులు

- ఫిజియోథెరపీకి సంబంధించి మన రాష్ట్రంలో ఒకేషనల్, బీఎస్సీ (ఫిజియోథెరపీ), బీపీటీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ), పీజీ కోర్సులు ఉన్నాయి. ఇంటర్ స్థాయి ఒకేషనల్ కోర్సుకు అర్హత పదోతరగతి ఉత్తీర్ణత. ఫిజియోథెరపిస్ట్‌గా వైద్యసేవలందించాలంటే డిగ్రీ అవసరం.
- బీఎస్సీ, బీపీటీ కోర్సులు చేయడానికి ఇంటర్‌లో కనీసం 50 శాతం, ఎస్సీ, ఎస్టీలు 45 శాతం మార్కులతో పాసై ఉండాలి. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ మెయిన్ సబ్జెక్టులుగా చదివి, 17 ఏండ్లు నిండి ఉండాలి. ఫిజియోథెరపీలో డిప్లొమా చేసినవారు కూడా బీఎస్సీ, బీపీటీ కోర్సులకు అర్హులు.

## జాబ్ ప్రొఫైల్స్

- **ఫిజియోథెరపిస్ట్:** అనారోగ్యం, గాయం, వైకల్యం, వృద్ధాప్యం ఫలితంగా శారీరక ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు సహాయం చేయడం వీరి పని. వీరు తమ చికిత్సా పద్ధతులను మెరుగుపర్చడం, ఎలక్ట్రోథెరపీ ఉపయోగించి చికిత్సా కార్యక్రమాలను రూపొందించడంతోపాటు సమీక్షిస్తుంటారు. వీరికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వేతనం ఉంటుంది.
- **లెక్చరర్:** డిపార్ట్‌మెంట్ హెడ్ ఎప్పటికప్పుడు కేటాయించిన, సమీక్షించిన ప్రాంతాల్లో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ స్థాయిల్లో బోధించడం వీరి విధి. వీరికి ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వేతనం లభిస్తుంది.
- **రిసర్చర్:** ఫిజియోథెరపీపై పరిశోధనలు చేయడం వీరి విధి. ప్రాజెక్ట్ లక్ష్యాలు, పరిశోధన పద్ధతులను గుర్తించడానికి ఉపయోగించిన పద్ధతులను మెరుగుపరచడానికి సిఫారసులు చేస్తారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వేతనం లభిస్తుంది.
- **ఓస్టియోపాథ్:** రోగులనుబట్టి మర్దన చేయడం వీరి విధి. తాకడం, సాగదీయడం, మసాజ్ చేయడం వంటి అనేక రకాల శారీరక పద్ధతులను ఉపయోగించి శరీరంలోని వివిధ ప్రాంతాలను ఉత్తేజపరచడం ద్వారా చికిత్స చేయడం వీరి బాధ్యత. ఈ పద్ధతుల ద్వారా వీరు శరీరంలోని వివిధ భాగాలకు రక్త ప్రవాహాన్ని పెంచడం, అడ్డుపడే కదలికలను సులభతరం చేస్తారు. వీరికి ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతనం లభిస్తుంది.
- **కన్సల్టెంట్:** వీరు రోగులు వైద్యులను సంప్రదించేందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తారు. వైద్యారోగ్య సదుపాయాలు, ఔషధాలు సమకూరుస్తారు. వీరికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం లభిస్తుంది.

## నైపుణ్యాలు

- సమస్యకు శాస్త్రీయంగా కారణాలు చెప్పడంతోపాటు పరిష్కార మార్గాలను సూచించే నైపుణ్యం ఉండాలి. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. రోగుల పట్ల చిన్నచూపు చూడకూడదు. రోగి శారీరక, మానసిక నొప్పులను అర్థం చేసుకోవడానికి వారిపై సానుభూతి చూపుతూ సహనంతో వ్యవహరించాలి.

## ప్రవేశాలు

- విద్యాసంస్థలు వేర్వేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ద్వారా, మరికొన్ని అకడమిక్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

## కెరీర్

- మన దైనందిన జీవనశైలి కారణంగా ఆధునిక ప్రపంచం వివిధ ఆర్థోపెడిక్, శారీరక రుగ్మతలను ఎదుర్కొంటుంది. ఆ బాధల నుంచి ఉపశమనం కలిగించేందుకు వైద్యానికి అనుబంధంగా ఫిజియోథెరపీ చాలా అవసరం. కాలు, చేయి ఫ్రాక్చర్ అయినప్పుడు, బెణికినప్పుడు చేసే చికిత్సా విధానాల్లో వీరి అవసరం. దీంతో ప్రతి ఆస్పత్రి, ఆరోగ్య సంస్థలు, పలు సేవాసంస్థలు వీరిని రిక్రూట్ చేసుకుంటున్నాయి.
- ఎలక్ట్రోథెరపీ, మాగ్నటోథెరపీ, మసాజ్, దెబ్బతిన్న కండరాల పునరుత్పత్తికి, లిగమెంట్స్, టెండాన్ వంటి సమస్యల పరిష్కారాని ఫిజియోథెరపిస్టులు అత్యవసరం. కానీ దేశంలో డిమాండ్‌కు అనుగుణంగా ఫిజియోథెరపిస్టులు అందుబాటులో లేరు. కాబట్టి ఈ కోర్సు పూర్తిచేసిన వెంటనే ఉపాధి లభిస్తుంది.
- ఈ కోర్సు చేసినవారు సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, మెంటల్ హెల్త్ సెంటర్స్, నర్సింగ్ హోమ్స్, ప్రైవేట్ కేర్ సెంటర్స్, రిహాబిలిటేషన్ సెంటర్స్, స్పోర్ట్స్ క్లినిక్స్, ఫిట్‌నెస్ సెంటర్స్, గవర్నమెంట్ హాస్పిటళ్లలో వీరికి ఉపాధి దొరుకుతుంది.
- రక్షణ శాఖ, ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్లు, ఫిట్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్‌లు, స్పోర్ట్స్ క్లినిక్‌లలోనూ ఫిజియోథెరపిస్టుల అవసరం ఉన్నది. అంతేకాకుండా ఫ్యాకల్టీలు, ప్రొఫెసర్లుగా కూడా చేరొచ్చు.

## ప్రముఖ కాలేజీలు

- రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో బీపీటీ, ఎంపీటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) బీపీటీ, ఎంపీటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్-ముంబై
- **వెబ్‌సైట్:** www.aiipmr.gov.in
- పండిట్ దీన్‌దయాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫిజికటల్లీ హ్యాండీక్యాప్డ్-న్యూఢిల్లీ
- **వెబ్‌సైట్:** www.iphnewdelhi.in
- పోస్టుగ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్-చండీగఢ్
- **వెబ్‌సైట్:** www.pgimer.nic.in
- కేఈఎం హాస్పిటల్ అండ్ సేథ్ జీఎస్ మెడికల్ కాలేజ్-ముంబై
- **వెబ్‌సైట్:** www.kem.edu
- అపోలో హాస్పిటల్-హైదరాబాద్
- క్రిస్టియన్ మెడికల్ కాలేజ్-వెల్లూర్, మద్రాస్ మెడికల్ కాలేజ్-చెన్నై, శ్రీరామచంద్ర యూనివర్సిటీ-చెన్నై, లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజ్-ముంబై, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్-కోల్‌కతా, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్-నాగ్‌పూర్, తాపివాలా నేషనల్ మెడికల్ కాలేజ్-ముంబై, మహారాజాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్-విజయనగరం, బాబా ఫరీద్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్-ఫరీద్‌కోట్, మణిపాల్ యూనివర్సిటీ-మణిపాల్, మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్-నాసిక్, బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ-ఝూన్సీ తదితర కాలేజీలు బీఎస్సీ ఇన్ ఫిజియోథెరపీ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి.

## ఉన్నత విద్య

- బీపీటీ పూర్తయిన తర్వాత పీజీ స్థాయిలో ఎంపీటీ (మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ) చేయవచ్చు. ఈ కోర్సులో కూడా కౌన్సెలింగ్ ద్వారానే ప్రవేశాలు కల్పిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జూలైలో వెలువడే అవకాశం ఉంది. దీని తర్వాత ఆసక్తి ఉంటే పీహెచ్‌డీ కూడా చేయవచ్చు.
- ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, స్పోర్ట్స్, పీడియాట్రిక్స్, కార్డియోపల్మనాలజీ వంటి స్పెషలైజేషన్లతో ఎంపీటీ కోర్సు చేయవచ్చు.

## వేతనాలు

- ప్రైవేట్ రంగంలో అయితే ప్రారంభంలో నెలకు సుమారు రూ.15 వేలు లభిస్తుంది. ఎయిమ్స్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే నెలకు సుమారు రూ.30 వేలు పొందవచ్చు. సీనియర్ ఫిజియోథెరపిస్ట్‌కు రూ.45 వేలు లభిస్తుంది. తర్వాత హోదాను బట్టి వేతనం కూడా పెరుగుతూనే ఉంటుంది.
- అంతేకాదు ఫిజియోథెరపిస్టులకు విదేశాల్లోనూ డిమాండ్ ఉంది. కొన్ని దేశాల్లో ఫిజియోథెరపిస్టుగా పనిచేయాలంటే ఫిజియోథెరపీలో డిగ్రీ చేస్తే రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందవచ్చు. అదే అమెరికా, కెనడా వంటి దేశాల్లో ఫిజియోథెరపిస్ట్‌గా కెరీర్ ప్రారంభించాలంటే ఆ దేశాలు నిర్వహించే నేషనల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

...✍ సత్యం చాపల

# మానవ మేధ + కృత్రిమ మేధ
# చంద్రయాన్-2



మానవ విజ్ఞానపు సరిహద్దులను మరింత విస్తృతపరిచే ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరోసారి విజయవంతంగా ప్రయోగించింది. ప్రపంచంలోనే రెండో అత్యుత్తమ ఉపగ్రహ ప్రయోగ వేదికగా పేరుగాంచిన సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (శ్రీహరికోట, నెల్లూరు) నుంచి చంద్రయాన్-2 ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఒబిడియంట్ బాయ్, నాటీ బాయ్, ఇస్రో బాహుబలిగా వ్యవహరిస్తున్న జీఎస్ఎల్వీ మార్క్-3 వాహకనౌక నుంచి ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. జూలై 22న మధ్యాహ్నం 2.43 గంటలకు చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతమైంది.

## రష్యాతో ఒప్పందం

- చంద్రయాన్-2 ప్రయోగానికి సంబంధించి 2007, నవంబర్ 12న రష్యన్ ఫెడరల్ స్పేస్ ఏజెన్సీ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన అనుమతులను భారత ప్రధాని 2008, సెప్టెంబర్ 18న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మంజూరు చేశారు. చంద్రయాన్-2 నమూనాను 2009, ఆగస్టులో జరిగిన భారత్, రష్యా దేశాల సైంటిస్టుల ఉమ్మడి సమావేశంలో రూపొందించారు.
- ఈ ప్రయోగంలో భాగంగా చంద్రుని చుట్టూ 100 కి.మీ. వృత్తాకార కక్ష్యలో పరిభ్రమించే ఒక ఆర్బిటర్‌ను చంద్రుని మీద దిగేవిధంగా, ఒక ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై సంచరిస్తూ వివిధ ప్రయోగాలను చేపట్టేందుకు ఒక రోవర్‌ను రూపొందించాలని నిర్ణయించారు. సంబంధిత రాకెట్, ఆర్బిటర్, రోవర్‌లను స్వదేశీయంగా అభివృద్ధి చేయాలని, ల్యాండర్‌ను రష్యా సహకారంతో తయారుచేసి 2012లోనే చంద్రయాన్-2 ప్రయోగాన్ని చేపట్టాలని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే సకాలంలో రష్యా తయారీ ల్యాండర్ అందకపోవడంతో, దానినికూడా స్వదేశీయంగానే నిర్మించాలని ఇస్రో నిర్ణయించింది. ఫలితంగా చంద్రయాన్-2 ప్రయోగం వాయిదా పడుతూ వచ్చింది.
- ఇటీవల జూలై 15న ప్రయోగాన్ని నిర్వహించడానికి సిద్ధపడగా ప్రయోగ సమయానికి 56 నిమిషాల ముందు క్రయోజనిక్ ఇంధనాన్ని నింపే సమయంలో కల్పించిన పీడనంలో తేడాను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందం ప్రయోగాన్ని వాయిదావేసింది.
- సుమారు రూ.978 కోట్ల వ్యయంతో రూపొందించిన చంద్రయాన్-2 ప్రయోగంలో వాహకనౌకకు రూ.375 కోట్లు, రూ.603 కోట్లు అంతరిక్ష విభాగంలోని వివిధ ఉపకరణాలు, పేలోడ్‌లకు వెచ్చించారు. భూస్థావర కక్ష్యల్లో కమ్యూనికేషన్ తదితర ఉపగ్రహాలను ప్రవేశపెట్టే జీఎస్ఎల్వీ మార్క్-3 వాహకనౌక చంద్రయాన్-2 పేలోడ్‌లను 170 కి.మీ. పెరీజి (భూమి నుంచి ఉండే కనిష్ఠ దూరం), 39,120 కి.మీ. అపోజీ కలిగిన దీర్ఘవృత్తాకారంలోని భూస్థావర బదిలీ కక్ష్యలోకి విడుదల చేసింది. ఇక్కడి నుంచి చంద్రుని ఆకర్షణ పరిధిలోకి చంద్రయాన్-2 మాడ్యూల్ చేరేవరకు భూ ఆకర్షణ పరిధిలోనే పలు కక్ష్యా పెంపు కార్యక్రమాలను చేపడుతారు. ఇందుకు మాడ్యూల్‌లోని పలు థ్రస్టర్ ఇంజిన్లను దఫదఫాలుగా మండిస్తారు. ఇలా సుమారు 16 రోజులపాటు భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలోనే పరిభ్రమిస్తుంది.
- నిర్ణీత ఎత్తును చేరుకున్న తర్వాత మాడ్యూల్‌ను చంద్రునివైపునకు మళ్లిస్తారు. సుమారు 5 రోజులపాటు ప్రయాణించిన పిమ్మట, చంద్రుని ఎగువ కక్ష్యల నుంచి దిగువ కక్ష్యలకు క్రమక్రమంగా దిగుతూ చంద్రుని ఉపరితలం నుంచి 100 కి.మీ. దూరంలో ఉన్న వృత్తాకార కక్ష్యలో స్థిరంగా తిరగడం ప్రారంభిస్తుంది.
- ఈ దశలోనే ఆర్బిటర్ నుంచి విక్రమ్ అనే ల్యాండ్ విడిపోయి చంద్రుని ఉపరితలం మీదకు దిగేందుకు ఇస్రో సంకేతాలు పంపుతుంది. చంద్రయాన్-2 ప్రయోగంలో విక్రమ్ చంద్రుని మీదకు దిగే దశ అత్యంత కీలకమైనది. చంద్రుని గురుత్వాకర్షణ శక్తి బలహీనమైనది. అక్కడ గాలి లేకపోవడం వల్ల ప్యారాచూట్ల ద్వారా ల్యాండర్ వేగాన్ని నియంత్రించడం సాధ్యపడదు. ఇటీవలే ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రయోగించిన బెరెషీట్ అనే లూనార్ ప్రోబ్ చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ జరిపే క్రమంలో విఫలమై కూలిపోయింది.
- దీన్ని కేప్ కెనవెరాల్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా 2019, ఫిబ్రవరి 22న ప్రయోగించారు. ఏప్రిల్ 11న చంద్రుని ఉపరితలంపై కూలిపోయింది. భూవాతావరణంలోనే చంద్రునిపై పోలిన వాతావరణాన్ని సృష్టించి, పలు ప్రాథమిక పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ సాఫీగా చేరుకోవడానికి అనువైన అల్గారిథమ్‌ను ప్రత్యేక సెన్సార్లను, ల్యాండర్ వేగాన్ని తనకు తానుగా నియంత్రించుకునేందుకు అవసరమైన రాకెట్లను ఇస్రో స్వయంగా అభివృద్ధి చేసింది.
- ఫలితంగా 30 కి.మీ. ఎత్తు నుంచే ల్యాండర్ ఉపరితలంపై దిగేందుకు అనువైన స్థలం ఎంపికతో పాటు, తన వేగాన్ని, కదలికలను నియంత్రించుకునేందుకు అవసరమైన ప్రత్యేక నావిగేషన్, గైడెన్స్, కంట్రోలింగ్ వ్యవస్థలను అమర్చారు. ఇప్పటివరకు కేవలం రష్యా, అమెరికా, చైనాలకు మాత్రమే ఈ దశలో సాఫ్ట్ ల్యాండింగ్ సాధ్యమైంది. అయితే భూమి నుంచి పంపే సంకేతాలు ల్యాండర్‌కు చేరుకునేసరికి కాలయాపన జరిగి మిషన్ చెడిపోయే ప్రమాదం ఉండటంతో ల్యాండర్‌కు కృత్రిమ మేధను ఏర్పాటు చేశారు.
- ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవాన్ని చేరుకోగానే దానిలో నుంచి ప్రజ్ఞాన్ అనే చిన్న రోవర్ కిందకు దిగుతుంది. ఈ విధంగా చంద్రుని చుట్టూ కక్ష్యలో పరిభ్రమించే ఆర్బిటర్, చంద్రుని ఉపరితలంపై దిగే ల్యాండర్, రోవర్‌ల కలయికవల్ల చంద్రయాన్-2ను 'కాంపోజిట్ మాడ్యూల్'గా పరిగణిస్తారు.

## లక్ష్యాలు

- చంద్రయాన్-2 ప్రధాన లక్ష్యాలు చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు అవసరమైన సాంకేతికతను చేజిక్కించుకోవడం, చంద్రునిపై ఉప రోబోటిక్ రోవర్‌ను దిగ్విజయంగా ఆపరేట్ చేయగలగడం ఇవేగాక చంద్రయాన్-1కు కొనసాగింపు కార్యక్రమంగా ఇది సుపరిచితం.
- చంద్రయాన్-2 శాస్త్రీయ లక్ష్యాల్లో చంద్రుని స్థలాకృతి అధ్యయనం, ఖనిజాల అన్వేషణ, మూలకాల సమృద్ధిని పరిశీలించడం, చంద్రుని ఎక్సోస్ఫియర్‌ను పరిశోధించడం, హైడ్రాక్సిల్ అయాన్ల రూపంలో నీటి జాడను, ఘనరూపంలో నీటి ఉనికిని అన్వేషించడం, చంద్రుని త్రిమితీయ చిత్రపటాలను తయారుచేయడం ప్రధానమైనవి.
- ఈ లక్ష్యాల సాధనలో చంద్రయాన్-2లోని పేలోడ్‌లలో పలు పరికరాలను ఇస్రో దేశీయంగా అభివృద్ధిపరిచింది. అవి..
- **ఆర్బిటర్‌లోని పేలోడ్‌లు:** చంద్రయాన్-2 లార్జ్ ఏరియా సాఫ్ట్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్ (CLASS). దీనిని బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్ రూపొందించింది. చంద్రునిపై మెగ్నీషియం, అల్యూమినియం, సిలికాన్, క్యాల్షియం, టైటానియం, ఇనుము, సోడియం మూలకాలను అన్వేషిస్తుంది.
- **టెరైన్ మ్యాపింగ్ కెమెరా-2 (టీఎంసీ-2):** ఇది చంద్రుని ఉపరితలాన్ని చిత్రిస్తుంది. దీన్ని స్పేస్ అప్లికేషన్ సెంటర్ రూపొందించింది.
- **ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోమీటర్ (ఐఐఆర్ఎస్):** దీన్ని ఖనిజాల లభ్యత, నీటి అణువులు, హైడ్రాక్సిల్ అయాన్ల ఉనికిని గుర్తించడానికి స్పేస్ అప్లికేషన్ సెంటర్ అభివృద్ధి చేసింది.
- **సోలార్ ఎక్స్‌రే మానిటర్ (ఎస్ఎక్స్ఎం):** దీన్ని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (అహ్మదాబాద్) రూపొందించింది. చంద్రునిపై ప్రధాన మూలకాల లభ్యతను పరిశీలిస్తుంది.
- **ఆర్బిటర్ హై రిజల్యూషన్ కెమెరా (ఓహెచ్ఆర్సీ):** ఆర్బిటర్ నుంచి ల్యాండర్‌ను సురక్షితంగా చంద్రునిపైకి దింపడం దీని ప్రధాన విధి. దీన్ని స్పేస్ అప్లికేషన్ సెంటర్ రూపొందించింది.
- **చంద్రయాన్-2 అట్మాస్ఫియరిక్ కంపోజిషనల్ ఎక్స్‌ప్లోరర్-2 (ఛేజ్-2):** ఇది ఒక క్వాడ్రపుల్ మాస్ అనలైజర్. దీన్ని స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ (తిరువనంతపురం) రూపొందించింది.
- **డ్యూయల్ ఫ్రీక్వెన్సీ అండ్ ఎస్ బ్యాండ్ సింథటిక్ అపెర్చర్ రాడార్ (డీఎఫ్ఎస్ఏఆర్):** దీన్ని స్పేస్ అప్లికేషన్ సెంటర్ రూపొందించింది. నీటి జాడల అన్వేషణ దీని ప్రధాన విధి.
- **డ్యూయల్ ఫ్రీక్వెన్సీ రేడియో సైన్స్ ఎక్స్‌పెరిమెంట్ (డీఎఫ్ఆర్ఎస్):** చంద్రుని అయనో ఆవరణంలో ఎలక్ట్రాన్ల సాంద్రతను పరిశీలిస్తుంది. దీన్ని తిరువనంతపురంలోని ఎస్పీఎల్ రూపొందించింది.

## విక్రమ్ పేలోడ్స్

- రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్ సెన్సిటివ్ అయనోస్ఫియల్ అండ్ అట్మాస్ఫియర్ (ఆర్ఏఎమ్‌బీహెచ్ఏ): దీన్ని ఎస్పీఎల్ రూపొందించింది. చంద్రుని అయనో ఆవరణం, వాతావరణంలో ప్లాస్మా సాంద్రతను, ఎలక్ట్రాన్ల సాంద్రతను పరిశోధిస్తుంది.
- చంద్రయాన్స్ సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్: చంద్రుని ఉపరితలం నుంచి వివిధ ఉన్నతుల వద్ద ఉష్ణోగ్రత ప్రవణత, ఉష్ణవహనాన్ని పరిశీలిస్తుంది.
- ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సిస్మిక్ యాక్టివిటీ (ఐఎల్ఎస్ఏ): ఇది మాంజినస్-సీ, సింపిలియస్-ఎన్ అనే బిలాల మధ్య చంద్ర కంపాలను (భూకంపాల వంటివి) అధ్యయనం చేస్తుంది. (ఈ బిలాల మధ్యే ల్యాండర్ దిగుతుంది)

## ప్రజ్ఞాన్ పేలోడ్స్

- **ఆల్ఫాపార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్ (ఏపీఎక్స్ఎస్):** ఎక్స్ కిరణాల సాయంతో చంద్రుని ఉపరితలంపై మూలకాల సంఘటనాన్ని పరిశీలిస్తుంది. దీన్ని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (అహ్మదాబాద్) రూపొందించింది.
- **లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (ఎల్ఐబీఎస్):** చంద్రునిపై మూలకాల లభ్యతను పరిశీలించడం. ఇందుకు శక్తిమంతమైన లేజర్ పల్స్‌లను ఉద్గారం చేసి అక్కడ ఇప్లాస్మా నుంచి వెలువడే వికిరణాలను అధ్యయనం చేస్తుంది. దీన్ని బెంగళూరులోని ల్యాబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్ సిస్టమ్స్ రూపొందించింది.
- వీటితోపాటు నాసా రూపొందించిన లేజర్ రెక్టోరిఫ్లెక్టర్ అర్రే (ఎల్ఆర్ఏ)ను విక్రమ్‌లో పొందుపరిచారు. ఇది మాత్రమే చంద్రయాన్-2లో విదేశీ పేలోడ్. దీన్ని ప్రయోగ సమయానికి నెల ముందుగా నాసా అందించింది. భూమికి చంద్రునికి మధ్య దూరాన్ని కచ్చితంగా గణించడానికి ఇది ఉపయోగపడుతుంది.


## జీఎస్ఎల్వీ మార్క్-3

- దీన్ని లాంచ్ వెహికిల్ మార్క్-3 (ఎల్వీఎం-3)గానూ పరిగణిస్తారు. ఇది మూడంచెలు కలిగిన ఉపగ్రహ ప్రయోగనౌక. ఇందులో మొదటి అంచెలో 200 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించే ఎస్-200 రాకెట్ బూస్టర్లను, రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించే ఎల్ 110 బూస్టర్ రాకెట్లను, అత్యంత కీలకమైన మూడో దశ/క్రయోజనిక్ ఎగువదశలో 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించే సీ-25 ఇంజిన్‌ను వినియోగించారు. మొదటి దశలో ఘనస్థితిలోని హైడ్రాక్సిల్ టర్మినేటెడ్ పాలి బ్యూటడైన్ (హెచ్‌డీపీబీ), రెండో దశలో మోనోమిథైల్ హైడ్రజీన్ (ఎంఎంహెచ్), మూడో దశలో ద్రవ హైడ్రోజన్‌ను ఇంధనంగా, ద్రవ ఆక్సిజన్‌ను ఆక్సిడైజర్‌గా వినియోగిస్తారు.

### జీఎస్ఎల్వీ మార్క్-3 చరిత్ర

| | | |
|---|---|---|
| 1. ఎల్వీఎం-3/కేర్ మిషన్ | 2014, డిసెంబర్ 18 | క్రూమాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీ-ఎంట్రీ ఎక్స్‌పెరిమెంట్ |
| 2. జీఎస్ఎల్వీ ఎంకే3-డీ2 | 2017, జూన్ 5 | జీశాట్-19 |
| 3. జీఎస్ఎల్వీ మార్క్ 3-డీ2 | 2018, నవంబర్ 14 | జీశాట్-29 |
| 4. జీఎస్ఎల్వీ మార్క్ 3-ఎం1 | 2019, జూలై 22 | చంద్రయాన్-2 |

- జీఎస్ఎల్వీ మార్క్-3 ద్వారా 4000 కిలోల బరువైన ఉపగ్రహాలను భూస్థావర బదిలీ కక్ష్యల్లోకి, 8000-10000 కిలోల బరువైన ఉపగ్రహాలను భూ దిగువ కక్ష్య (ఎల్ఈఓ)ల్లోకి ప్రయోగించవచ్చు.
- 43.43 మీ. ఎత్తయిన జీఎస్ఎల్వీ మార్క్-3 నౌక ప్రయోగ సమయంలో 640 టన్నుల బరువు ఉంటుంది. దీన్ని భవిష్యత్తులో చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష కార్యక్రమాల్లోనూ వినియోగించనున్నారు. ప్రారంభంలో రష్యా సహకారంతో వారు అందించిన క్రయోజనిక్ ఇంజిన్ల ఆధారంగా జీఎస్ఎల్వీ మార్క్-1 వాహక నౌకలను అభివృద్ధిపరిచారు. తదనంతర పరిణామాల కారణంగా, రష్యా క్రయోజనిక్ పరిజ్ఞానాన్ని అందించకపోవడంతో భారత్ సొంతంగానే అభివృద్ధి చేసుకుని జీఎస్ఎల్వీ మార్క్-2, మార్క్-3 నౌకలను అభివృద్ధి పరచుకుంది.



ఆదె సత్యనారాయణ
విషయ నిపుణులు
9573469343

నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 29 జూలై 2019



# గేమ్ డిజైనింగ్ లైఫ్

**అతను నవరత్న హోదా కలిగిన కేంద్రప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగి, ఒక కార్మిక సంఘం నేత. తన దైనందిన కార్యక్రమాలతో నిత్యం తీరికలేకుండా ఉంటాడు. అయినా వీడియో గేమ్ అంటే చాలు... చిన్న పెద్ద అని వయసుతో సంబంధం లేకుండా వారితో కలిసి ఆటలో మునిగిపోతాడు. మరొకరు ఒక మీడియా సంస్థలో ఉద్యోగి. ఉదయం నుంచి సాయంత్రం దాకా వార్తలు, స్టోరీలు, తప్పొప్పులు అంటూ కంప్యూటర్‌తో కుస్తీ పడుతుంటాడు. కాస్త ఒత్తిడి అనిపించినా ఫోన్‌లో క్యాండీక్రష్, క్రికెట్ వంటి గేమ్స్‌తో రిలాక్స్ అవుతుంటాడు. ఇలా టెంపుల్ రన్, క్యాండీక్రష్, సూపర్ మారియో, పబ్జీ, గ్రాండ్ థెఫ్ట్ ఆటో, ఫుట్‌బాల్ వంటి ఆన్‌లైన్ గేమ్స్‌తో గంటల కొద్ది సమయం స్క్రీన్‌కే అంటిపెట్టుకుని ఉండే వారు చాలా మందే ఉన్నారు. వాటిలో క్యారెక్టర్స్‌ను తాము ఓన్ చేసుకుని ఇతరులతో పోట్లాడే సందర్భాలన్నో. ఇలాంటి వీడియో గేమ్‌లను రూపొందించడం ఇప్పుడు మంచి కెరీర్ అవకాశంగా మారింది. దీంతో పలు విద్యాసంస్థలు వీడియో గేమ్ డిజైన్, డెవలప్‌మెంట్‌లో కోర్సులను అందిస్తున్నాయి. వాటికి సంబంధించిన వివరాలు..**

- సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిచెందుతున్నకొద్ది నూతన సాంకే తిక పద్ధతులతో కూడిన గేమ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. గేమ్స్‌ను సరదాకోసం కాకుండా కొత్త విషయాలు నేర్చుకోవడా నికి, విద్యార్థులకు సులభంగా అర్థమవడానికి పాఠ్యాంశాల్లో భాగంగా, బ్యాంకింగ్, మార్కెటింగ్ రంగాల్లో కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా భారత్‌తోపాటు చాలా దేశాల ఆర్థికవ్యవస్థల అభివృద్ధికి గేమింగ్ పరిశ్రమ తోడ్పడుతున్నది. ఆధునిక పరిజ్ఞానంతో మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు అందుబాటులోకి రావడంతో వీడియో గేమ్స్ ఆడేవారి సంఖ్య నానాటికి పెరుగుతూ వస్తున్నది. దీంతో కొత్త తరహాలో గేమ్స్‌ను రూపొందించే నిపుణుల కోసం గేమింగ్ కంపెనీలు చూస్తున్నా యి. ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉండే ఈ రంగంలోకి ప్రవేశించాలనుకునేవారికి గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సు చక్కని వేదికగా నిలుస్తుంది.
- ఒక గేమ్‌ను డెవలప్ చేయడం లేదా రూపొందించడం సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందులో అనేక విభాగాలకు చెందిన నిపుణులు ఉంటారు. వాటిలో గేమ్ డిజైనింగ్, గేమ్ డెవలప్‌మెంట్‌లు ముఖ్యమైనవి. అన్ని విభాగాలవారు కలిసి పనిచేసినప్పుడే వీడియో గేమ్ ఒక స్పష్టమైన రూపు సంతరించుకుంటుంది.
- గేమ్‌ను రూపొందించడంలో ప్రాథమిక దశ గేమ్ డిజైనింగ్. ఇక్కడ గేమ్‌ను ఎలా రూపొందించాలి, దానికి ఎలాంటి అంశాలను జోడించాలనే విషయాలను నిర్ణయిస్తారు.



- గేమ్‌ను డెవలప్‌మెంట్ చేసేటప్పుడు గేమ్ డిజైనర్ల ఆలోచనలు వాస్తవ రూపం లోకి వస్తాయి. మనం తెరపై చూసే పూర్తిస్థాయి వీడియో గేమ్‌లు ఈ దశలో రూపొందుతాయి.
- కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ లేదా దానికి అనుబంధంగా ఉండే కోర్సులు చేస్తే చాలు, గేమ్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక పరిజ్ఞానం కానీ, వేరుగా ఎలాం టి కోర్సులు చేయాల్సిన అవసరం కానీ లేదని చాలా మంది అనుకుంటారు. కానీ ఒక వీడియో గేమ్‌ను సృష్టించాలంటే కొన్ని లైన్ల కోడ్ రాసి, క్రియేటివ్ గ్రాఫిక్స్ వాడితే సరిపోదు. దానికి సృజనాత్మకత, సహజత్వం, సమయం అవసరమవుతుంది. అలాగే కంప్యూటర్ సైన్స్, ప్రోగ్రామింగ్, క్రియేటివ్ రైటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్ వంటి పలు విభాగాల సమిష్టి కృషి, పరిజ్ఞానం అవసరమవుతుంది. గేమ్‌కు సంబంధించిన ఒక కథను ఊహించుకుని, దానికి రూపం ఇవ్వడానికి అందులో ఎలాంటి పాత్రలు, వాటికి నియమాలు, మాటలు, అందులో ఎలాంటి పరిసరాలు ఉండాలనే విషయాలపై అవగాహన ఉండాలి. దీంతో పాటు రచయితగా, నటుడిగా, ప్రోగ్రామర్‌గా ఆలోచించే నైపుణ్యం అవసరమవుతుంది. అందువల్ల గేమ్ డిజైన్, డెవలప్‌మెంట్‌ను కెరీర్‌గా మలుచుకోవాలనుకునే వారు ప్రొఫెషనల్ కోర్సులను ఎంచుకోవాలి. ఇది వారు వివిధ నైపుణ్యాలను నేర్చుకోవడానికి సహాయపడుతుంది. వాటిని సృజనాత్మక పద్ధతుల్లో ఎలా ఉపయోగించాలో తెలుపుతుంది.
- కోర్సుల్లో భాగంగా ఒక ఆలోచనను గేమ్ ప్రతిపాదిత రూపంలో ప్రదర్శించడం, దానికి అవసరమైన కాన్సెప్ట్, గేమ్ ప్లే, ఫీచర్స్, సెట్టింగ్, కథ, ఎవరిని దృష్టిలో పెట్టుకొని గేమ్‌ను తయారు చేస్తున్నాం, గేమ్ రూపొందించడానికి అయ్యే ఖర్చు వంటివి అంచనా వేయడం, గేమ్‌కు స్క్రిప్ట్ రాయడం, గేమ్‌లో ఏయే లొకేషన్లు ఉండాలి, డిజైనింగ్ ఎలా చేయాలి వంటి విషయాలను తెలుసుకోవచ్చు.
- ఈ కోర్సు ఆబ్జెక్ట్ ఓరియంట్ డిజైన్‌ను ఉపయోగించి గేమ్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, లాజిక్ బిల్డింగ్ సూత్రాలపై దృష్టిపెడుతుంది. ఇది విద్యార్థులు తమ ఆలోచనలకు నిజ రూపం ఇవ్వడానికి తోడ్పడుతుంది. అదేవిధంగా గేమ్ ఇంజిన్‌కు అనుకూలంగా త్రీడీ (3D) అసెట్స్‌ను మలుచుకోవడం, వాటిని అందులోకి తీసుకెళ్లడం ఎలా అనే విషయాలను తెలుసుకోవచ్చు.

## ఎక్కడ చేయవచ్చు..

- కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లలో ఆడే వీడియో గేమ్స్‌ను మనమే సొంతంగా డిజైన్ చేసుకుంటే ఎలా ఉంటుంది.. ఎక్కువ మంది ఆడే టెంపుల్ రన్, డోటా, ఫిఫా, నీడ్ ఫర్ స్పీడ్ (ఎన్ఎఫ్ఎస్), హాలో, కౌంటర్ స్ట్రయిక్, గ్రాండ్ థెఫ్ట్ ఆటో వంటి వీడియో గేమ్‌లు వ్యక్తిత్వాన్ని తెలుపుతాయి. వీడియో గేమ్‌ను ఎంజాయ్ చేసేవారు తమ కెరీర్‌గా గేమింగ్ డిజైన్ రంగాన్ని ఎంచుకోవచ్చు. అందుకు గేమింగ్‌పై ఆసక్తి, అభిరుచి, సృజనాత్మకత, ఊహాశక్తి, సాఫ్ట్‌వేర్, గేమ్ ప్లే థియరీపై అవగాహన, భిన్నంగా ఆలోచించే తత్వం, మార్కెట్‌లోకి వచ్చే గేమ్స్‌పై మంచి అవగాహన ఉండాలి. ఇలాంటి వారికోసం దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలు గేమింగ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌లో డిప్లొమా, బ్యాచిలర్, పీజీ, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి.
- జేఎన్ఏఎఫ్ఏయూ (హైదరాబాద్), ఇండియన్ స్కూల్ ఆఫ్ డిజైన్ అండ్ ఇన్నోవేషన్ (హైదరాబాద్, ముంబై, పుణె, ఢిల్లీ), ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గేమింగ్ అండ్ యానిమేషన్ (బెంగళూరు), గ్లోబల్ స్కూల్ ఆఫ్ యానిమేషన్ అండ్ గేమ్స్ (ఢిల్లీ), భారతీయ విద్యాపీఠ్ యూనివర్సిటీ (పుణె), జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ ఆర్ట్స్ (బెంగళూరు), గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గేమింగ్ అండ్ యానిమేషన్ (చెన్నై), అకాడమీ ఆఫ్ యానిమేషన్ అండ్ గేమింగ్ (నోయిడా), జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా ఆర్ట్స్ (ముంబై), డీఎస్‌కే సుప్ఇన్ఫోగేమ్ (పుణె), సీమ్‌లెస్ ఎడ్యుకేషన్ అకాడమీ, మాయా అకాడమీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సినిమాటిక్ (ముంబై) ఈ కోర్సులను అందిస్తున్నాయి. వీటిలో కొన్ని ప్రవేశపరీక్షల ద్వారా, మరికొన్ని నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.
- ఇంటర్ పూర్తి చేసినవారు ఈ కోర్సులు చేయవచ్చు.



## కోర్సులు

- **డిగ్రీ స్థాయిలో** బీఎస్సీ గేమింగ్, యానిమేషన్ గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, గ్రాఫిక్స్–యానిమేషన్ అండ్ గేమింగ్, బ్యాచిలర్స్ ఇన్ మీడియా యానిమేషన్ అండ్ డిజైన్, బీఎఫ్ఏ, బీడిజైన్ (గేమ్ డిజైనింగ్), బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్), బీఏ యానిమేషన్ అండ్ కంప్యూటర్ గ్రాఫిక్స్, డిజిటల్ ఫిల్మ్‌మేకింగ్ అండ్ యానిమేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- **పీజీ స్థాయిలో..** ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (మల్టీమీడియా అండ్ యానిమేషన్ విత్ గేమ్ ఆర్ట్ అండ్ డిజైన్), ఎంఎస్సీ (గేమింగ్, గేమ్ డిజైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, మల్టీమీడియా అండ్ యానిమేషన్), ఎండిజైన్ (డిజిటల్ గేమ్ డిజైన్) కోర్సులు
- **డిప్లొమాలో** గేమ్ డిజైన్ అండ్ ఇంటిగ్రేషన్, డిప్లొమా ఇన్ యానిమేషన్, గేమింగ్ అండ్ స్పెషల్ ఎఫెక్ట్స్, డిప్లొమా ఇన్ గేమ్ డెవలప్‌మెంట్, డిప్లొమా ఇన్ గేమ్ ప్రోగ్రామింగ్, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ గేమ్ ఆర్ట్, డిప్లొమా ఇన్ గేమ్ డిజైన్ (డీజీడీ) మొదలైన కోర్సులు ఉన్నాయి.

## ఉద్యోగ అవకాశాలు

- దేశంలో గేమింగ్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్నది. దీంతో అంతర్జాతీయ యానిమేషన్ కంపెనీలు భారత్‌లో పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతోపాటు ఇంటర్‌నెట్, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వీడియో గేమ్‌లు ఆడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ప్రముఖ సంస్థ గూగుల్ నివేదిక ప్రకారం 2021 నాటికి దేశంలో వీరి సంఖ్య వంద కోట్లకు చేరుకోనుంది. ఇదే గేమ్ డిజైన్, డెవలపర్లకు అవకాశాలను సృష్టిస్తుంది.
- ఈ కోర్సులు పూర్తి చేసినవారిని గేమ్ డిజైనర్, లీడ్ డిజైనర్, 2D లేదా 3D యానిమేటర్ లేదా మోడలర్, లెవల్ డిజైనర్, ఆర్ట్ డిజైనర్, వరల్డ్ డిజైనర్, సిస్టమ్ డిజైనర్, కంటెంట్ డిజైనర్, క్యారెక్టర్ డిజైనర్, కాన్సెప్ట్ ఆర్టిస్ట్, గేమ్ ఆర్టిస్ట్, టెక్చర్ ఆర్టిస్ట్, క్యారెక్టర్ యానిమేటర్, ఎఫెక్ట్స్ యానిమేటర్, టూల్ డెవలపర్, గేమ్ టెస్టర్, గేమ్ రైటర్, గేమ్ ప్లే ప్రోగ్రామర్, వీడియోగేమ్ టెస్టర్, క్రియేటివ్ డైరెక్టర్, స్క్రిప్ట్ రైటర్ వంటి వివిధ హోదాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వీరిని సోనీ ఎంటర్‌టైన్‌మెంట్, నింటెండో, 2పీఐ ఇంటరాక్టివ్, 99 గేమ్స్, ఎలక్ట్రానిక్ ఆర్ట్స్, టీసీఎస్, Ubisoft, రాక్‌స్టార్ గేమ్స్, టెక్నికలర్, ఎలక్ట్రానిక్ ఆర్ట్స్, టెక్‌ట్రీ, వంటి కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. డిజిటల్ చాకోలెట్, జింగ్, గేమ్స్ టూ విన్, హాష్ టాగ్ మొదలైన గేమింగ్ కంపెనీలు ఎక్కువగా నియమించుకుంటున్నాయి.
- కంప్యూటర్ సైన్స్, ప్రోగ్రామింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, యానిమేషన్, సౌండ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం ఉన్నవారికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

**... గణేష్ సుంకరి**

# ప్రతిభకు పట్టం ఎన్‌టీఎస్‌ఈ



**దేశంలో ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులున్నారు. వారికి ఉన్నత చదువులు చదవాలన్న కాంక్ష ఉన్నా సరైన ఆర్థికవనరులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి విద్యార్థులకు ప్రేరణ కలిగించడానికి, ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఏటా పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే నేషనల్ టాలెంట్ సెర్చ్ స్కీం (ఎన్‌టీఎస్‌ఈ) పరీక్ష ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఆ పరీక్ష విధానం, స్కాలర్‌షిప్‌కు ఎంపికచేసే పద్ధతి, స్కాలర్‌షిప్ కింద ఇచ్చే ఆర్థిక సహాయం వివరాలు నిపుణ పాఠకుల కోసం...**

- **ఎన్‌టీఎస్‌ఈ:** దేశంలో పాఠశాల విద్యావిధానాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కేంద్రం పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి 1963లో నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ స్కీం (ఎన్ఎస్‌టీఎస్ఎస్) ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ పరీక్షలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించేవారు. మొదటి ఏడాది ఈ స్కీంను ఢిల్లీలో ప్రారంభించారు. తొమ్మిదో తరగతి చదివే పదిమంది విద్యార్థులకు ఈ స్కీం కింద స్కాలర్‌షిప్స్‌ను అందిచారు. 1964 నుంచి దేశంలోని అన్ని రాష్ర్టాలకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ స్కీంను కేంద్రం అమలు చేసింది. మొదట్లో రాతపరీక్ష, ప్రాజెక్టు రిపోర్టు, ఇంటర్వ్యూ ఆధారంగా విద్యార్థులను స్కాలర్‌షిప్ కోసం ఎంపిక చేసేవారు. కేవలం సైన్స్ విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్స్ ఇచ్చే ఈ స్కీంలో 1976 నుంచి సోషల్ సైన్సెస్ విద్యార్థులకు ఇవ్వడం ప్రారంభించారు. ఈ స్కీంను నేషనల్ టాలెంట్ సెర్చ్ స్కీం (ఎన్‌టీఎస్ఎస్)గా పిలిచేవారు. కాలాంతరంలో విద్యావ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరుతుండటంతో ఈ స్కీంను విస్తరించారు. 1985లో ఈ స్కీంలో పలు మార్పులుచేశారు. స్కాలర్‌షిప్‌ల సంఖ్యను పెంచారు. కేవలం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అర్హులు. రెండంచెల విధానంలో ఈ పరీక్షను నిర్వహించడం ప్రారంభించారు. స్టేట్‌లెవల్, నేషనల్ లెవల్‌లో రెండుదశల్లో పరీక్షను నిర్వహిస్తున్నారు. మధ్యలో కొన్ని ఏండ్లు 8,9వ తరగతి విద్యార్థులకు ఈ స్కీంను వర్తింపచేసినా తిరిగి 2008 నుంచి కేవలం పదోతరగతి వారికి మాత్రమే దీన్ని అమలు చేస్తున్నారు. ఈ స్కీంను ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహిస్తుంది.

## పరీక్ష విధానం

- ఈ పరీక్ష రెండు దశల్లో జరుగుతుంది.
- మొదటి దశ రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారు.
- మొదటి దశలో అర్హత సాధించిన విద్యార్థులను రెండోదశకు ఎంపిక చేస్తారు.
- ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న ఎస్‌సీఈఆర్‌టీఈలు ఈ పరీక్షను నిర్వహిస్తాయి.
- మొదటి దశలో అర్హత సాధించిన వారికి రెండోదశ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీఈ దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

## మొదటి దశ (రాష్ట్రస్థాయి)

- దీనిలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 మెంటల్ ఎబిలిటీ టెస్ట్– మ్యాట్(ఎంఏటీ), పార్ట్–2 స్కోలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎస్ఏటీ).
- మ్యాట్ 100 మార్కులకు నిర్వహిస్తారు. 120 నిమిషాల కాలవ్యవధి.
- ఈ పరీక్షను నవంబర్ మొదటి ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 వరకు నిర్వహిస్తారు.
- పేపర్–2 (శాట్)ను మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 వరకు నిర్వహిస్తారు.
- 100 ప్రశ్నలు, 120 నిమిషాల కాలవ్యవధి.
- సైన్స్–40, మ్యాథ్స్–20, సోషల్‌సైన్సెస్–40 ప్రశ్నలు ఇస్తారు.

**నోట్:** రాష్ట్రస్థాయి పరీక్షలో జనరల్, ఓబీసీలకు 40 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు 40 శాతం మార్కులు అర్హతగా నిర్ణయించారు.

- నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు. మ్యాట్, శాట్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన రెండోదశ ఎంపిక జరుగుతుంది.
- మొదటి దశ పరీక్ష ఫలితాలను జనవరి/ఫిబ్రవరిలో ప్రకటిస్తారు. రెండోదశ పరీక్ష తేదీలను ఎన్‌సీఈఆర్‌టీఈ తర్వాత ప్రకటిస్తుంది.

**స్కాలర్‌షిప్ వివరాలు**

| దశ | స్కాలర్‌షిప్ మొత్తం (నెలకు రూ.) |
| --- | --- |
| హయ్యర్ సెకండరీ లెవల్ | 1250 |
| గ్రాడ్యుయేట్, పీజీ | 2000 |
| పీహెచ్‌డీ (నాలుగేండ్లు) | యూజీసీ నిబంధనల ప్రకారం |

## రెండోదశ పరీక్ష

- దీనికి ఎటువంటి ఫీజు లేదు.
- ఈ పరీక్షను మే రెండో ఆదివారం నిర్వహిస్తారు.
- పరీక్షలో 9, 10 తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలను ఇస్తారు.
- రెండోదశ పరీక్షలో మ్యాట్, శాట్ ఉంటాయి.
- మ్యాట్‌లో 100 ప్రశ్నలు, 100 మార్కులు. 120 నిమిషాల కాలవ్యవధి.
- శాట్‌లో 100 ప్రశ్నలు, 100 మార్కులు, 120 నిమిషాల కాలవ్యవధి.
- ఈ పరీక్షలో కూడా నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు. మ్యాట్, శాట్‌లలో అర్హత సాధించిన వారిని మెరిట్ ఆధారంగా ఎన్‌టీఎస్‌ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు.

## పరీక్ష రాయడానికి ఎవరు అర్హులు ?

- కేవీ, నవోదయ, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్నవారు అర్హులు. ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యను అభ్యసిస్తున్నవారు కూడా అర్హులే. 2019, జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18 ఏండ్లు మించరాదు. మొదటిసారి పదోతరగతి పరీక్షకు హాజరుకానున్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

## దరఖాస్తు విధానం

- ఆయా రాష్ర్టాలు/కేంద్రపాలిత ప్రాంతాలలోని లైజన్ ఆఫీసర్లు ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తారు. ఆ ప్రకటనలో తెలిపిన విధంగా దరఖాస్తును పూర్తి చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో సంబంధిత అధికారికి పంపాలి.
- పూర్తి వెబ్‌సైట్: www.ncert.nic.in

**... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ**

## సుడోకు

**డైలీ సుడోకు 105 సమాధానం**

| | | | | | | | | |
| --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- |
| 8 | 6 | 5 | 1 | 3 | 2 | 9 | 7 | 4 |
| 4 | 9 | 3 | 8 | 6 | 7 | 5 | 2 | 1 |
| 1 | 7 | 2 | 5 | 9 | 4 | 6 | 8 | 3 |
| 3 | 5 | 6 | 2 | 7 | 8 | 1 | 4 | 9 |
| 2 | 1 | 7 | 9 | 4 | 5 | 3 | 6 | 8 |
| 9 | 4 | 8 | 6 | 1 | 3 | 7 | 5 | 2 |
| 7 | 8 | 1 | 3 | 2 | 6 | 4 | 9 | 5 |
| 5 | 3 | 4 | 7 | 8 | 9 | 2 | 1 | 6 |
| 6 | 2 | 9 | 4 | 5 | 1 | 8 | 3 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -106**

| | | | | | | | | |
| --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- |
| 9 | | 3 | 4 | | | 6 | | 1 |
| | | | 7 | | | 8 | 5 | 3 |
| | | | 6 | | 8 | | | 9 |
| | 5 | | | | 3 | 9 | | 2 |
| | | 9 | 8 | | 7 | 1 | | |
| 2 | | 8 | 5 | | | | 3 | |
| 8 | | | 2 | | 4 | | | |
| 5 | 2 | 4 | | | 6 | | | |
| 7 | | 6 | | | 5 | 4 | | 8 |

'బీటెక్ పూర్తిచేసిన గుణ అనే యువకుడు ఖైదీగా మారడానికి కారణమేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. మనం చేసే తప్పుల వల్ల మన జీవితానికి ఏం జరిగినా ఫర్వాలేదు కానీ పక్కనోడికి మాత్రం ఎలాంటి హాని జరగకూడదనే కథాంశంతో సినిమాను రూపొందించాను' అని అన్నారు అర్జున్ జంధ్యాల. ఆయన దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'గుణ 369'. కార్తికేయ, అనఘ జంటగా నటించారు. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మాతలు. ఆగస్ట్ 2న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో అర్జున్ జంధ్యాల పాత్రికేయులతో ముచ్చటించారు..

# బాధ్యతలు భయపెడితే..


అర్జున్ జంధ్యాల

నిజజీవితంలో నేను చూసిన సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథ రాసుకున్నాను. బాధ్యతలు ఉన్నవాడు భయపడుతూనే ఉంటాడనే అంశంతో ముడిపడి సాగుతుంది. ఎమోషన్స్‌తో పాటు అంతర్లీనంగా అందమైన ప్రేమకథ ఉంటుంది. మధ్యతరగతి అమ్మాయితో గుణ ప్రేమాయణం అలరిస్తుంది. 'లెజెండ్' సమయంలో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో కూడిన ఈ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ కథను రాసుకున్నాను. 'ఆర్ఎక్స్100'లో కార్తికేయ నటన నన్ను ఆకట్టుకుంది. ఆయన్ని కలిసి ఈ పాయింట్‌ను వినిపించగానే సినిమా చేయడానికి అంగీకరించారు. తొలుత ఇరవై నిమిషాల కథ మాత్రమే రాసుకున్నాను. కార్తికేయ ఒప్పుకున్న తర్వాతే పూర్తి కథ సిద్ధంచేసుకున్నాను. కార్తికేయ పాత్రచిత్రణ గత సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అతడి పాత్ర యువతరాన్ని ఆకట్టుకుంటుంది. ఇందులో అడల్ట్ కంటెంట్ ఉండదు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరిని మెప్పిస్తుంది. ఊహకందని మలుపులతో ఉత్కంఠభరితంగా సాగుతుంది.

**సినిమా ఎలా తీయాలో నేర్చుకున్నా..**

ప్రకాశం జిల్లాలోని నర్సింగోలు నా స్వస్థలం. ఒంగోలులో డిగ్రీ చదువుతున్న రోజుల్లో సినిమాలపై ఆసక్తి కలగడంతో హైదరాబాద్‌కు వచ్చాను. 'తులసి' సినిమాతో బోయపాటి శ్రీను వద్ద దర్శకత్వశాఖలో నా సినీ ప్రయాణం ప్రారంభమైంది. 'వినయవిధేయరామ' వరకు బోయపాటి వద్ద పలు సినిమాలకు పనిచేశాను. దివంగత దర్శకుడు జంధ్యాల మాకు దూరపు బంధువు అవుతారు. జంధ్యాల అనే పేరు కూడా నేను సినిమాల్లోకి రావడానికి ఉపయోగపడింది. గురువు బోయపాటి శ్రీను నుంచి సినిమా తీయడం ఎలాగో నేర్చుకున్నాను. ఏ విధమైన కన్‌ఫ్యూజన్ లేకుండా నాకున్న అనుభవంతో సొంత శైలిలో ఈ సినిమాను తెరకెక్కించాను. బోయపాటి శ్రీను సినిమా చూసి అద్భుతంగా తీశావని మెచ్చుకున్నారు. తదుపరి సినిమాల కోసం విభిన్నమైన పాయింట్‌తో కొన్ని కథలు రాసుకున్నాను.

# కోల్పోయేది ఏమీలేదు!

'నా మనసులోని భావాల్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తాను. ప్రయోజనాల్ని ఆశించి అబద్ధాలు మాట్లాడటం అస్సలు ఇష్టం ఉండదు' అని చెప్పింది పంజాబీ సోయగం తాప్సీ. ఇటీవలకాలంలో పరిశ్రమ గురించి ఈ సొగసరి చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వీటిపై ఆమె స్పందిస్తూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్రసీమలోకి వచ్చాను. నాకు నచ్చిన సినిమాల్ని ఎంచుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను. ప్రతి విషయంలో నేను సొంత నిర్ణయాల్నే తీసుకుంటాను. కాబట్టి ఎవరికి సంజాయిషీ ఇచ్చుకునే అవసరం లేదనుకుంటా. కొందరు నా మాటల్ని అహంభావంగా చిత్రించే ప్రయత్నం చేశారు. అలాంటి వ్యక్తుల్ని పట్టించుకోను. ఎవరైనా నాకు నష్టం చేద్దామని ప్రయత్నించినా భయపడను. ఎందుకంటే ఇక్కడ నేను కోల్పోయేది ఏమీ లేదు. సినిమా అవకాశాలు రాని పక్షంలో నాకు ఇష్టమైన మరో రంగాన్ని ఎంచుకొని రాణిస్తా. నాపై నాకున్న నమ్మకం అలాంటిది' అని ఆత్మవిశ్వాసంతో చెప్పింది తాప్సీ. ప్రస్తుతం ఈ సుందరి హిందీలో 'మిషన్ మంగళ్' 'సాండ్ కీ ఆంఖ్' చిత్రాల్లో నటిస్తున్నది.


తాప్సీ

# ఆత్రేయపురం రాజు కథ!

షకలక శంకర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆత్రేయపురం ఆణిముత్యం'. ఎం.ఎస్. రెడ్డి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రీతూ భర్మేచా కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కె.ఎల్. దామోదరప్రసాద్ క్లాప్ నివ్వగా, పి.సత్యారెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. సీనియర్ దర్శకుడు వి.సాగర్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం షకలక శంకర్ మాట్లాడుతూ 'ఆత్రేయపురం ఆణిముత్యం నా మార్కు హాస్యంతో సాగే ఎంటర్‌టైనర్. దర్శకుడు ఎం.ఎస్.రెడ్డి మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఖచ్చితంగా అందర్నీ ఆకట్టుకుంటుంది' అన్నారు. ఎం.ఎస్.రెడ్డి మాట్లాడుతూ 'ఆత్రేయపురం రాజు అనే యువకుడి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిది. సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఈ చిత్రంలో చర్చిస్తున్నాం. ఆత్రేయపురం, హైదరాబాద్‌లో చిత్రీకరించబోతున్నాం. ఈ కథకు షకలక శంకర్ అయితే బాగుంటుందని ఆయనతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అన్నారు. ఇంద్రజ, తులసి, కాశీవిశ్వనాథ్, డీఎస్ రావు, బీహెచ్ఈఎల్ ప్రసాద్, పటాస్ నూకరాజు, మహిపాల్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: మార్తాండ్ కె. వెంకటేష్, కెమెరా: రవి, సంగీతం: వెంగీ.


శంకర్, రీతూలపై క్లాప్‌నిస్తున్న దామోదరప్రసాద్

# నాగసాధువుగా


సైఫ్అలీఖాన్

సైఫ్అలీఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'లాల్ కప్తాన్'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. ఇద్దరు అన్నాదమ్ముల ప్రతీకార కథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ నాగసాధువుగా అఘోరా తరహా పాత్రలో కనిపించబోతున్నారు. గత రెండేళ్లుగా చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ముఖానికి విభూది పూసుకుని నుదుటికి ఎర్రని తిలకం దిద్దుకుని సాధువు తరహా తలకట్టుతో కనిపిస్తున్న సైఫ్ అలీఖాన్ లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని తొలుత ఆగస్టు లేదా సెప్టెంబర్ 6న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే ప్రభాస్ నటిస్తున్న 'సాహో', అక్షయ్ కుమార్ 'మిషన్‌మంగళ్' అదే సమయంలో విడుదల కానుండంతో ఈ చిత్ర విడుదల తేదీని వాయిదా వేశారు.

# ఈ అమ్మాయి కోసం


భానుశ్రీ

భానుశ్రీ, నోయల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఈ అమ్మాయి'(ఈఎంఐ). దొంతు రమేష్ దర్శకుడు. డి.బుచ్చయ్య నిర్మాత. నాలుగో షెడ్యూల్ పూర్తయింది. సెప్టెంబర్‌లో విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళా ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న చిత్రమిది. లక్ష్యసాధన కోసం ఓ అమ్మాయి ఎలాంటి పోరాటం చేసింది? ఈ ప్రయాణంలో ఓ మంచి మనసున్న యువకుడు ఆమెకు ఎలా అండగా నిలిచాడన్నది ఆకట్టుకుంటుంది. నాలుగో షెడ్యూల్‌లో పోలీస్ స్టేషన్ నేపథ్యంలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. నెలాఖరుతో టాకీ పూర్తవుతుంది. విదేశాల్లో పాటల్ని చిత్రీకరిస్తాం' అని తెలిపారు.

# అక్కినేని బ్రదర్స్ మల్టీస్టారర్?


నాగచైతన్య


అఖిల్

మల్టీస్టారర్ చిత్రాలు చేయడం అక్కినేని కథానాయకులకు కొత్తేమి కాదు. తాజాగా ఈ ఫ్యామిలీ హీరోల నుంచి మరో మల్టీస్టారర్ రాబోతున్నట్లు తెలుస్తున్నది. ఇందులో అక్కినేని సోదరులు నాగచైతన్య, అఖిల్ కథానాయకులుగా నటించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాకు రాహుల్‌రవీంద్రన్ దర్శకత్వం వహిస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన నాగార్జునతో 'మన్మథుడు-2' చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. దర్శకుడిగా రాహుల్‌రవీంద్రన్ పనితనం ఎంతగానో మెచ్చిన నాగార్జున ఈ మల్టీస్టారర్ బాధ్యతలు ఆయనకే అప్పజెప్పారని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఇదిలావుండగా 'మన్మథుడు-2' అనంతరం నాగార్జున కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో 'బంగార్రాజు' చిత్రంలో నటించబోతున్నారు. ఈ సినిమాలో నాగచైతన్య ముఖ్యపాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం పూర్తయిన తర్వాత నాగచైతన్య, అఖిల్ సినిమాను పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారని అంటున్నారు.





